ఆగస్టు
2019

160

సంపుటి : 14 సంచిక : 4 వెల రు. 10/-

ఈ సంచికలో........

సామాజిక న్యాయం : అస్తిత్వవాదం
అంతిమ ఘడియల్లో నయా ఉదారవాదం
ఆఫ్రికా నుండి ఆధునిక మానవజాతి విస్తరణ
ఎఫ్‌పివోల పేరుతో భూములకు ఎసరు
భారత జాతీయ ఉద్యమం, లౌకికవాదం, మతతత్వం
మార్క్స్ - ఏంగెల్స్ చారిత్రాత్మక సమావేశం
సామ్రాజ్యవాద దోపిడీతో పెరుగుతున్న వలసలు
ఉద్యోగుల మెడపై కత్తిగా సాంకేతికాభివృద్ధి
తెలంగాణా పోరాటంలో స్త్రీల వీరోచిత పాత్ర
పోలీసు హింసలకు లొంగని పోరాట స్ఫూర్తి మామిడాల సుబ్బారావు

స్ఫూర్తి

# పోలీసు హింసలకు లొంగని పోరాట స్ఫూర్తి మామిడాల సుబ్బారావు



*పోలీసులు అడవిలో దళాలు ట్రైనింగ్ పొందుతున్న స్థావరాలపైకి దాడి చేసేందుకు వస్తున్నారనే విషయం ఆ కామ్రేడ్‌కు తెలిసింది. అప్పటికే 12 మైళ్ళు నడచి ఊరిలోకి చేరుకున్నారా కామ్రేడ్. చేరగానే తెలిసిన ఈ సమాచారంతో ప్రమాదాన్ని గుర్తించి వెంటనే తిరుగుప్రయాణం కట్టారు. ప్రొద్దు వాలింది. కారుచీకటి, కారు మబ్బులు ఆవరించి ఉన్నాయి. సన్నగా ప్రారంభమైన వర్షం సూదుల్లా గుచ్చడం మొదలు పెట్టింది. దారి డొంక కానరావటంలేదు. అందులోనూ పాటి మట్టితో నిండిన బురదనేల. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి. ఎన్నో అవస్తలుపడి, అతి కష్టం మీద మైళ్లకు మైళ్లు నడిచి తెలతెలవారుతున్నదనగా దళ ట్రెయినింగ్ స్థావరానికి వచ్చారు. శిక్షణలో దెబ్బలుతిన్నవారినీ, కవాతులో కాళ్ళు పట్టుకుపోయినవారినీ, మోకాళ్లు, మోచేతులు, కొట్టుకుపోయిన వారినీ, వాగు ఒడ్డున పొదల కింద ఇసుకలో ఒళ్లు తెలియక నిద్రపోతున్న వారినీ ఈ కామ్రేడ్ చూశారు. దళ సభ్యులందరినీ అప్రమత్తం చేశారు. అందరూ క్షేమంగా తప్పకున్నారు. ప్రొద్దెక్కిన తర్వాత వచ్చిన పోలీసులు ఖాళీ స్థావరాన్ని చూసి తలలు పట్టుకున్నారు. కారణం తెలుసుకున్నారు. అజ్ఞాతంలో ఉన్న ఆ కామ్రేడ్‌ను పట్టుకొచ్చారు. నెల పర్యంతం చిత్రహింసలు పెట్టారు. గుండు సూదులు వేళ్ళల్లో గుచ్చారు. అరచేతిలో గోలీలు పోసి కుర్చీ కాళ్ల కింద చేతులు ఉంచి తొక్కించారు. విసిగిపోయిన వారు కాల్చడానికి తెగబడ్డారు. అప్పడు ఆ కామ్రేడ్ 'పోలీసులకు గుండెచూపి కాల్చుకోండన్నారు'. 'నా ప్రాణం ఉల్లి గడ్డ పైపొరతో సమానం' అన్నారు. 'పై పొరలెన్ని తీసినా ఉల్లిగడ్డ ఘాటుని తీసివేయలేరన్నారు'. పిచ్చెక్కిన పోలీసులు ఆ కామ్రేడ్‌ను గుండెలో తూటాలు దింపారు. మరో జ్యూలియస్ ఫ్యూజిక్‌లా పోరాడిన ఆ వీరుని స్ఫూర్తి అజరామరం.*

**కా**మ్రేడ్ మామిడాల సుబ్బారావు 1933లో నర్సరావుపేట తాలూకా జొన్నలగడ్డ గ్రామంలో నిరుపేద రజక కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మిదేవి, సుబ్బయ్య. మనిషి పొట్టివాడైనా చాలా గట్టివాడు. చురుకైనవాడు. అందరికీ తలలో నాలుకవంటి వాడనే పేరునూ సంపాదించుకున్నారు. చురుకైన కార్యకర్తగా యువజన సంఘం, ప్రజానాట్య మండలి వారు నిర్వహించే అటలు, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. చదువు,వృత్తి చేసుకునేందుకు ఈ కార్యక్రమాలు అతనికి ఎంతో తోడ్పడ్డాయి. తనకు తానుగా పత్రిక చదివే స్థాయికి ఎదిగారు. రజకులందరినీ ఒక్కటిగా చేశారు. ఫలితంగా రజక సేవా సంఘాన్ని ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకు జిల్లా యువజన సంఘంలో కార్యవర్గ సభ్యునిగా ఎంపికయ్యారు.

పార్టీపై నిర్బంధం ఎక్కువైంది. నాయకులందరూ రహస్య జీవితం గడుపుతూ రక్షణ కోసం జొన్నలగడ్డ రావడం మొదలైంది. వారికి రక్షణ బాధ్యతలు చూడాల్సి వచ్చింది. అందువల్ల పరిస్థితులు సమీక్షించి ముఖ్య కామ్రేడ్స్‌కు క్లాసులను నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. చెక్ దేశస్తుడు జూలియస్ ఫ్యూజిక్ రాసిన 'రక్తాక్షరాలు' పుస్తకం చదివి వివరించి చెప్పాలని నిర్ణయించారు. కామ్రేడ్ కొరిటాల రత్తయ్య క్లాసు నిర్వహించారు. ఈ క్లాసులకు కామ్రేడ్ సుబ్బారావుకూడా వచ్చేవారు. మరచిపోకుండా చదువుకునేవారు. తెలంగాణా, సత్తెనపల్లి కామ్రేడ్స్‌కు, నరసరావుపేట ఒక రహస్య కేంద్రంగా మారింది. కామ్రేడ్ మామిడాల సుబ్బారావు ఇతర పట్టణాల్లో ఉన్నవారికి కొరియర్‌గా బాధ్యతలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించేవారు. గ్రామాల్లో గవిడి కాపలాలు పెట్టి నిలువనీడ లేకుండా ప్రభుత్వం తరిమికొట్టడం ప్రారంభించింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్యకర్తలు అడవికి వెళ్లక తప్పలేదు. వారిలో కామ్రేడ్ సుబ్బారావు ఒకరు. ఆ తరువాత వెల్లటూరు ఫారెస్టులోని దళసభ్యులకు ఇచ్చిన ఆయుధ శిక్షణలో పాల్గొని పూర్తిగా శిక్షణ పొందారు. ఆ తరువాత ఫారెస్టులోని దళాలకు, దూర ప్రాంతాలు, పట్టణాల్లో ఉన్న నాయకులకు మధ్య ముఖ్యమైన కొరియర్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు.

ఒక రోజు దళానికి అవసరమైన పనిమీద కామ్రేడ్ సుబ్బారావు వినుకొండ వెళ్లారు. అక్కడ దళ సభ్యుడు ఒకరు పోలీసులకు దొరికిపోయి రహస్యాలన్నీ చెప్పేశాడనీ, పోలీసులు అతన్ని వెంటబెట్టుకుని దళాలు ట్రైనింగ్ పొందుతున్న స్థావరాలపైకి దాడి చేసేందుకు వస్తున్నారనే విషయాన్ని కామ్రేడ్ సుబ్బారావు తెలుసుకున్నారు. అప్పటికే 12మైళ్లు నడచి వినుకొండ చేరిన ఈ కామ్రేడ్ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే తిరుగుప్రయాణం కట్టారు. పొద్దుగూకింది. కటికచీకటి, కారు మబ్బులు ఆవరించి ఉన్నాయి. సన్నగా ప్రారంభమైన వర్షం సూదుల్లా గుచ్చడం మొదలు పెట్టింది. దారి డొంక కానరావటంలేదు. అందులోనూ బురదనేల. ఎన్నో అవస్తలుపడి, అతి కష్టంమీద తెలతెలవారుతున్నదనగా దళ ట్రెయినింగ్ స్థావరానికి చేరుకున్నారు. శిక్షణలో దెబ్బలుతిన్నవారినీ, కవాతులో కాళు పట్టుకుపోయినవారినీ, మోకాళ్లు, మోచేతులు, కొట్టుకుపోయిన వారినీ, వాగు ఒడ్డున పొదల కింద ఇసుకలో ఒళ్లు తెలియక నిద్రపోతున్న వారినీ చూశారు. దళ సభ్యులందరినీ పడుతూ లేస్తూ వెళ్లి చకచకా తట్టి, కొట్టి, కేకలు పెట్టీ లేపారు. శిబిరంపై పోలీసులు దాడిచేయడానికి వస్తున్నారని, వెంటనే వెళ్లిపోవాలని చెప్పారు. చేతికందిన ముఖ్యమైన వస్తువుల్లో కొన్నింటిని తీసుకుని ఆ శిక్షణా శిబిరం నుంచి వెంటనే అందరూ వెళ్లిపోయారు.

ఆ తరువాత 15 నిముషాల్లో ఆ స్థావరాన్ని పోలీసులు చుట్టుముట్టారు. స్థావరంలో మనిషంటూ ఒక్కడూ వారికి కనిపించలేదు. ఖాళీ విస్తరాకులు, మిగిలిన ఆహారపదార్థాలు కనిపించాయి. ఎంతో కష్టపడి ఆచూకీ తెలుసుకుని ఎన్నో వ్యయప్రయాసలకోర్చి దళాలన్నింటినీ మట్టుబెట్టాలని కొండంత ఆశతో అక్కడకు వచ్చిన పోలీసు ఆఫీసర్లందరూ తమ రాక దళాలకు ముందే ఎలా తెలిసిందో అర్థం కాక తలలుపట్టుకున్నారు. వారి ఆశ నిరాశైనందుకు తెల్లముఖాలేసుకుని వచ్చిన దారినే వినుకొండ చేరుకున్నారు. ప్రయాణ బడలికతోవున్న కామ్రేడ్ సుబ్బారావు ఏ మాత్రమూ పాలు మారకుండా వినుకొండ నుంచి వెంటనే చీకటిలో రాళ్లలో, తుప్పల్లో, వర్షంలో తడుస్తూ ప్రాణాలను లెక్కచేయక గుండె ధైర్యంతో ముందుకు దూకి నడచి వచ్చి గాఢ నిద్రలో మునిగి ఉన్న దళాన్ని రక్షించకపోయినట్లయితే అధికారుల ప్లాన్ ప్రకారం పోలీసు తుపాకుల గుళ్లకు 25 మంది

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


**1. పోలీసు హింసలకు లొంగని పోరాట స్ఫూర్తి  మామిడాల సుబ్బారావు............. 2**

**2. సామాజిక న్యాయం: అస్తిత్వవాదం**
తమ్మినేని వీరభద్రం .................... 4

**3.అంతిమ ఘడియల్లో నయా ఉదారవాదం**
ఉత్సా పట్నాయక్, ప్రభాత్ పట్నాయక్ . 8

**4.ఆఫ్రికా నుండి ఆధునిక మానవజాతి విస్తరణ**
ఎంవిఎస్ శర్మ....................... 14

**5. ఎఫ్‌పిఓల పేరుతో భూములకు ఎసరు**
ఎ కోటిరెడ్డి .......................... 17

**6. భారత జాతీయ ఉద్యమం, లౌకికవాదం, మతతత్వం**
బిపన్ చంద్ర ....................... 21

**7. మార్క్స్ - ఏంగెల్స్ చారిత్రాత్మక సమావేశం**
ఎం శివరామకృష్ణన్................ 27

**8. సామ్రాజ్యవాద దోపిడీతో పెరుగుతున్న వలసలు**
విజయప్రసాద్...................... 28

**9. ఉద్యోగుల మెడపై కత్తిగా సాంకేతికాభివృద్ధి**
బి అర్జున్............................ 31

**10. తెలంగాణా పోరాటంలో స్త్రీల వీరోచిత పాత్ర**
కామ్రేడ్ సుందరయ్య................ 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పతనం

**సా**మ్రాజ్యవాదం తలకెత్తుకున్న నయా–ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అంతిమ దశకు తీసుకు వచ్చాయని ప్రఖ్యాత భారతీయ ఆర్థిక వేత్తలు ప్రభాత్ పట్నాయక్, ఉత్సా పట్నాయక్ సంయుక్తంగా ఇటీవల మంత్లీ రివ్యూ పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా మన పాలకులు అనుసరించిన నయా–ఉదారవాద ఆర్థిక విధానాలు మన ఆర్థిక వ్యవస్థను కూడా ఇదే స్థితికి తీసుకువచ్చినట్లు కనిపిస్తోంది. భారత ఆర్థికాభివృద్ధి సూచీలన్నీ ప్రస్తుతం నేల చూపులు చూస్తున్నాయి. ఐఎంఎఫ్, క్రిసిల్ వంటి సంస్థలన్నీ దేశ జిడిపి వృద్ధి లక్ష్యాలను ఎప్పటికప్పుడు తగ్గించి అంచనా వేస్తున్నాయి. వాటి లక్ష్యాల తగ్గింపుకు కారణం మన ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న వాస్తవిక పరిణామాలే.

మన పారిశ్రామికాభివృద్ధి వరుసగా మూడు త్రైమాసికాల్లో దిగజారింది. వ్యవసాయ సంక్షోభానికి ఈ ఏడు వర్షాభావం తోడైంది. నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి పెరిగింది. ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ దిగజారిపోవడంతో ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి నెట్ట బడుతోంది. ఆర్థికాభివృద్ధికి కీలకమైన నిర్మాణ రంగం కుదేలయింది. కార్ల అమ్మకాలు పడిపోవడంతో అనేక కంపెనీలు ఉత్పత్తిని నిలిపి వేస్తున్నాయి. ఈ దేశీయ కారణాలకు అంతర్జాతీయ పరిణామాలు తోడై గత నెల రోజులుగా స్టాక్ మార్కెట్లు పతనమై పోతూ ఉన్నాయి. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరువాత సెన్సెక్స్ సుమారు 2500 పాయింట్లు పతనమైంది. కార్పొరేట్ల ఫలితాలు నిరాశాజనకంగా ఉంటున్నాయి. చాలా మంది బడా కార్పొరేట్లు బ్యాంకుల అప్పులు ఎగ్గొడుతున్నారు.

దేశం బయట పరిస్థితులు కూడా మన ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా లేవు. మన ఎగుమతులకు పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా ద్వారాలు మూసేస్తోంది. అది ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడానికి రక్షణాత్మక విధానాలు అనుసరిస్తోంది. చైనాతో పాటు మన దేశం మీద కూడా అది వాణిజ్య యుద్ధం సాగిస్తోంది. సంస్థాగత మదుపుదారులు మన మార్కెట్ల నుండి పారిపోతున్నారు. దాంతో విదేశీ పెట్టుబడుల రాక తగ్గి విదేశీ మారక నిల్వలు తరిగిపోయి సంక్షోభంలో పడే పరిస్థితి కనిపిస్తోంది.

మాంద్యం భారతీయ ఆర్థిక వ్యవస్థను ఆవహిస్తోందని ఈ పరిణామాలన్నీ సూచిస్తున్నాయి. ఇది ఒక్క భారత ఆర్థిక వ్యవస్థనే కాదు ప్రపంచంలోని అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలనూ ఆవహిస్తోంది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తాత్కాలికమేనని చెప్పిన పెట్టుబడిదారీ ఆర్థిక పండితుల అంచనాలు తప్పని తేలిపోయింది. ప్రపంచంలో నెలకొన్నది వ్యవస్థాగత సంక్షోభమనీ, ఇది మరింత తీవ్రమవుతుందనే వాదనలకు ఈ పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి.

ఇంటా బయటా ఉన్న ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడం సాధ్యమవుతుంది. కానీ కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు దీనికి పూర్తి భిన్నమైన విధానాలు అవలంబిస్తోంది. తనను అధికారంలోకి తెచ్చిన కార్పొరేట్ రంగం రుణం తీర్చుకోడానికి వంద రోజుల్లో వారికి అనుకూలమైన సంస్కరణలు తెస్తానని ప్రకటించింది. లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ రంగ వాటాలు ఉపసంహరించుకుంటోంది. రైల్వేలతో సహా సకల ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోంది. కార్మికులకు రక్షణ కల్పించే చట్టాలను చుట్టచుట్టేస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని అటకెక్కిస్తోంది. కనీస వేతనాల స్థాయిని కుదించి వేస్తున్నారు. ఇవన్నీ కూడా కార్పొరేట్లను మరింతగా మేపి కార్మికులు, వ్యవసాయదారుల పొట్ట కొట్టే చర్యలే. దీని వల్ల మెజారిటీ ప్రజానీకం కొనుగోలు శక్తి మరింత పడిపోతుంది. దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థ దీని వల్ల మరింత పతనమవుతుంది. అంతిమంగా భారం శ్రామిక వర్గంపై పడుతుంది. దీన్ని నివారించాలంటే మోడీ ప్రభుత్వ వినాశకర విధానాలను తుదకంటా ప్రతిఘటించేందుకు ఐక్య ఉద్యమం నిర్మించడం ఒక్కటే మార్గం.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా: **రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# సామాజిక న్యాయం: అస్తిత్వవాదం

**తమ్మినేని వీరభద్రం**



రచయిత సిపిఐ(ఎం)
తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ఇటీవలి కొన్ని వ్యాసాలు, వ్యాఖ్యానాలు చూస్తుంటే సామాజిక న్యాయం, అస్తిత్వవాదం రెండింటినీ కలగలిపి చూస్తూ కొందరు వారికి వారే గందరగోళపడ్తూ, ప్రజలను గందరగోళ పరుస్తున్నారేమో ననిపిస్తున్నది. సామాజిక న్యాయం గురించి మరింతగా సమాజంలో చర్చ జరగటం మంచిదేగానీ అదంటే ఏంటో తెలియని గందరగోళం ఏర్పడకూడదు. కాబట్టి ఏ నినాదం వెనక ఏ ప్రయోజనం ఉంది, సామాజిక న్యాయం ఎందుకు, అస్తిత్వవాద ప్రమాదం ఏమిటి అనే విషయాలపైన కొంత చర్చ జరగటం అవసరం.

సామాజిక న్యాయం అనేది సమాజంలోని ప్రజలందరికీ అన్ని తరగతులకూ, వ్యక్తులకూ అన్ని విషయాల్లో సమ న్యాయం జరగటం లేదా జరగాలని కోరుకోవటానికి పర్యాయపదంగా చెప్పుకోవచ్చు. న్యాయం జరగటం అంటే ఏమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే సమాజంలో దోపిడీ, పీడన లేకుండా పోయినపుడే సామాజిక న్యాయం సంపూర్ణంగా అమలు జరుగుతుంది. దోపిడీ అనేది స్థూలంగా ఆర్థిక విషయాలకు సంబంధించిందైతే, పీడన అనేది ఆధిపత్యం లేక వ్యవహారిక భాషలో చెప్పాలంటే పెత్తనానికి సంబంధించింది అని చెప్పవచ్చు. ఈ ఆధిపత్యం అనేది వివిధ దేశాలలో, ప్రాంతాలలో అనేక రూపాల్లో ఉంటుంది. ఉదాహరణకు పురుషులు స్త్రీలను తక్కువగా చూడటం, కొన్ని వృత్తులు చేసే వారిని మిగతా వారు తక్కువగా చూడటం, కొన్ని జాతులను ఒక జాతి తక్కువగా చూడటం, ఒక ప్రాంతం వారు మరో ప్రాంతం వారిని తక్కువగా చూడటం, ఒక దేశం మరో దేశాన్ని తక్కువగా చూడటం ఇలా అనేక అంశాల్లో ఈ ఆధిపత్యం కనపడుతుంది. వీటిలో కొన్నిటితో బాటు మన దేశంలో కులవ్యవస్థలో ఒక కులాన్ని మరో కులం తక్కువగా చూడటం అనేది ఒక ముఖ్యమైన రూపంగా అమలులో ఉంది. అందువల్ల మన దేశంలో సామాజిక న్యాయం అనగానే కులవ్యవస్థ దొంతరలలో జరుగుతున్న అన్యాయాలను, అసమానతలను సరిదిద్దే ప్రయత్నాల చుట్టూనే చర్చ జరుగుతుండటం మనం చూస్తున్నాం.

సమాజానికి సంపూర్ణ న్యాయం జరగాలంటే దోపిడీ, పీడన లేని సమాజం తప్ప మరో మార్గం లేదని అర్థంజేసుకోవటం, వాటికై పోరాడటం అత్యంత అవసరం. ఈ రెండూ కూడా వర్గపోరాటంలో అంతర్భాగమేననేది మనం గ్రహించాలి. ఈ రెండు సమస్యలనూ అధిగమించగలగటం ప్రస్తుత పెట్టుబడిదారీ విధానం కొనసాగినంత కాలం సాధ్యం కాదు. అందువల్ల ఈ వ్యవస్థ మార్చబడాలి. సమాజం మార్చబడాలంటే వర్గఘర్షణను అభివృద్ధి పర్చటం (వర్గపోరాటం సాగించటం) తప్ప మరో మార్గం లేదు. ఈ రెండు అంశాలలో జరిగే పోరాటాలను అంటే – దోపిడీకి వ్యతిరేకంగా సాగే సోషలిస్టు కృషి, పీడనకు వ్యతిరేకంగా సాగే ప్రజాతంత్ర కృషి – వర్గపోరాటంలో ముఖ్యమైన భాగాలుగా మనం గ్రహించాలి. అందుకే కామ్రేడ్ లెనిన్ ఈ విధంగా చెప్పారు...

"కార్మిక వర్గ పోరాటాలకు నాయకత్వం వహించటం, కార్మికవర్గాన్ని సంఘటిత పర్చటం అనే ఆచరణలో సోషల్ డెమొక్రాట్ల కర్తవ్యాలలో రెండు వ్యక్తీకరణలున్నాయి. ఒకటి సోషలిస్టు కర్తవ్యం(పెట్టుబడిదారీ వ్యవస్థను ధ్వంసం చేసి సోషలిస్టు సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగించే పోరాటం), రెండోది ప్రజాతంత్ర కర్తవ్యం (నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దేశంలో రాజకీయ విముక్తి సాధించి రాజకీయ, సామాజిక వ్యవస్థలను ప్రజాతంత్రీకరించేందుకు సాగించే పోరాటం)" (సోషల్‌డెమొక్రటిక్ కర్తవ్యాలు గ్రంథం 1898)

అయితే ఈ రెండు పోరాటాలూ మిళితమై సాగాలి. ఇంకా చెప్పాలంటే అవి మిళితమై ఉంటాయి. అంటే ప్రతి ప్రజాతంత్ర కృషిలోనూ సోషలిస్టు లక్ష్యం మిళితమై ఉంటుంది. అది పైకి కనపడే రూపంలో కొన్ని సందర్భాల్లో ఉండొచ్చు. ఉదాహరణకు స్త్రీలకైనా పురుషులకైనా సమాన పనికి సమాన వేతనం అనే నినాదంతో పోరాటం జరిపితే అది ప్రజాతంత్ర కృషా లేక సోషలిస్టు కృషా? ఇందులో ఈ రెండూ కలగలిసే ఉన్నాయి. ఎందుకంటే స్త్రీ, పురుష తేడా ఉండకూడదనేది ప్రజాతంత్ర డిమాండ్. అదే సందర్భంలో కూలి పెంచటం, యజమాని లాభాన్ని ఏ మేరకైనా తగ్గించటం అనేది సోషలిస్టు కృషిగా అర్థం చేసుకోవాలి. అయితే కొన్ని సందర్భాలలో ఈ రెండూ కలగలిసి పైకి కనపడకపోవచ్చు. అయినా అంతర్లీనంగా అవి పరస్పర పోషకాలుగా ఉంటాయి. ఉదాహరణకు కులవ్యవస్థకు లేదా కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ముందుకు వచ్చే అనేక డిమాండ్లలో సూటిగా ఆర్థిక ప్రయోజనాలు కనపడకుండా ఆత్మగౌరవమో లేక అణచివేతకు నిరసన మాత్రమే పైకి కనపడవచ్చుగాక, అయినా అవి అంతిమంగా సోషలిస్టు పోరాటానికి తోడ్పడేవిగానో లేక అప్పటి వరకూ సోషలిస్టు కృషికి ఉన్న ఆటంకాలను తగ్గించేవిగానో ఉంటాయి. అయితే అస్తిత్వవాద నాయకత్వంలో లేక అస్తిత్వవాద డిమాండ్లతో ఈ ప్రయత్నం జరిగితే అది అంతిమంగా సోషలిస్టు కృషికి ఆటంకంగా పరిణమించే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల సామాజిక న్యాయం పేరుతో జరిగే కొన్ని అస్తిత్వవాద ఉద్యమాలు, ముందుకొచ్చే కొన్ని అస్తిత్వ డిమాండ్ల పట్ల మనం అప్రమత్తంగా లేకపోతే మన అంతిమ లక్ష్యానికి (సమాజంలోని అందరు ప్రజలకూ సంపూర్ణ న్యాయం–సోషలిజం లక్ష్యానికి) మనం దూరమవుతాం.

ఈ విషయంలో మన పార్టీ కార్యక్రమం 3 విషయాలు స్పష్టంగా చెప్పింది. 1). కుల వ్యవస్థకు, దళితుల అణచివేతకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు శ్రామిక వర్గ ఐక్యతను

పెంపొందించటానికి అత్యవసరం 2). సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు విప్లవోద్యమంలో చాలా ముఖ్యమైనవి 3) వర్గ దోపిడీకి మరియు కుల అణచివేతకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఈ అవగాహనతో అస్తిత్వ నినాదాలు, వాదాలతో విడగొట్టుకుని మన కృషి సాగాల్సి ఉంటుంది.

ఏది అస్తిత్వవాదం? దీనికి చాలా వివరణ అవసరం. ఆ మొత్తం విషయంలోకి ఇక్కడ పోకుండా స్థూలంగా చెప్పుకుందాం. ఒక్క మాటలో చెప్పాలంటే "బాధితుల సమస్యల పరిష్కారం పేరుతో బాధితులను విడదీసే వాదం అస్తిత్వ వాదం" అని చెప్పవచ్చునుకుంటాను. ఒక గ్రామంలో ఒక కులాన్ని కావాలనే ఉద్దేశపూర్వకంగా అణచివేసే చర్యలు అమలు జరుగుతుంటే, ఉదా హరణకు 'మాదిగ వాడకు మంచి నీళ్ల ఇవ్వొద్దు' అని ఒక కులాన్నే లక్ష్యంగా పెట్టుకుని కొందరు అగ్రకుల దురహంకారులు నిర్ణయం తీసుకుని అమలు జరిపితే అది అన్యాయమా, కాదా? అన్యాయమే. మరయితే దానికి వ్యతిరేకంగా ఎవరు పోరాడాలి? ఇక్కడ రెండు మార్గాలు ముందుకు వస్తాయి. ఒకటేమిటంటే జరిగే అన్యాయం మాదిగలకు గాబట్టి, ఆ 'బాధ' వారికే అర్థమవుతుంది గాబట్టి మాదిగలే పోరాడాలి. దానికి ఒక నిర్మాణం (కమిటీ) ఏర్పడాలి, దానిలో మాదిగలే ఉండాలి. ఇదొక పెద్దధోరణి. ఇదే అస్తిత్వవాదం. ఇది తప్పు. ఈ దోరణి ఆ కులానికీ, అంతిమంగా సమాజానికీ నష్టం కలిగిస్తుంది. సమాజంలో ఒక అన్యాయం జరిగితే దానికి అస్తిత్వ హద్దులుండకూడదు. ఆ అన్యాయాన్ని అందరూ ఖండించాలి. అందుకు మనం ప్రయత్నించాలి. అపుడే దానికి అదనపు బలం వస్తుంది. సులభంగా పరిష్కరించబడుతుంది. ఇక్కడ అస్తిత్వ వాదం అంటే కులం పేరు ముందుకు వచ్చిందా లేదా అనేదాన్ని బట్టి కాదు. నిరసన లేక పోరాటాన్ని ఆ కులానికే పరిమితం చేస్తున్నారా లేక ప్రజలందరినీ మేల్కొలుపుతున్నారా అనేది ముఖ్యం. ప్రజలందరినీ మేల్కొలిపి, రంగంలోకి దింపి పరిష్కారానికి ప్రయత్నించేది ప్రజాతంత్ర పోరాటం. అలా కాకుండా కులం ఎదుర్కొనే సమస్యను కులానికే పరిమితం చేసి సమాజంలోని అత్యధికుల మద్దతును ఆ సమస్యకు దూరం చేసేది అస్తిత్వ వాదం. సాదారణంగా ఆయా కులాల నాయకులు ఈ అస్తిత్వవాద ధోరణులలో ఉంటారు. ఇలాంటి ఉద్యమాలను తమ చేతుల్లోనే ఉంచుకోవటం ద్వారా ఆ కులాన్ని చూపుతూ తమ స్వప్రయోజనాలు నెరవేర్చుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. అస్తిత్వవాదాలు ఆయా తరగతులకు లేక కులాలకు ప్రాతినిధ్యం వహించేవిగా వాటికి 'మేలు' చేసేవిగా పైకి తాత్కాలికంగా కనపడినా వాస్తవంగా, అంతిమంగా అవి ఆ కులానికి, ఆ తరగతికి ఇతర ప్రజల మద్దతును దూరం చేసి నష్టం కలిగించే ధోరణులుగానే మనం అర్థం చేసుకోవాలి.

"అంతెందుకు... సాక్షాత్తూ అత్యున్నత అధికార రూపమైన భారత ప్రధాన మంత్రి పదవే ఈనాడు వెనకబడిన కులానికి చెందిన వ్యక్తి అలంకరించాడు. గత అయిదేండ్లుగా పరిపాలన కూడా సాగించాడు. కానీ ఏం జరిగింది? బిసిలకుగానీ, ఇంకా వెనకబడిన ఎస్.సి, ఎస్.టిలకుగానీ జరిగిన మేలేమిటి? సూటిగా చెప్పాలంటే నరేంద్రమోడీ పాలనా కాలంలోనే ఈ అట్టడుగు కులాలకు, వర్గాలకు మరింత అన్యాయం జరిగింది."



కార్మికవర్గ పోరాటాలు

కులాలకు రాజకీయాధికారం అనేది అస్తిత్వవాద డిమాండ్. వర్గం లేదా వర్గాలకు రాజకీయాధికారం అనే మార్క్సిస్టు అవగాహనే శాస్త్రీయమైనది. అంటే అట్టడుగు కులాలలోని నాయకులకు రాజకీయాధికారం వస్తే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయనే వాదన సరైంది కాదు. అలా అధికారం సాధించినా మౌలిక సమస్యలు పరిష్కారం కాని దుస్థితిని మనం అనేక రాష్ట్రాల్లో గతంలో చూశాం. ఇప్పటికీ చూస్తున్నాం. అంతెందుకు... సాక్షాత్తూ అత్యున్నత అధికార రూపమైన భారత ప్రధాన మంత్రి పదవే ఈనాడు వెనకబడిన కులానికి చెందిన వ్యక్తి అలంకరించాడు. గత అయిదేండ్లుగా పరిపాలన కూడా సాగించాడు. కానీ ఏం జరిగింది? బిసిలకుగానీ, ఇంకా వెనకబడిన ఎస్.సి, ఎస్.టిలకుగానీ జరిగిన మేలేమిటి? సూటిగా చెప్పాలంటే నరేంద్రమోడీ పాలనా కాలంలోనే ఈ అట్టడుగు కులాలకు, వర్గాలకు మరింత అన్యాయం జరిగింది. కార్పొరేట్‌లకు సంపదనంతా కట్టబెట్టటం, అగ్రకుల ఆధిపత్యాలు, మతోన్మాద మారణహోమాలు ఈ కాలంలోనే మరింతగా విజృంభించాయి. అందువల్ల ఒక కులం వ్యక్తి ప్రధానమంత్రి అయితేనో, ముఖ్యమంత్రి అయితేనో ప్రజల బాధలన్నింటికీ విముక్తి లభిస్తుందనే భ్రమలోకి ప్రజలను దిగజార్చకూడదు. అయితే వివిధ కులాలకు, వర్గాలకు ప్రాతినిధ్యాన్ని కోరటం ప్రజాతంత్ర డిమాండ్ అవుతుంది. అది ఆయా సెక్షన్‌ల ప్రజానీకం యొక్క మనోభావాలను, ఆత్మగౌరవాన్ని ప్రోత్సహిస్తుందని గ్రహించాలి. అందుకు ప్రయత్నించాలి కూడా. అయితే రిజర్వేషన్ల డిమాండ్లకు సంభందించి కులాల పరిస్థితి దేశమంతా ఒక్క విధంగా లేదు. ముఖ్యంగా బిసి కులాలకు సంబంధించి అస్తిత్వ డిమాండ్‌లను బట్టి కాకుండా ఆ కులాలలో జరిగిన వర్గ విభజనను బట్టి వైఖరి ఉండాల్సి ఉంటుంది. "భారత దేశంలో సామాజిక న్యాయం అంటే అణచివేతకు గురైన తరగతులకు రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం, గుర్తింపు, సమానంగా చూడటం అనే సాదారణ అర్థాలు ఉన్నాయి. ఒక విప్లవకర పార్టీకి వీటిగురించి పోరాడటం అనేది వర్గపోరాటంలోని ప్రజాస్వామిక అంశానికి సంబంధించి ప్రధాన భాగం అవుతుంది. దీనిని విస్మరించటం లేదా తక్కువ జేయటం అంటే అణచివేయబడిన వివిధ తరగతుల యొక్క ప్రజాతంత్ర డిమాండ్లను ముందుకు తెచ్చి వారిని విప్లవోద్యమంలో భాగస్వాములను చేయాలనే కార్మికవర్గ బాధ్యతను నిరాకరించినట్లే అవుతుంది". (పిబి డాక్యుమెంట్)

❝ఆర్థికదోపిడీ అనేది వర్గం ప్రాతిపదికగా జరుగుతుంది తప్ప కులం ప్రాతిపదికగా కాదు. ఒకప్పుడు మన దేశంలో కులమే వర్గంగా, వర్గమే కులంగా ఉంది. అంటే కొన్ని కులాలకు మాత్రమే ఆస్తులు, అధికారాలు, విద్య పరిమితంజేసి అట్టడుగు కులాలకు వాటన్నింటినీ చట్టబద్ధంగానే నిరాకరించిన సందర్భం సుదీర్ఘకాలం సాగింది. అపుడు దోపిడీ అనేది మొత్తంగా కులం ఆధారంగానే జరిగిం ది. కానీ నేడున్న పరిస్థితి అదికాదు. దాదాపు అన్ని కులాల్లో వర్గ విభజన జరిగింది.❞

అలాగే ఏదైనా రాజకీయ పార్టీ ప్రధాన నాయకత్వంలో ఏ కులం వారున్నారు అనేదానిని బట్టి ఆ రాజకీయ పార్టీ స్వభావాన్ని నిర్ణయించ లేము. దళితుడిని రాష్ట్రపతి పదవిలోకి తెచ్చారు గాబట్టి బిజెపి పార్టీ సముచితంగా సామాజిక న్యాయం అమల ుజరుపుతోందనే భ్రమకి గురికావటం కంటే ఘోరమైన విషయం మరోటి ఉండబోదు. నిజానికి ఇలాంటి గిమ్మిక్కుల ద్వారా ప్రజలను భ్రమింపజేసి తమ ఆర్థిక దోపిడీని, సామాజిక అణచివేతను మరింత సులువుగా అమలు జేసుకోవటం పాలక వర్గాల ఎత్తుగడగా ఉంటుంది. ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకు అహర్నిశలు కృషి జేసే కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలను కులం ఆధారంగా అంచనా గట్టటం, విమర్శించటం సహేతుకం కాదు. వివిధ పార్టీల నాయకత్వాల్లోకి, ప్రభుత్వ పదవుల్లోకి దళితులు, ఆదివాసీలు ఇంకా అట్టడుగు అణచివేయబడే కులాలు రావడాన్ని ఆహ్వానించటం, హర్షించటం మంచిదే. కమ్యూనిస్టు పార్టీల్లో కూడా అందుకు కృషి జరగాలని ఆశించటమూ తప్పుకాదు. కానీ దానిని బట్టే పార్టీ స్వభావాన్ని నిర్ణయించటం, నిందించటం మాత్రం దుస్సాహసమే అవుతుంది. ఇది అస్తిత్వవాదంలో నుండి ముందుకు వస్తున్న పెడధోరణి తప్ప మరోటి కాదు.

అలాగే భారతదేశ ప్రత్యేకత పేరిట వర్గం కంటే కులమే ప్రధానమైనదనే భావన కూడా అస్తిత్వవాద రూపంలో ముందుకొస్తుంటుంది. వర్గపోరాటం స్థానంలో కులం ఆధారంగా జరిగే పోరాటాలే విముక్తి సాధించగలవనే భ్రమలు కూడా ఈ భావనలో అంతర్లీనంగా ఉంటాయి. ఇది సరైంది కాదు. ఆర్థికదోపిడీ అనేది వర్గం ప్రాతిపదికగా జరుగుతుంది తప్ప కులం ప్రాతిపదికగా కాదు. ఒకప్పుడు మన దేశంలో కులమే వర్గంగా, వర్గమే కులంగా ఉంది. అంటే కొన్ని కులాలకు మాత్రమే ఆస్తులు, అధికారాలు, విద్య పరిమితంజేసి అట్టడుగు కులాలకు



అస్తిత్వవాద ఉద్యమాలు

వాటన్నింటినీ చట్టబద్ధంగానే నిరాకరించిన సందర్భం సుదీర్ఘకాలం సాగింది. అపుడు దోపిడీ అనేది మొత్తంగా కులం ఆధారంగానే జరిగింది. కానీ నేడున్న పరిస్థితి అదికాదు. దాదాపు అన్ని కులాల్లో వర్గ విభజన జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. పరిమాణంలో హెచ్చు తగ్గులున్నా బిసి, ఎస్.సి, ఎస్.టిలలో కూడా ధనికులు, అగ్రకులాలలో కూడా పేదలు ఏర్పడ్డారు. ఈ స్థితిలో సోషలిస్టు విప్లవం లేదా జనతా ప్రజాతంత్ర విప్లవం సాధించబడాలంటే అట్టడుగు కులాల ప్రజలందరూ ఆ వర్గవిప్లవం లో పాల్గొనే అవకాశం ఉండదు. ఆ యా కులాల్లో బూర్జువా, భూస్వాములుగా మారిన వారు దానికి అడ్డుపడతారు. అలా జరిగినపుడు ఆ కులాలలోని పేదలంతా ఈ విప్లవపోరాటం లో భాగస్వాములు కావాలంటే మార్గమేమిటి? ఇంకో రూపంలో చెప్పాలంటే అన్ని కులాల్లోని పేదలంతా, కార్మికులంతా ఒక్కట య్యే మార్గం, ఒక వర్గంగా ఏర్పడే మార్గం ఏమిటి?

అట్టడుగు కులాల పేదలు రెండు సమస్య లెదుర్కొంటున్నారు. ఒకటి ఆర్థిక దోపిడీ, రెండోది కులపీడన. ఈ రెండో అంశంలో అంటే కుల పీడనను ఆ కులంలోని పేదలేకాకుండా ధనికులు కూడా ఎదుర్కొంటున్నారు. ఈ పీడనకు వ్యతిరేకంగా జరిగే కృషిలో ఆ ధనికులు, మధ్యతరగతి కూడా క్రియాశీలమైన పాత్రను పోషిస్తున్నారు. నాయకత్వం వహిస్తున్నారు. నాయకత్వం వహించే ఈ సెక్షన్‌కు ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే ఆసక్తి ఉండదు. ఈనాటి కుల సంఘాలన్నీ దాదాపుగా వీరి నాయకత్వంలోనే ఉన్నాయి. అందుకే వీరు సాగిస్తున్న ఉద్యమాలు, పోరాటాలలో ఆర్థిక డిమాండ్ల కంటే, పీడనకు సంబంధించిన, అంటే ప్రజాతంత్ర డిమాండ్లు మాత్రమే ఉంటాయి. వాటితోబాటు, మరో కులాని కంటే తమకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలనే అస్తిత్వ డిమాండ్లు మరింత ఎక్కువగా ఉంటాయి. ఆ డిమాండ్లకే ఆ కులాల్లోని పేదలు కూడా ఆకర్షితులవుతుంటారు. ఈ ప్రభావాల నుండి అట్టడుగు కులాల పేదలను బయటకు తేవటం, వారికి నిజమైన విముక్తి లభించే వర్గవిప్లవంలో భాగస్వాములను చేయటం ఎలా అనేది ముఖ్యమైన సవాల్‌గా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించే క్రమంలో ఇక్కడ మూడు ఫలితాలు సంభవించే మూడు కార్యాచరణలను మనం గమనించాలి. అప్పుడు ఈ సవాల్‌కు సరైన సమాధానం దొరుకుతుంది. ఆర్థిక దోపిడీ–సామాజిక పీడన ఈ రెండింటిలో ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా మాత్రమే మన కార్యక్రమాలు, కార్యాచరణ పరిమితమైతే ఏం జరుగుతుంది? అట్టడుగు కులాల్లోని పేదలు మన ఉద్యమంలోకి రాకుండా, ఆర్థిక సమస్యల వరకూ తాత్కాలి కంగా వచ్చినా మనల్ని విశ్వసించకుండా, వారి కులనాయకుల ప్రభావంలోనే అస్తిత్వ ఉద్యమాల్లో మునిగితేలుతుంటారు. వర్గ ఐక్యత అసాధ్యమౌతుంది. వర్గ విప్లవం అసంభవమౌతుంది. రెండో మార్గంగా వాళ్లను ఆకర్షించే పనిలో వారి కులాల నాయకులు కోరినట్లుగా ఆర్థిక డిమాండ్లు పక్కనబెట్టి కులపీడనకే ప్రాధాన్యత యిచ్చి, అస్తిత్వ డిమాండ్లుకూడా అంగీకరించి మనం కృషిజేస్తే ఆ సమస్యల వరకూ కలిసి వచ్చినట్లు కనపడినా, అంతిమంగా దోపిడీ వర్గాల ప్రయోజనాలే కుల నాయకుల ప్రయోజనాలుగా ఉంటాయి గాబట్టి అది అంతిమంగా వర్గవిప్లవానికి ఎంతమాత్రం ఉపయోగపడదు. ఈ రెండు తప్పు కార్యాచరణలు కాకుండా ఆర్థిక దోపిడీ, సామాజిక సమస్యలను మేళవించి మన కృషి ఉండాలి. అపుడు అస్తిత్వవాదుల లేక కులనాయకుల పరిమితులు ఆ కులాల్లోని పేదలకు అర్థమౌతాయి. వర్గ ఐక్యత సుసాధ్యమౌతుంది. ఈ మార్గం మనం అనుసరించాలి. ఈ అంశాన్ని సూటిగా చెప్పాలంటే సోషలిస్టు విప్లవం ద్వారానే మానవాళి

ఎదుర్కొంటున్న సమస్త సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఆ విప్లవం వర్గపోరాటం ద్వారానే సాధ్యం. వర్గపోరాటం జరగాలంటే వర్గ ఐక్యత అవసరం. వర్గాల్లో కులాలుండటం వల్ల వాటి ప్రభావం వల్ల వర్గఐక్యత సాధ్యపడటం లేదు. కుల ప్రభావాలు పోవాలంటే ఆర్థిక పోరాటాలతో బాటు, కులపీడనకు వ్యతిరేకంగా ఉద్యమాలు ద్వారా తప్ప సాధ్యం కాదు.

ఇక్కడే మరో విషయం చెప్పుకోవాలి. సామాజిక సమస్యలపై కృషి వర్గ అనైక్యతకు దారితీస్తుందనే అభిప్రాయాలు అక్కడక్కడా వ్యక్తమవుతుంటాయి. ఇది ఒక ధోరణిగా కూడా ఉంది. ఇది తప్పు. పైగా వర్గ ఐక్యత సాధించాలంటే సామాజిక సమస్యలపై కృషి తప్పనిసరి అనేది మార్క్సిస్టు అవగాహనగా ఉంది. ఎందుకంటే భారత దేశంలో వర్గాలు కులాల నుండి వచ్చిన ప్రజలతో ఏర్పడ్డాయి. వారు ఈ వర్గంలో చేరక ముందు నుండీ కుల పీడనను అనుభవిస్తూ వచ్చారు. అందువల్ల వారు ఆర్థిక జీవనంలో ఒక వర్గంగా ఉన్నప్పటికీ వారి చైతన్యంలో కుల భావనల ఆధిపత్యం తేలిగ్గా పోదు. ఉదాహరణకు కూలీలుగా, కార్మికులుగా ఇపుడు దాదాపు అన్ని కులాల వాళ్లూ ఉన్నారు. ఆర్థిక సమస్యలపై పోరాటాలు జరుగుతున్నపుడు వాళ్లంతా ఒక వర్గంగా వ్యవహరించాలి. అయితే చాలా సందర్భాలలో వారిలో తమ కులం, సాంస్కృతిక భావజాలం ఎక్కువగా పనిజేస్తుండటం మనం చూస్తున్నాం.వాటివల్ల ఉద్యమంలో అనైక్యత వస్తుంది. ఈ అనైక్యతను అధిగమించాలంటే వారిలో ఆర్థిక సమస్యలతో బాటు సామాజిక, సాంస్కృతిక సమస్యలపై ఏక కాలంలో కృషి జరపటం తప్ప మరోమార్గం లేదు.

"ఉదాహరణకు కూలీలుగా, కార్మికులుగా ఇపుడు దాదాపు అన్ని కులాల వాళ్లూ ఉన్నారు. ఆర్థిక సమస్యలపై పోరాటాలు జరుగుతున్నపుడు వాళ్లంతా ఒక వర్గంగా వ్యవహరించాలి. అయితే చాలా సందర్భాలలో వారిలో తమ కులం, సాంస్కృతిక భావజాలం ఎక్కువగా పనిజేస్తుండటం మనం చూస్తున్నాం.వాటివల్ల ఉద్యమంలో అనైక్యత వస్తుంది. ఈ అనైక్యతను అధిగమించాలంటే వారిలో ఆర్థిక సమస్యలతో బాటు సామాజిక, సాంస్కృతిక సమస్యలపై ఏక కాలంలో కృషి జరపటం తప్ప మరోమార్గం లేదు."

ఆర్థిక సమస్యలపై పోరాటాలే వర్గపోరాటాలైనట్లు, సామాజిక సమస్యలపై చేసే కృషి వర్గపోరాటం కానట్లు ఈ రెండింటికీ పోటీ పెట్టి మాట్లాడటం కూడా అక్కడక్కడా జరుగుతోంది. ఇది పొరపాటు అవగాహన. నిజానికి వర్గ పోరాటం అనేది చాలా విస్తృతార్థం కలిగి ఉంది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, సైద్ధాంతిక రంగాలలో వర్గపోరాటం ఉంటుంది. ఆర్థిక రంగంలో భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల దోపిడీని వ్యతిరేకించే, లేదా తక్షణంగా వీలైనంత తగ్గించే రూపాల్లో కూలి, భూమి, ఇల్లు, సంక్షేమం ఇతర అనేక రూపాల్లో ఆర్థిక డిమాండ్లతో ఈ రంగంలో వర్గపోరాటం సాగుతుంది. కులవ్యవస్థ, వివక్ష, స్త్రీలను అణచి ఉంచటం, ఇతర అనేక వివక్షల ద్వారా ఆర్థిక దోపిడీ సులభం అవుతోంది. వాటికి వ్యతిరేకంగా జరిగే పోరాటం అంటే అది సామాజిక రంగంలో వర్గపోరాటమే. కుటుంబం, ఆచారాలు, నీతినియమాలు, పండుగలు, భాష, మత భావనలు, సినిమాలు, కళలు, కవిత్వాలు, అంతర్జాలం, మీడియా వగైరా అన్నీ ఆయా సమాజాల్లో దోపిడీ వర్గాలకు వారి దోపిడీని సులభతరం జేసేందుకు ఉపయోగపడే సాధనాలుగానే ఉంటాయి. వాటిని ఎదుర్కొనేందుకు, ప్రత్యామ్నాయ భావజాలాన్ని ప్రజల్లో ప్రవేశపెట్టేందుకు జరిగే కృషి, స్థాపించే సంస్థలూ సాంస్కృతిక రంగంలో సాగే వర్గపోరాటంగా ఉంటాయి. రాజకీయ వ్యవస్థ, దాని ద్వారా ఏర్పడే ప్రభుత్వమూ, రాజ్యాంగ యంత్రమూ దోపిడీని రక్షించే ముఖ్య సాధనాలు. ప్రభుత్వం అనేది దోపిడీ వర్గాల వ్యవహారాలను చక్కదిద్దే మేనేజ్‌మెంట్ కమిటీ తప్ప మరోటి కాదని కార్ల్ మార్క్స్ అంటాడు. దానికి వ్యతిరేకంగా రాజకీయ రంగంలో జరిగే కృషి అంతా రాజకీయ రంగంలో వర్గ పోరాటంగా ఉంటుంది. తమ దోపిడీని సుస్థిరం జేసుకోవాటానికి ఉపయోగపడే సిద్ధాంతాలను, భావజాలాన్ని ప్రజల్లో నిరంతరం పాలక వర్గాలు ప్రవేశపెడుతుంటాయి. ప్రజలు అత్యధికులు వాటికి తేలిగ్గా గురవుతుంటారు. అందుకే దోపిడీ సమాజంలో పాలక వర్గాల భావాలే ప్రజల భావాలుగా చలామణీ అవుతుంటాయి. అందువల్ల వాటిని తుత్తునియలుజేస్తూ ఆ సిద్ధాంతాలను, భావజాలాన్ని ఎండగట్టే కృషి జరగాలి. ఇది సిద్ధాంత రంగంలో జరిగే వర్గపోరాటంగా ఉంటుంది. వర్గపోరాటానికి ఉండే ఈ బహుముఖాలను, విశ్వరూపాన్ని అర్థం చేసుకుంటేనే దానిని మనం సమగ్రంగా, సక్రమంగా నిర్వహించగలం.

ఈ అంశాలలో ఆర్థిక రంగం సమాజ పునాదిగా ఉంటుంది. కులం పునాదిలోనూ ఉపరితలంలోనూ ఉంటుంది. మిగతా అంశాలు అంటే రాజకీయాలు, పార్టీలు, ప్రభుత్వం, కళలు, సాహిత్యం, సినిమా, విద్య, భాష, సంస్కృతి, నీతినియమాలు వగైరా అన్నీ ఉపరితలంలో ఉంటాయి. అంతిమంగా పునాది సమాజ గమనాన్ని నిర్ణయించే కీలకాంశంగా ఉన్నప్పటికీ పునాది, ఉపరితలం ఒకదానిపై ఒకటి ప్రభావం చూపుతాయని మనం అర్థం చేసుకోవాలి. అందువల్ల వర్గపోరాట కృషి పునాది అంశంలో మాత్రమే కాక ఉపరితల అంశాలన్నింటిలోనూ సాగాల్సి ఉంటుంది. మన కృషి మోతాదు పునాదికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలంటే కూడా ఆర్థిక, సామాజిక అంశాలపై కేంద్రీకరణ ఉండాలి. అందుకే భారతదేశంలో వర్గపోరాటం అనేది ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా, సామాజిక పీడనకు వ్యతిరేకంగా రెండుకాళ్లపై నడవాల్సి ఉంటుంది అని మనం చెపుతున్నాం. ఇక్కడ ఎంగెల్స్ మాటలు గుర్తు చేసుకోవటం అవసరం. "చరిత్ర పట్ల భౌతికవాద దృక్పథం ప్రకారం చరిత్రను అంతిమంగా నిర్దేశించేది ఉత్పత్తి, దైనందిన జీవన పునరుత్పత్తే. దీనికి మించి నేనుగానీ, మార్క్స్‌గానీ ఏమీ చెప్పలేదు. అందువల్ల ఎవరైనా ఆర్థిక అంశమే నిర్ణాయకమై నదని వక్రీకరిస్తే, మా సూత్రీకరణను అర్థం లేని పదబంధంగా, అమూర్త భావనగా మార్చటమే. ఆర్థిక పరిస్థితి పునాది అయితే ఉపరితలం లోని అనేక అంశాలు – వర్గపోరాటాల రాజకీయ వ్యక్తీకరణలు, వాటి పర్యవసానాలు, విజయాలు సాధించాక వివిధ వర్గాలు రూపొందించుకునే రాజ్యాంగాలు, న్యాయ వ్యవస్థ రూపాలు, ఇంకా నిజజీవిత పోరాటాలలో ఆయా పోరాట భాగస్వాముల ఆలోచనలతో ముందుకొచ్చే అనేక రాజకీయ న్యాయపరమైన తాత్విక సిద్ధాంతాలు, ధార్మిక భావనలు, ఇవన్నీ పిడివాదాలుగా మారే తీరు వంటి పర్యవసానాలు కూడా చారిత్రక పోరాటాల గతిని ప్రభావితం చేస్తాయి. ఇంకా చెప్పాలంటే ఈ పోరాటాల రూపాన్ని కూడా ముందే నిర్ణయిస్తాయి. అనేక సంఘటనల పరంపరలో ఇటువంటి అన్ని అంశాల మధ్య జరిగే పరస్పర సంబంధమే (సంఘటనలు, పరిణామాలు వాటి మధ్య ఉన్న పరస్పర సంబంధం ఎంత అన్యాపదేశంగా ఉంటుందంటే చివరకు వాటి మధ్య సంబంధం లేదనో,

(మిగతా 35వ పేజీలో)

# అంతిమ ఘడియల్లో నయా ఉదారవాదం



రచయితలు ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు

**ఉత్సా పట్నాయక్, ప్రభాత్ పట్నాయక్**

నయాఉదారవాద తాత్వికతపై హ్యారి మాగ్డాఫ్ రచించిన 'సామ్రాజ్యవాద యుగం' ఒక అద్భుతమైన గ్రంథం. రెండో ప్రపంచ యుద్ధం తరువాత రాజకీయంగా వలసవాదం అంతం కావడం అంటే సామ్రాజ్యవాదం అంతం కావడం కాదని రచయిత ఇందులో నిరూపించారు. ఈ పుస్తకంలో రెండు ముఖ్యమైన పార్శ్వాలు ఉన్నాయి. ఒక వైపు లెనిన్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆ రోజుల్లో పెట్టుబడిదారీ విధానం ప్రపంచవ్యాప్తంగా ఎలా వ్యాపించిందో క్లుప్తంగా వివరించారు. రెండో వైపు మార్క్సిస్టు సాహిత్యంలో అతి తక్కువగా చర్చించే విషయం – సామ్రాజ్యవాదానికి అవసరమైన వాటిని గురించి – కూడా చర్చించారు. మిగిలిన విషయాలతో పాటు, హ్యారి మాగ్డాఫ్, మూడో ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాద కేంద్రాలకు ముడి సరుకులు ఎగుమతి చేయడాన్ని ఏంతో కీలక మైన విషయంగా చర్చించారు. అంతే కాదు ముడి పదార్థాల విలువ స్థూల పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుతున్నందున వాటి ప్రాధాన్యత తగ్గుతుందన్న వాదనను తోసిపుచ్చారు. ముడి పదార్థాలు లేకుండా సరుకులు ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు కదా అనే సాధారణ వాదనను ముందుకు తెచ్చారు.

మూడో ప్రపంచ దేశాలు ఆర్థికంగా వలస విధానం నుండి విముక్తి పొంది, కొత్తగా స్వతంత్రం పొందిన తరువాత ఆ దేశాలు తమ వనరులపై తామే ఆధిపత్యం వహించడాన్ని సామ్రాజ్యవాద దేశాలు అడ్డుకుంటున్న కాలంపై మాగ్డాఫ్ దృష్టి పెట్టారు. మూడో ప్రపంచ దేశాలపై ఉపయోగించడానికి సామ్రాజ్యవాద అంబుల పొదిలో సిద్ధంగా ఉన్న అస్త్రాలన్నింటిని ఎత్తిచూపారు. అయితే అయన రాసినది నయాఉదారవాద విధానాల అమలుకు ముందు కాలంలో. ఇప్పుడు మనమున్నది పూర్తిగా నయా ఉదారవాదం అమలవుతున్న కాలమే కాదు, ఈ నయా ఉదారవాద విధానాలుఒక ముగింపు దశకి చేరుకున్న కాలంకూడా. సమకాలీన సామ్రాజ్య వాదాన్ని ఈ నేపథ్యంలో పరిశీలించాలి.

**ప్రపంచీకరణ ఆర్థిక సంక్షోభం**

నయాఉదారవాద ప్రపంచీకరణ చివరి దశకి చేరుకుందనడానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది ప్రపంచవ్యాప్తంగా అధికోత్పత్తి చేసే ధోరణి పెరగడం. రెండోది, వ్యవస్థలో ఈ రకమైన ధోరణిని నివారించేందుకు ఆస్తుల ధరలలో బుడగలు సృష్టించడం. అంతిమంగా ఈ బుడగలు పేలి ఆర్థిక సంక్షోభానికి దారి తీయడం జరుగుతుంది. చివరికి బ్రిటిష్ ఆర్థిక చరిత్రకారుడు శామ్యూల్ బెర్రిక్ సాల్ మాటల్లో చెప్పాలంటే "మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు వలసవాద విధానం అమలులో ఉన్నప్పుడు అదనపు మార్కెట్లను స్వాధీనం చేసుకోవటానికి, లేదా రెండో ప్రపంచ యుద్ధం తరువాత, ప్రభుత్వం తన ఖర్చులను పెంచుకుని డిమాండ్‌ను పెంచడం లాంటి విధానాలతో "మార్కెట్ల నిరంతర సరఫరా" పెంచడానికి ఉన్న అవకాశాలు సమకాలీన సామ్రాజ్యవాద కేంద్రాలకు లేవు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గత కాలంలో నిజ వేతనాలు పెరిగే క్రమం శ్రామికులఉత్పత్తి పెరిగే క్రమం కన్నా తక్కువగా ఉండడం, ఉత్పాదకత పెరగటం ఇందుకు కారణం. ఇందువల్లనే ప్రపంచ ఉత్పత్తిలో అదనపు విలువ భాగం పెరుగుతూ పోతున్నది. మిచెల్ కలేకి, జోసెఫ్ స్టెయిన్ లని అనుసరిస్తూ పాల్ బరన్, పాల్ స్వీజి వాదిస్తున్నట్టు గుత్త పెట్టుబడిదారీ విధానంలో అదనపు విలువ పెరుగుదల, లేదా వేతనాల నుండి అదనపు విలువవైపుకు మరలిపోవడం వలన సగటు డిమాండ్ తగ్గుతుంది. ఆదాయానికి వినిమయానికి ఉన్న సగటునిష్పత్తి అదనపు విలువపై ఆధారపడిన వారి కన్నా వేతన జీవులలో ఎక్కువగా ఉండడం ఇందుకు కారణం. అందువలన నిర్దిష్ట కాలంలో పెట్టుబడుల స్థాయి కొంత ఉందనుకుంటే, ఇటువంటి మార్పు వలన వినిమయ డిమాండ్ తగ్గుతుంది. ఫలితంగా సరాసరి డిమాండ్, ఉత్పత్తి, ఉత్పాదకత కూడా తగ్గిపోతుంది. అందుబాటులో ఉన్న సామర్థ్యం నిరుపయోగంగా ఉండడంతో క్రమంగా పెట్టుబడులు తగ్గుతాయి. సగటు డిమాండ్ కూడా తగ్గుతుంది. వినిమయ డిమాండ్ తగ్గడంతో ఆ వైపు నుండి కూడా పెట్టుబడులకు ప్రోత్సాహం ఉండదు.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని నయా ఉదారవాద దశలో నిజ వేతనాలు ఎందుకు పెరగడం లేదు? ఎందుకంటే, మూడో ప్రపంచ దేశాలలో తక్కువ వేతనాలు ఉండడం వలన ప్రపంచ వ్యాప్తంగా తమ ఉత్పత్తులకు ఉన్న గిరాకీని తీర్చడానికి పెట్టుబడిదారులు తమ ఉత్పత్తులను సామ్రాజ్యవాద కేంద్రాల నుండి మూడో ప్రపంచ దేశాలకు తరలిస్తున్నారు.

చారిత్రికంగా కార్మికుడు మూడో ప్రపంచ దేశాలనుండి పారిశ్రామికంగా అభివృద్ధి అయిన దేశాలకు ఈ నాటికీ స్వేచ్ఛగా వలస పోలేదు. కానీ పెట్టుబడి చట్టబద్ధంగానే ఎక్కడికయినా తరలిపోవచ్చు. అయినా పెట్టుబడి గనులు, తోటలు వంటి వాటిలో తప్ప ఇతర రంగాలకు విస్తరించలేదు. దీని వలన వలసల కాలంనాటి అంతర్జాతీయ కార్మిక విభజన బలపడింది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఈ విధంగా విభజించబడి ఉండటం,సామ్రాజ్యవాద కేంద్రాలలో కార్మికుల ఉత్పాదకత పెరగడంతో వారి వేతనాలు కూడా పెరిగాయి. సామ్రాజ్యవాద కేంద్రాలలో పెరిగిన ఉత్పత్తులు మూడో ప్రపంచ దేశాలలోని ఉత్పత్తులను దెబ్బతీయడం, అక్కడి అదనపు విలువ విదేశాలకు తరలిపోవడం మూడో ప్రపంచ దేశాలలో కార్మిక సైన్యం పెరిగిపోడానికి కారణం.

ప్రస్తుత ప్రపంచీకరణతో సామ్రాజ్యవాద కేంద్రాలలోని పెట్టుబడులు మూడో ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా ఉత్తర, దక్షిణ, ఈశాన్య ఆసియా దేశాలకు తరలిపోవడం ప్రారంభమైంది. తమ ఉత్పత్తులకున్న ప్రపంచ వ్యాపిత డిమాండ్‌కి తగినట్టు ఉత్పత్తులను పెంచుకోడానికి అతి తక్కువ వేతనాలిచ్చే ఈ ప్రాంతాల

లోకి పెట్టుబడులను తరలించి, తమ అదనపు విలువను పెంచుకుని ద్రవ్య పెట్టుబడి ప్రయోజనం పొందుతున్నది. ఫలితంగా సామ్రాజ్యవాద కేంద్రాలలోని కార్మికుల వేతనాలు పెరగడం ఆగిపోయింది. జోసెఫ్ స్టిగ్లిట్జ్ గమనించినట్టు 2011 తరువాత అమెరికాలో సగటు పురుషుని నిజవేతనాల రేటు1968కి సమానంగా ఉంది. ఒక్కొక్కసారి అంతకంటే తక్కువ కుడా ఉంది.

అయితే ఇటువంటి మార్పుల కారణంగా మూడో ప్రపంచ దేశాలలో అదనపు కార్మిక సైన్యం పూర్తిగా నశించి పోలేదు. ఇందుకు కారణం కూడా నేటి ప్రపంచీకరణ లోని మరో అంశమే. ఈనాటి ప్రపంచీకరణ మూలంగా ఆదిమ సంచయనం విశృంఖలంగా అమలు జరగడం వలన, ఇప్పటివరకు కొంత రక్షణ పొందుతున్న మూడో ప్రపంచ దేశాలలోని చిన్న ఉత్పత్తి దారులు, రైతులు ఈ స్వదేశీ, విదేశీ పెట్టుబడి దాడులతో తమ ఉపాధులు, జీవనం కోల్పోతున్నారు. వలసవాదం తరువాతి కాలంలో ఏర్పడిన ప్రభుత్వాలు వీరికి కొంత మేరకైనా రక్షణ కల్పించేవి. నయాఉదారవాద విధానాల అమలుతో ఆ రక్షణ కవచాలు అన్నీ పూర్తిగా తొలగించ బడ్డాయి. ఫలితంగా వారి ఆదాయాలు పడిపోయాయి. వారి భూములు ఆక్రమించ బడ్డాయి. బడా పెట్టుబడి దారులు అభివృద్ధి కార్యక్రమాల పేర యథేచ్ఛగా వాటిని వినియోగించుకుంటున్నారు.స్థూల జాతీయోత్పత్తి బాగా వృద్ధి చెందిన దేశాలలోకూడా ఉద్యోగ కల్పనలో వృద్ధిలేదు. అదనంగా ఉపాధులు కోల్పోవడం వలన, అదనంగా పెరిగిన కార్మికులకు ఉపాధి కల్పించడం కాదుకదా, సహజంగా పెరిగిన కార్మికశక్తికి కూడా సరి సమానమైన ఉపాధి కల్పన లేదు. అందువలన ఉన్న కార్మిక శక్తి పూర్తిగా వినియోగించబడదు. నిజానికి నిజవేతనాలు జీవించి ఉండగలిగే స్థాయిలోనే నిలిపివేయబడుతుండడం వలన సామ్రాజ్యవాద కేంద్రాలలో నిజవేతన స్థాయి కూడా ఎదుగు బొదుగూ లేకుండా స్థిరంగా ఉంచ బడుతుంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతటి లోనూ నిజ వేతనాలు స్థిరంగా ఉండి పోతున్నాయి.

ప్రపంచీకరణ మూలంగా ఉత్పత్తి పెరిగే ధోరణి కొనసాగుతున్నా ఈ పెరిగిన ఉత్పత్తులను వినియోగించేందుకు అవసరమైన నిధులను వినిమయదారుల వద్ద ఉండే చర్యలు చేపట్టడం లేదు. (బరన్, స్వీజీ ప్రకారం, అమెరికాలో సైనిక వ్యయం పెంచడం ద్వారా దీనిని ఎదుర్కొంటున్నారు) ఉద్యోగిత పెంచేందుకు ప్రత్యక్షంగా రాజ్యం జోక్యం చేసుకోడాన్ని ప్రస్తుత పరిస్థితులలో ద్రవ్యపెట్టుబడి అంగీకరించదు.

**“ఈనాటి ప్రపంచీకరణ మూలంగా ఆదిమ సంచయనం విశృంఖలంగా అమలు జరగడం వలన, ఇప్పటివరకు కొంత రక్షణ పొందుతున్న మూడో ప్రపంచ దేశాలలోని చిన్న ఉత్పత్తి దారులు, రైతులు ఈ స్వదేశీ, విదేశీ పెట్టుబడి దాడులతో తమ ఉపాధులు, జీవనం కోల్పోతున్నారు. వలసవాదం తరువాతి కాలంలో ఏర్పడిన ప్రభుత్వాలు వీరికి కొంత మేరకైనా రక్షణ కల్పించేవి. నయాఉదారవాద విధానాల అమలుతో ఆ రక్షణ కవచాలు అన్నీ పూర్తిగా తొలగించ బడ్డాయి.”**



పరిశ్రమలలో పనిచేస్తున్న అమెరికా కార్మికులు

పెట్టుబడిదారులపై పన్నులు వేయడాన్ని వ్యతిరేకిస్తుంది. దేశ బడ్జెట్‌లో లోటుద్వారా ఈ ఖర్చులను ఎదుర్కోడానికి కూడా అంగీకరించదు. కార్మికులపై అధికంగా పన్నులు వేయడం ద్వారా దేశఖజానా ఖర్చులు భరించ వలసి వస్తే వారి దగ్గర వినిమయానికి ఖర్చుచేసేందుకు డబ్బులు తగ్గుతాయి. అసలే కార్మికులు తమ ఆదాయాలలో ఎక్కువ భాగాన్ని నిత్యావసరాలకు ఖర్చు చేస్తుంటారు. కాబట్టి ఏమాత్రం అయినా అదనంగా వచ్చిన ఆదాయాన్ని రాజ్యం వసూలు చేసుకుంటే, ఇక కార్మికులకు అదనంగా ఖర్చు చేసే వీలుండదు. అందువలన అదనపు గిరాకీ ఉత్పన్నం అవదు.కాబట్టి రాజ్యం ఈ అధికోత్పత్తి నుండి బయటపడాలంటే పెట్టుబడిదారులపై అధికంగా పన్నులన్నా వేయాలి. లేదా లోటు బడ్జెట్‌ల ద్వారా ప్రభుత్వ ఖర్చులు పెంచనన్నా పెంచాలి. కానీ ఈ రెంటిని ద్రవ్య పెట్టుబడి వ్యతిరేకిస్తుంది.

ద్రవ్య పెట్టుబడి పరిధి ఒక రాజ్యం అయినపుడు కేవలం ఆ రాజ్యం దీనిని వ్యతిరేకించింది. రాజ్యం కూడా కొన్ని పరిస్థితులలో, రెండో ప్రపంచ యుద్ధం తరువాతి సంక్షోభాలను ఎదుర్కొన్నప్పటి లాగా, ద్రవ్య పెట్టుబడిని ఖాతరుచేయకుండా ఉండగలిగింది. కానీ ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి ప్రపంచం అంతా ఏ అడ్డంకులు లేకుండా సంచరించగలదు. అందువలన ద్రవ్య లోటు అన్నది కీలకంగా మారింది. ద్రవ్య పెట్టుబడి వ్యతిరేకత నిర్ణయాత్మక మవుతుంది. ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరించ బడడంతో దాని ఇష్టానికి వ్యతిరేకంగా ఏ రాజ్యం అయినా నిర్ణయాలు తీసుకుంటే ద్రవ్య పెట్టుబడి ఆ దేశం నుంచి ఎగిరిపోతుంది. అది ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుంది. అందువలనే రాజ్యం ద్రవ్య పెట్టుబడి డిమాండ్లకు తల ఒగ్గుతుంది. ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడానికి వెనుకాడుతుంది. ఫలితంగా ద్రవ్య పెట్టుబడుల అనుకూల విధానాలను అమలు జరపటానికి మొగ్గుచూపుతోంది. ఈ విధానాలు సంపన్నుల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయి కాబట్టి వారి సామాజిక స్థాయికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ కారణంగానే ద్రవ్య విధానం నిష్ప్రయోజనమైన సాధనంగా మారింది. 2007–09 మధ్యకాలంలో అమెరికాలోని ఆర్థికసంక్షోభం దీనిని నిరూపించింది. వడ్డీలు సున్నాకి చేరినా ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థపై ఏమాత్రం ప్రభావం చూపలేదు.

అమెరికా డాలర్లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపన్నులు వాడతారు. అందువలన అది దాదాపు బంగారానికి సరి సమానం కాబట్టి అమెరికా నుండి పెట్టుబడి ఎగిరి పోదని

**❝ట్రంప్ పాలనలోని అమెరికాలో నిరుద్యోగం 4 శాతమే ఉండి ఉంటే ఆర్థిక ఆంక్షలు అమలు జరిపేవాడే కాదు. అమెరికాలో సంపూర్ణ నిరుద్యోగ సమస్య ఉందనడానికి మంచి ఉదాహరణ ఉత్పాదక రంగం పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోకపోవడమే. అమెరికా మహామాంద్యం నుండి బయపడలేదని అనడానికి దాని ఉత్పాదకసామర్థ్యంలో ఏ ఒక్కత్రైమాసికలో కూడా 80 శాతం కన్నా ఎక్కువ ఉపయోగించుకోలేకపోవడమే ఋజువు. ఫలితంగా పెట్టుబడులలో స్తబ్ధత ఏర్పడింది.❞**

అనుకోవచ్చు. కానీ ఇక్కడ ఇంకో సమస్యఉంది. అమెరికా ద్రవ్యలోటు వలన పెరిగిన అదనపు గిరాకీలో అధిక మొత్తం నయా ఉదారవాద విధానాలవలన ప్రపంచమంతా పాకి పోతుంది. అమెరికాలో వినిమయం పెరిగితే అమెరికన్లు ఉపయోగించే సరుకులను ఉత్పత్తి చేస్తున్న దేశాలలో ఉద్యోగిత పెరుగుతుంది. ఆ దేశాల వస్తువులకు గిరాకీ పెరిగినందువలన అమెరికా విదేశీ రుణాలు పెరిగిపోతాయి (ఒకప్పుడు బ్రిటన్‌కి ఉన్నట్టు ఇప్పుడు అమెరికాకి వలస దేశాలు లేవు). ఆ దేశం గిరాకీని పెంచేందుకు ద్రవ్యలోటువైపు మొగ్గు చూపకుండా ఇదే నివారిస్తున్నది.

ఫలితంగా సంక్షోభాన్ని ఎదుర్కోడానికి ప్రపంచదేశాలు, ముఖ్యంగా అమెరికా తాత్కాలిక పరిష్కారం కోసం సంపద బుడగలపై ఆధారపడవలసి వస్తున్నది. నిజానికి నయాఉదారవాద పెట్టుబడిదారీ విధానం ఒక చరమ దశకి చేరుకుంది. డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆంక్షల విధానాలే ఇందుకు ఉదాహరణ. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ, తానెదుర్కొంటున్న నిరుద్యోగం, సరైన ఉపాధి లేకపోవడం వంటి సంక్షోభాల నుండి బయటపడడానికి నయాఉదారవాద విధానాల నుండి వైదొలగ వలసి వచ్చిందంటే– ఒకవైపు ఇందువలన నష్టపోతున్న పెట్టుబడిదారులకు పరిహారాన్ని చెల్లిస్తూ, మరో వైపు ద్రవ్య చలనానికి అడ్డులేకుండా ఉండే చర్యలు జాగ్రత్తగా అమలుచేస్తున్నారంటే – నయా ఉదారవాద విధానాలు వైఫల్యం చెందినట్టే.

### నయా ఉదారవాద చరమాంకం పర్యవసానాలు

నయా ఉదారవాద విధానాలు చరమాంకానికి చేరుకోవడం వలన నాలుగు పర్యవసానాలు ఉండబోతాయి. మొదటిది, అమెరికాలో డాట్ కామ్, ఇళ్ల రుణాల సంక్షోభం ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిన ఇరవైయవ శతాబ్దపు చివరి దశకం, ఇరవై ఒకటో శతాబ్దం తొలి దశకం కన్నా ఇక ముందు మరింత ఎక్కువ నిరుద్యోగం ఉండబోతున్నది. ఈ రోజు అమెరికాలోనిరుద్యోగం ఇదివరకెన్నడు లేనంత తక్కువ స్థాయిలో ఉన్నమాట నిజమే. కానీ ఇది తప్పుదోవ పట్టించే గణాంకం. ఎందుకంటే ఈనాడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నవారు 2008లలో ఉద్యోగం చేస్తున్న వారి కంటే తక్కువగా ఉన్నారు. అంటే కార్మికుడు పనికి వెళ్ళడానికి ఉత్సాహం చూపడం లేదు. తగ్గిన ఉద్యోగుల భాగస్వామ్యాన్ని సరిదిద్దుకున్నా అమెరికాలో నిరుద్యోగం 8 శాతం ఉంది. ట్రంప్‌పాలనలోని అమెరికాలో నిరుద్యోగం 4 శాతమే ఉండి ఉంటే ఆర్థిక ఆంక్షలు అమలు జరిపేవాడే కాదు. అమెరికాలో సంపూర్ణ నిరుద్యోగ సమస్య ఉందనడానికి మంచి ఉదాహరణ ఉత్పాదక రంగం పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోక పోవడమే. అమెరికా మహామాంద్యం నుండి బయపడలేదని అనడానికి దాని ఉత్పాదకసామర్థ్యంలో ఏ ఒక్కత్రైమాసికలో కూడా 80 శాతం కన్నా ఎక్కువ ఉపయోగించుకోలేక పోవడమే రుజువు. ఫలితంగా పెట్టుబడులలో స్తబ్ధత ఏర్పడింది.

1931లోని స్మూత్–హాలే పన్ను విధానాన్ని ట్రంప్ ఆంక్షల విధానాలు గుర్తు చేస్తున్నాయి. దీని వలన అమెరికాలోని నిరుద్యోగం ఇతర దేశాలకు ఎగుమతి అయే అవకాశాలుఉన్నాయి. ఇది ఆ తరువాత ఆ దేశాల నుండి ప్రతీకార చర్యలు ఆహ్వానించినట్టవుతుంది. ఫలితంగా మరింత నిరుద్యోగం పెరుగుతుంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ మొత్తంగా మరింత ఆర్థికమాంద్యంలో చిక్కుకుపోయి, పెట్టుబడులు మందగిస్తాయి. అమెరికా చైనాను లక్ష్యంగా చేసుకోవడం మొదలైన దగ్గరి నుండి ప్రతిఘటన మొదలయింది. అయితే అమెరికా ఎగుమతి చేసే నిరుద్యోగిత అంత ఎక్కువగా లేకపోవడం, అమెరికాతోసహా అన్ని దేశాలలోను నిరుద్యోగిత ప్రమాదకరమైన స్థాయిలో ఉండడం సర్వత్రా ప్రతిఘటన రాకపోవడానికి కారణం.

ట్రంప్ ఆంక్షల విధానాలు గ్లోబల్ వేల్యూ చైన్ (ప్రపంచీకరణ నేపథ్యంలో సరుకు ఉత్పత్తిక్రమంలో అందుకు అవసరమైన భౌతిక, మానవ వనరులను ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ తక్కువ ధరకు దొరికితే అక్కడి నుండి పెట్టుబడిదారులు సమకూర్చుకుని తమ అదనపు విలువ పెంచుకోడానికి ప్రయత్నిస్తారు. అది అభివృద్ధి చెందిన దేశమా, అభివృద్ధి చెందుతున్న దేశమా లేక అభివృద్ధి చెందని దేశమా అన్న తేడా చూడరు)ను ఎలా ప్రభావితం చేస్తాయని విస్తృతంగా చర్చించ బడుతున్నది. కానీ 21వ శతాబ్దంలో ప్రపంచ మాక్రో ఎకనామిక్స్ (దేశ, ప్రాంత, ప్రపంచ సూచికలైన స్థూల జాతీయోత్పత్తి, నిరుద్యోగం వగైరా సూచించేవి) అంతకు మునుపటి కన్నా భిన్నంగా ఉండబోతున్నవన్న విషయం చర్చించబడడం లేదు.

పైన చర్చించిన విషయాల నేపథ్యంలో, ఒక దేశం ఒంటరిగా ప్రపంచ ద్రవ్య పెట్టుబడిని ఎదుర్కోలేదు. కాని కొన్ని బలమైన దేశాలు సమూహంగా ఏర్పడి, ఐక్యతతో పనిచేస్తే ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారుల నిర్ణయాలను అతిక్రమించగలవని, తద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేయవచ్చని అర్థం అవుతున్నది. ఈ రకమైన ద్రవ్య ప్రోత్సాహంతో ఉత్తేజం పొందవచ్చని కొందరు జర్మన్ కార్మిక సంఘ నాయకులుప్రతిపాదించారు. 1930లలో జాన్ మేనార్డ్ కీన్స్ సూచన కూడా ఇదే. ఆనాడు దానిని వ్యతిరేకించారు. ఇప్పుడు దాని గురించి చర్చించను కూడా చర్చించడం లేదు.

రెండో పరిణామం, మూడో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఎగుమతులు చేసి అభివఅద్ధి సాధించడం ఇకపై కలే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగిస్తూ ఉండగా, అమెరికా మూడో ప్రపంచ దేశాల ఎగుమతులపై కూడా ఆంక్షలు విధిస్తున్నది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు కూడా ఈ ఆంక్షలు పాకే అవకాశం ఉన్న నేపథ్యంలో దేశీయంగాఅభివృద్ధి చెందడానికి ఎగుమతులు పెంచుకోడంపై ఆధారపడితే లాభం లేదని తెలియవస్తున్నది. ఎగుమతులపై ఆధారపడి అభివృద్ధి సాధించిన దేశాలు సహితం ఇక పై దేశీయ మార్కెట్‌లనే నమ్ముకోవడం శ్రేయస్కరం.

అయితే ఈ మార్పు రావడం అంత సులువైనవిషయం కాదు. అందుకు రైతులుచేసే దేశీయ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలి. చిన్న ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలి. సహకార వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి. పంపకాలలో మరింత సమానత్వానికి భరోసా ఇవ్వాలి. అంటే నిర్మాణాత్మకమైన మార్పులు చేయాలి. చిన్న ఆర్థికవ్యవస్థలు ఇతర ఆర్థిక

వ్యవస్థలతో సహకరించి ఖచ్చితమైన మార్కెట్ అందుబాటులో ఉండేటట్టు చూసుకోవాలి. క్లుప్తంగా చెప్పుకోవాలంటే నయా ఉదారవాద విధానం అంతమవడం అంటే ఇప్పటివరకు అనుసరిస్తున్న నయా ఉదారవాద వ్యూహాలు విఫలం అయినట్టే. వాటికి బదులుగా ప్రత్యామ్నాయ విధానాల వైపు మార్పు జరగాలి.

మూడో పరిణామం,మూడో ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థల ఎగుమతి దిగుమతుల చెల్లింపుల సమతుల్యత తీవ్రంగా దెబ్బతినడం. ఒక వైపు వారి ఎగుమతుల జోరు తగ్గుతుంది. ఫలితంగా దేశంలోకి వచ్చే ద్రవ్య ప్రవాహాల జోరు తగ్గుతుంది. ఇదివరకు విదేశీద్రవ్యం దేశంలోకి సులువుగా రావడం వలన వారి కరెంట్ ఖాతాలలో లోటు ఏర్పడేది కాదు. ఇప్పుడా పరిస్థితి ఉండదు. ఫలితంగా వారు పొదుపు విధానాలు అవలంభించవలసి వస్తుంది. ఇవి అక్కడి ప్రజల ఆదాయాలను తగ్గిస్తాయి. వారి జీవనం మరింత దుర్భరంగా మారే అవకాశం ఉంది. ఫలితంగా వారి దేశ సంపదలు, వనరులు విదేశీ పెట్టుబడిదారుల హస్తగతం అవుతాయి.దానితో దేశంలో గిరాకీని పెంచుకుని అభివృద్ధిని సాధించాలన్న అవకాశా లకు గండి పడుతుంది.

అంటే మూడో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై, ముఖ్యంగా విదేశీమారక లోటు ఉన్న దేశాలపై సామ్రాజ్యవాదుల పట్టు మరింత పెరుగుతుంది. ఇక్కడ సామ్రాజ్యవాదం అంటే ఒక దేశం యొక్క అధిపత్యంగా చెప్పుకోడం లేదు. ఇది అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి సామ్రాజ్యవాదం. ఇందులో దేశీయ బడా బూర్జువాలు అంతర్భాగంగా ఉంటారు.వారు వారి దేశ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తుంటారు.

నాలుగో పరిణామం, ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం ఎదుగుదల. నయా ఉదారవాద పెట్టుబడి చివరిదశకు చేరుకోక ముందే, ఉచ్చ దశలో ఉన్నప్పుడే, అభివృద్ధి, ఉద్యోగిత చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండగానే, పెట్టుబడిదారీ విధానం ప్రపంచాన్ని మరింత పేదరికంలోకి, మరింత ఆకలి వైపుకు నెట్టింది. ఉదాహరణకు ప్రపంచ తలసరి చిరుధాన్యాల ఉత్పత్తి 1980లలో 355 కిలోగ్రాములు ఉండగా 2000 సంవత్సరానికి 345 కిలోగ్రాములకు తగ్గిపోయింది. 2016 లో కూడా 344.9 కిలోగ్రాములే ఉంది- ఇందులో కూడా చాలా పెద్ద భాగం ఇథనాల్ ఉత్పత్తికి వెళ్ళిపోయింది. నిజానికి అభివృద్ధి చెందిన ఈ కాలంలో తలసరి చిరుధాన్యాల వినిమయం పెరిగి ఉండవలసింది. ఎందుకంటే ఇక్కడ మనం కేవలం ప్రత్యక్షంగా ఉపయోగించే

**"ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం ఎదుగుదల. నయా ఉదారవాద పెట్టు బడి చివరిదశకు చేరుకోక ముందే, ఉచ్ఛదశలో ఉన్నప్పుడే, అభివృద్ధి, ఉద్యోగిత చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండగానే, పెట్టుబడిదారీ విధానం ప్రపంచాన్ని మరింత పేదరికంలోకి, మరింత ఆకలి వైపుకు నెట్టింది. ఉదాహరణకు ప్రపంచ తలసరి చిరుధాన్యాల ఉత్పత్తి 1980లలో 355 కిలోగ్రాములు ఉండగా 2000 సంవత్సరానికి 345 కిలోగ్రాములకు తగ్గిపోయింది."**




ఫ్రాన్స్‌లో జాతి వివక్షకు వ్యతిరేకంగా ప్రదర్శన జరుపుతున్న కార్మికులు

వాటినే కాకుండా పరోక్షంగా తయారైన వంటకాల వినియోగంలోను, పశువుల మేతకు ఉపయోగించడాన్ని కూడా పరిగణనలోనికి తీసుకున్నాం. కాబట్టి తలసరి ఉత్పాదకత ఏమాత్రం అనుమానం లేకుండా పడిపోయిందని ఖచ్చితంగా చెప్పవచ్చు. అంటే ప్రపంచంలో వీటిని వినియోగించే ప్రజలకు అవసరమైన పోషకాలు అందడం లేదన్నమాట.

అయితే ఈ పెరుగుతున్న ఆకలి తక్షణం చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రతిఘటించబడడం లేదు. కారణం నయా ఉదారవాద విధానాలు ఇటు వంటి ప్రతిఘటనను అంగీకరించవు. రెండోది, స్థూల జాతీయోత్పత్తి పెరుగుతుండడం వలన క్రమంగా పేదరికం తొలగిపోతుందన్న ఆశ. ఉదాహరణకి దుఃఖంలో ఉన్న రైతులు తమ పిల్లల బతుకులు బాగుపడతాయన్న ఆశతో, తమ ఖర్మను అనుభవించక తప్పదనుకుంటూ జీవిస్తుంటాడు క్లుప్తంగా చెప్పుకోవాలంటే నయాఉదారవాద పెట్టుబడిదారీ విధాన సిద్ధాంతమే అభివృద్ధి జరుగుతుందన్న వాగ్దాన ప్రచారంపై ఆధారపడింది. అయితే నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం కడపటి అంచుకు చేరడంతో ఈ వాగ్దానం కూడా అదృశ్యమైంది. దాని సిద్ధాంత ప్రచారానికీ అదే గతిపట్టింది.

తనను తాను బతికించుకోడానికి నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం ఒక కొత్త సిద్ధాంతం కోసం వెతుక్కుంటున్నది. ఇప్పుడు దానికి ఫాసిజం దొరికింది. ఇప్పుడు ప్రజల భౌతిక అవసరాల గురించిన ప్రస్తావన దారి తప్పి జాతీయత వైపు మళ్లింది. ప్రజల దుఃఖాలకు కారణం తప్పుడు విధానాలు కావని, జాతి, భాషా, మత మైనారిటీ గ్రూపులని, 'అటువైపు' వారు కారణమంటూ చెప్పడం జరుగుతున్నది. వారిని శత్రువులుగా చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక మగతనం ఉట్టిపడే వ్యక్తిని దుఃఖాలన్నిటిని తొలగించే సర్వ శక్తివంతుడైన మహాపురుషునిగా చిత్రించడం జరుగుతున్నది. హేతువుకు అందని సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలోనే ఎవరూ నాయకుని అదఅశ్య శక్తులను ప్రశ్నించరు, నిందిస్తూ 'ఇతరులు'గా చూపుతున్న వారిని గురించిన ఆధారాలు అడగరు. నాయకుడు ప్రశ్నించ వీలులేని బుద్ధిశాలిగా చూపబడతాడు. రాజ్యం అణచివేత, మూకదాడులు కలగలిపి ఫాసిస్టు మూకలు ప్రత్యర్థులను భయ భ్రాంతులను చేస్తాయి. రాజ్యం బడా బూర్జువాజీతో దగ్గరి సంబంధాలు కలిగి ఉంటుంది. లేదా కలిక్కి మాటల్లో "బడా బూర్జువాల, ఫాసిస్టు నడమంత్రపు సిరిగాళ్ల భాగస్వామ్యం"గా ఉంటుంది.

> **"చివరివాక్యం కొంత అసాధారణంగా అనిపించవచ్చు. ఎందుకంటే చాలామంది బడా బూర్జువాలు ఫాసిస్టు పంథాను అనుసరించేదే సంక్షోభ సమయంలో వామపక్షాలను ప్రతి ఘటించ డానికని అంటారు. కాని వామపక్షాలు బలంగా ఎదురు తిరిగితే బడాపెట్టుబడిదారులు కొన్నిరాయితీలు ఇచ్చి, చీలికలు తీసుకు వస్తారు. వారు బలహీనంగా ఉన్నప్పుడే తమను తాము కాపాడు కోడానికి ఫాసిస్టు పంథాకు పూనుకుంటారు. వోల్టేర్ బెంజమిన్ సూచించినట్టు "ప్రతి ఫాసిజం వెనుక ఒక విఫలమైన విప్లవం ఉంటుంది."**

ఆధునిక సమాజంలో ఏదో ఒక రకమైన ఫాసిస్టు గ్రూపులు ఉంటూనే ఉంటాయి. బడా వ్యాపారుల మద్దతుతో వారు కేంద్ర స్థానానికి, కొన్ని సార్లు అధికారానికి కూడా వస్తుంటారు. మూడు రకాల పరిస్థితులలో ఇది సంభవమవు తుంటుంది. వ్యవస్థలో ఆర్థిక సంక్షోభం ఏర్పడి సాధారణ విధానాలతో దానిని పరిష్కరించలేక పోయినప్పుడు. సాధారణ ఉదారవాద సంస్థలు ఆ సంక్షోభాన్ని పరిష్కరించడంలో స్పష్టంగా విఫలమయి ఇక అడుగు ముందుకేయ లేక పోయిప్పుడు, వామపక్షాలు బలహీనంగా ఉండి ప్రజలకు ఈ సందిగ్ధ సమయంలో ప్రత్యా మ్నాయం చూపలేనపుడు.

చివరివాక్యం కొంత అసాధారణంగా అని పించవచ్చు. ఎందుకంటే చాలామంది బడా బూర్జువాలు ఫాసిస్టు పంథాను అనుసరించేదే సంక్షోభ సమయంలో వామపక్షాలను ప్రతి ఘటించడానికని అంటారు. కాని వామపక్షాలు బలంగా ఎదురు తిరిగితే బడాపెట్టుబడిదారులు కొన్ని రాయితీలు ఇచ్చి, చీలికలు తీసుకువస్తారు. వారు బలహీనంగా ఉన్నప్పుడే తమను తాము కాపాడుకోడానికి ఫాసిస్టు పంథాకు పూనుకుం టారు. వోల్టేర్ బెంజమిన్ సూచించినట్టు "ప్రతి ఫాసిజం వెనుక ఒక విఫలమైన విప్లవం ఉంటుంది"

**ఫాసిజం అప్పుడు.. ఇప్పుడు...**

1930లలో ఉన్న ఫాసిజానికి, ఇప్పటి ఫాసి జానికి తేడాలు ఉన్నాయి. అందుకే చాలామంది దీన్ని ఫాసిజం అనడానికి సందేహిస్తున్నారు. అయితే చరిత్రను పరిశీలిస్తే కొన్ని పోలికలు కనిపిస్తాయి. కొన్ని గమనించ వలసిన బేధాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ప్రపంచంలో అనేక దేశాలలో ఫాసిస్టు మూలాలున్నవారు అధి కారంలో ఉన్నప్పటికీ 1930లలో ఉన్నటువంటి ఫాసిస్టు రాజ్యాలు మాత్రం అధికారంలో లేవు. ఫాసిస్టు మూలాలున్నటువంటి వారు అది కారంలో ఉన్నా ఫాసిస్టు పాలనను సాగించ దలుచుకుంటే ఎంతవరకు సఫలులవుతారో సందేహమే. ఇందుకు అనేక కారణాలు ఉ న్నాయి. అందులో ముఖ్యమైన కారణం ఈనాడు ఫాసిస్టు మూలాలతో అధికారంలో ఉన్న వారు కూడా నయా ఉదారవాద సంక్షోభాన్ని నివారించడంలో ఫలప్రదం కాలేరు. కానీ 1930 లలో ఫాసిస్టు పాలకులు ప్రభుత్వ అప్పులను, తద్వారా సైనిక ఖర్చులను విపరీ తంగా పెంచి, ఆ నాటి నిరు ద్యోగ సమస్యను పరిష్కరించగలిగారు. తమ దేశాలను ఆర్థిక మాంద్యం నుంచి బయట పడే యగలిగారు. కానీ ఈనాటి ప్రభుత్వాలు అంత ర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆజ్ఞలను ధిక్కరించి గిరాకీని, ఉత్పత్తిని ఉద్యోగితను పెంచడానికి ప్రభుత్వ సైనిక ఖర్చులతో సహా ఏ ఖర్చులనూ పెంచలేరు. ముందే చర్చించుకున్నట్టు ఇటువంటి ఖర్చులు పెట్టాలంటే ప్రభుత్వాలు లోటు బడ్జెట్లకి వెళ్లవలసి ఉంటుంది. లేదా పెట్టుబడిదారులపై పన్నులు విధించ వలసి ఉంటుంది. కానీ ఈ రెండింటికి ద్రవ్య పెట్టుబడి వ్యతిరేకం. కాబట్టి ప్రస్తుత ఫాసిస్టు మూలాలున్న ప్రభుత్వాలు కూడా ఆయా దేశాలలోని ఆర్థిక సంక్షోభానికి తగిన పరిష్కారాన్ని చూపలేవు. మరో బేధం ప్రపంచ ద్రవ్య సంచయనం. 1930లలో లెనిన్ చెప్పిన "సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు" ఉండేవి. సైన్యం మీద అధిక మొత్తాలలో పెట్టిన వ్యయం ద్వారా అప్పటి ఫాసిస్టు ప్రభుత్వాలు అప్పటికే "వాటాలు వేసుకున్న ప్రపంచాన్ని తిరిగి పంచుకున్నాయి" ఫాసిజం యుద్ధాలతో పుట్టి యుద్ధాలతోనే అంతం అయింది. అయితే దానిని అంతం చేయ టానికి మానవాళి వెలలేని త్యాగాలు చేయవలసి వచ్చింది.

ప్రస్తుత నయా ఉదారవాద కాలంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరాలు స్తబ్దంగా ఉ న్నాయి. కొంతమంది లెనిన్ సూచించిన సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యానికి భిన్నంగా కార్ల్ కౌట్స్కీ ప్రతిపాదించిన "అల్ట్రా సామ్రాజ్య వాదం" అంటే ఇదే అని అంటున్నారు. అయితే ఇది తప్పుడు అవగాహన.

లెనిన్ గాని, కౌట్స్కీ గాని ద్రవ్య పెట్టుబడి కొంతమంది చేతులలో దేశ సరిహద్దుల లోపల ఉన్నదాని గురించే ప్రస్తావించారు – ముఖ్యంగా జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల మధ్య ఒడంబడికలు ఉండడానికి అవకాశముందని కౌట్స్కీ చెప్పాడు. ఒడంబడికలు తాత్కాలికంగా ఉంటాయి కానీ వైరుధ్యాలు అనివార్యం అని లెనిన్ అన్నారు.

ఈ రోజు ద్రవ్య పెట్టుబడి దేశ పరిధు లలో లేదు. అది అంతర్జాతీయతను సంతరించు కున్నది. ఈ నాటి ద్రవ్య పెట్టుబడిలో అనేక దేశాలలోని పెట్టుబడులు కలగలిసి ఉంటు న్నాయి. ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఆర్థిక పరిమితులున్న ప్రపంచం ఉండడం ఇష్టం లేదు. ప్రపంచమంతటా దాని సంచారానికి అడ్డు ఉండకూడదు. అందువలన సామ్రాజ్య వాదుల మధ్య వైరుధ్యాలు ఉండక పోవడానికి కారణం వారు యుద్ధాన్ని ఇష్ట పడతారా, లేక సంధులకు సిద్ధపడతారా అన్నది కాదు. నేటి భౌతిక పరిస్థితులలో వచ్చిన మార్పులు. ప్రపం చం లెనిన్, కౌట్స్కీలను, వారి గురించి తర్కించు కునే వారిని కూడా దాటి ముందుకు పోయింది.

ఈ యుగంలో సామ్రాజ్యవాద శక్తులమధ్య యుద్ధాలు ఉండవు సరికదా యుద్ధాన్ని ఉసిగొల్పే ఫాసిస్టు ధోరణులు కూడా ఉండవు. బహుశా తక్కువ స్థాయిలో హననాలకు పాల్పడే ఫాసి జమే మన చుట్టూ తిరుగుతుంటుంది. అంటే అధికారంలో ఉన్నప్పుడు కూడా బూర్జువా ప్రజా తంత్ర వ్యవస్థలోని అన్ని అంగాలను నాశనం చేయదు. కొన్నిసార్లు ఎన్నికలలో ఓడిపోడానికి కూడా సిద్ధపడుతుంది. కానీ దాని తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కూడా నయా ఉదారవాద విధానాల పరిధిలోనే పని చేయడం వలన వ్యవస్థని సంక్షోభం నుండి బయట పడేయలేవు. అందువలన ఫాసిస్టు శక్తులు మళ్ళీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ ఫాసిస్టు శక్తులు అధికారంలో ఉన్నా లేకున్నా ఒక వైపు కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడుతూనే సమాజాన్ని, అక్కడి విధానాలను ప్రభావితం చేయగల శక్తిని కలిగిఉంటాయి. 'బడా బూర్జువా వర్గంతో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూ ఫాసిజం ఎదుగుదలను' నిరంతరంగా కొనసాగిస్తాయి. అంటే ప్రస్తుతం ఉన్న ఫాసిస్టు వెల్లువ తనంత తానే అంతమయే అవకాశం లేదు. దానిని అంతం చేయాలంటే దాని అంత్య దశను సృష్టిం చిన నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానా లను దాటి వెళ్ళాలి. శ్రమ జీవులు దీనికి ప్రత్యామ్నాయంగా మరింత మెరుగైన డిమాండ్లు పెట్టగలగాలి. ఇవి ప్రత్యక్షంగా ఉదారవాద

విధానాలను లక్ష్యంగా చేసుకోనక్కరలేదు. కానీ వారి డిమాండ్లు నెరవేరటం ఉదారవాద విధానాల అమలు వలన సాధ్యం పడకుండా ఉండాలి. బడా బూర్జువాలకు నయా ఉదారవాద విధానాలకు ఉన్న బంధానికి తక్షణం గండి కొట్టగలగాలి. భవిష్యత్తులో ఈ విధానాల నుండి వైదొలగేటట్టు చేయగలగాలి.

మూడో ప్రపంచదేశాలకు సంబంధించి ఇటువంటి వర్గ సమీకరణ అంటే ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా, బూర్జువావర్గంతో కార్మికవర్గం ఒప్పందాలు చేసుకోకూడదని కాదు. అందుకు భిన్నంగా ఉదారవాద బూర్జువా శక్తులలో కూడా ఫాసిస్టులు రూపొందించిన జాతీయత వలన, వారి వాచాలత వలన నాశనమైన వారు ఉంటారు. కాబట్టి వారుకూడా కార్మికుల వైపుకు మొగ్గు చూపవచ్చు. నయా ఉదారవాద విధానాలతోనే కార్మికులకు కొన్ని ప్రయోజనాలు కల్పించవచ్చని, ప్రజలకు మెరుగయిన భౌతిక పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని వాదనలు చేసేవారుం టారు. ప్రజలకు మంచి జరిగే మార్పులు ఉదారవాద విధానాల అమలు వలన సాధ్య పడదని వారికి అనుభవంలో తెలుస్తుంది. మార్పు జరిగే క్రమంలో జరిగే చర్చలలో వామపక్షాలు పాల్గొని నయా ఉదార వాద విధానాల అమలుతో కార్మికుల జీవి తాలలో మార్పు సాధ్యం కాదని కార్మిక వర్గాన్ని చైతన్యపరిచేందుకు అవకాశం ఉంటుంది.

“అంటే ప్రస్తుతం ఉన్న ఫాసిస్టు వెల్లువ తనంత తానే అంతమయే అవకాశం లేదు. దానిని అంతం చేయాలంటే దాని అంత్య దశను సృష్టించిన నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానా లను దాటి వెళ్ళాలి. శ్రమ జీవులు దీనికి ప్రత్యామ్నాయంగా మరిం త మెరుగైన డిమాండ్లు పెట్టగలగాలి. ఇవి ప్రత్యక్షంగా ఉదారవాద విధానాలను లక్ష్యంగా చేసుకోనక్కరలేదు. కానీ వారి డిమాండ్లు నెరవేరటం ఉదారవాద విధానాల అమలు వలన సాధ్య పడకుండా ఉండాలి.”



వేతన పెంపుదల కోసం పోరాడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

**సామ్రాజ్యవాద జోక్యం**

“నయా ఉదారవాదం అంతమవుతున్న” ఈ తరుణంలో ఫాసిజం మన చుట్టూనే తిరుగు తున్నప్పటికీ, దేశీయ పెట్టుబడిదారులు అంతర్జా తీయ ద్రవ్య పెట్టుబడిదారులతో మిలాఖత్ అయినప్పటికీ, మూడో ప్రపంచదేశాలలోని కార్మికులు మెరుగయిన జీవితం గడపటానికి అవసరమయిన వేతనాలు పెంచమని డిమాండ్ చేస్తూనే ఉంటారు. అందువలన ఫాసిస్టు జాతి దురహంకార ప్రసంగాలు విఫలమవుతాయి. దురదృష్టవశాత్తు మూడో ప్రపంచదేశాలలో ఇవి సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా ఉండవు.

నిజానికి నయాఉదారవాద విధానాలు ఒక అంతిమ దశకు చేరుకోవడం వలన, ఫాసిస్టు మూలాలపై ఆధారపడవలసి రావడం వలన, అర్ధవంతమైన రాజకీయాలకు తెరలేస్తుంది. ఇంతకు ముందు నయా ఉదారవాద విధానాలు అమలయిన తొలి రోజుల్లో వాటిపై నమ్మకం కలిగిన అనేక రాజకీయ పార్టీలకు ఇప్పుడు కనువిప్పు కలిగింది. (లాటిన్ అమెరికాలో వారి అనుభవం ఇందుకు భిన్నంగా ఉంది. ఎందు కంటే అక్కడ నయా ఉదారవాద విధానాలు అమలు చేసింది రాజకీయ పార్టీల ద్వారా అధికారంలోకి వచ్చిన నాయకులు కాదు. సైనిక నియంతృత్వ ప్రభుత్వాలు.)

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అధికారాన్ని కాపాడే ఆర్థిక, రాజకీయ ప్రక్రియలు అన్నింటిని కలిపి నయా ఉదారవాద విధానాలు అంటు న్నాము. ఇవి అమలవుతున్న దేశాలలో క్రియా శీల రాజకీయ కార్యకలాపాలను తిరిగి నిర్మించు కుంటే అవి నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి ఒక సవాలు కాగలవు. ఈ విధానాలను ఆయా దేశాలు నాలుగు రకాలుగా సవాలు చేయగలవు.

మొదటిది. పెట్టుబడి యధేచ్ఛగా దేశంవదిలి పోవడం. నయా ఉదారవాద విధానాలను ఎదిరించే ఏదేశమైనా పెట్టుబడి దేశం నుండి వెళ్లిపోయే పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. అందువలన అది ఎన్నికలలో పరాజయం పొందవలసి వస్తుంది. పొరపాటున గనక అదే రాజకీయ పార్టీ ఎన్నికలలో గెలిస్తే పెట్టుబడులు వెళ్ళిపోయే ప్రవాహం మరింత పెరుగుతుంది. ఈ పరిస్థితులు ఆ ప్రభుత్వాలు వెనక్కు తగ్గాల్సిన అవసరాన్ని కల్పిస్తాయి. కానీ కార్మికులు, కర్షకుల మద్దతు మీద ఆధారపడిన ప్రభుత్వం నయా ఉదారవాద విధానాల వినాశకర పర్యవసానా లను వారికి చెప్పి ఒప్పించగలిగితే, తాత్కాలి కంగా నష్టం జరిగినా దీర్ఘకాలంలో ప్రజలు లాభ పడవచ్చు. వారి మద్దతు కోల్పోకుండా ఉండవచ్చు.

రెండోది, పెట్టుబడులు ఉపసంహరించబడక పోయినా, కరెంటు ఖాతాల్లో లోటు సమస్యలను సృష్టించవచ్చు. ఫలితంగా వాణిజ్య దిగుమతు లపై ఆంక్షలు పెట్టవలసి వస్తుంది. సామ్రాజ్య వాద దేశాలు కూడా ఆంక్షలు విధించి ఆ దేశాల వస్తువుల దిగుమతులను నిలిపివేయ మని ప్రపంచంలోని ఇతరదేశాలపై కూడా వత్తిడి తేవచ్చు. ఇతరత్రా ఆర్థికంగా స్థిర పరచు కునే ప్రయత్నాలకు ఆంక్షలు విధింపు మరో పెద్ద ఎదురు దెబ్బగా తయారవుతుంది.

మూడో అస్త్రం లాటిన్ అమెరికాలో జరుగు తున్నటువంటి ప్రజాస్వామ్యయుతంగా లేదా పార్లమెంటరీ పద్ధతిలో జరిగే తిరుగుబాట్లు. పూర్వ కాలంలో తిరుగు బాట్లు సైనిక చర్యల ద్వారా జరిగేవి. సాధారణ పాలన స్థానే సైనిక పాలన అమలయ్యేది. కానీ ఈ రోజు పెట్టుబడులు తరలి పోవడం వలన ఏర్పడ్డ ఇబ్బందుల వలన అయితేనేం, ఆంక్షలు ఎదుర్కొడం వలన కలిగిన అసౌకర్యాల వలన అయితేనేం సామ్రాజ్య వాదం ఆయా దేశాలలో ఫాసిజం పట్ల సానుభూతి ఉన్న మధ్యతరగతి వర్గం నుండి

(మిగతా 35వ పేజీలో)


చరిత్ర

# ఆఫ్రికా నుండి ఆధునిక మానవజాతి విస్తరణ



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

ఎంవిఎస్ శర్మ



20 లక్షల సం॥ల నాటి పరికరాలు

**భూ**మండలం మీద వివిధ ప్రాంతాలకు విస్తరించిన హోమో ఎరక్టస్‌లు ఎక్కడికక్కడ విడివిడి బృందాలుగా జీవించారు. ఈ బృందాల మధ్య సంపర్కం ఉండే పరిస్థితులు ఆనాడు లేవు. మనం ప్రస్తావిస్తున్నది దాదాపు 5 నుంచి 4 లక్షల సంవత్సరాల క్రితం నాటి కాలం. దాని పర్యవసానంగా ఒక్కో బృందం ఒక్కోతరహా జన్యు నిర్మాణాన్ని సంతరించుకుంది. పాతరాతి యుగపు మధ్య దశలో దాదాపు 2,30,000 సంవత్సరాల క్రితం తక్కిన హోమో ఎరక్టస్ బృందాలతో పోల్చితే బలిష్టమైన శరీరాకృతి గల నియాండర్‌తల్ మానవులు రంగంమీదకి వచ్చారు. ఈ నియాండర్‌తల్ మానవులు నేటికి 30,000 సంవత్సరాల క్రితం వరకూ జీవించారని ఆధారాలు సూచిస్తున్నాయి. నేటి మానవుల ఆకృతితో పోల్చితే ఈ నియాండర్‌తల్ మానవులు పొట్టి. చాలా చిన్ననుదురు. కనుబొమ్మలు ముందుకి పొడుచుకుని వచ్చినట్టుండేవి. గడ్డం లేదు. మెదడు పరిమాణం దాదాపు 1450 ఘనపు సెంటీమీటర్లు. అంటే ఆధునిక మానవుడి మెదడు పరిమాణానికి సమానం. రాతి పనిముట్ల తయారీలో నైపుణ్యంగల వాళ్లు ఈ నియాండర్‌తల్ మానవులు. అయినప్పటికీ ఆధునిక మానవుడు అభివృద్ధి చెందిన దిశకు పూర్తి వ్యతిరేక దిశలో వీరి పరిణామం సాగింది.

శరీర నిర్మాణాకృతి రీత్యా ఆధునిక మానవుడి నుదురు తక్కిన జాతుల కన్నా విశాలంగా ఉంటుంది. కనుబొమ్మల పైభాగం ముందుకు పొడుచుకువచ్చినట్టుగా కాక ఒకే వాలులో ఉంటుంది. గెడ్డం ఉంటుంది. ఆఫ్రికా ఖండంలో ఆధునిక మానవుడి ప్రస్థానం ప్రారంభమై ప్రపంచమంతటా విస్తరించింది. ఇందుకు సంబంధించిన పలు ఆధారాలు పురావస్తు పరిశోధకులు సేకరించగలిగారు.

ఆధునిక మానవుడు ఆకృతి రీత్యా బాగా పరిణామం చెందినది మధ్యరాతియుగం కాలం నాటికి., అంటే సుమారు 1,20,000 సంవత్సరాల క్రితం. అక్కడినుండి మరో 30,000 ఏళ్లు గడిచాక – అంటే 90,000 సంవత్సరాల క్రితం రెండువైపులా పదునుగా ఉండే ఆయుధాలు చేయగలిగాడు. వీటితో బాటు జంతువుల


'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఎముకలను కూడా ఉపయోగించి రకరకాల పని ముట్లనే గాక ఆభరణాలను కూడా తయారు చేసుకున్నాడు.

నిటారుగా ఉండే శరీరాకృతి, ఎక్కువ సైజులో ఉండే ఊపిరితిత్తులు, శ్వాసనాళం వలన ఎక్కువమొత్తంలో గాలి పీల్చి వదలగలిగే స్థితి వచ్చింది. అందువలన ఇతడు రకరకాల ధ్వనులను పలికించగలిగాడు. వాటికి తన ఇతర అవయవాల కదలికలను కూడా తోడు చేసి తన భావాలను ఇతరులకు తెలియజేయగలిగేవాడు. ఏదో ఒక రూపంలో అది ఎంత ప్రాథమిక స్థాయిదైనా కానీ భాషను రూపొందించగలిగింది నేటికి 50,000 సంవత్సరాల క్రితం. భారత ఉపఖండంలో ఆధునిక మానవుడి ప్రవేశం నేటికి 75,000 సంవత్సరాల క్రితం జరిగిందని చెప్పాలి. ఆఫ్రికా నుండి ఆసియా ఖండం ద్వారా మన ఉపఖండాన్ని చేరుకున్నారు. అక్కడినుండి క్రమంగా విస్తరిస్తూ ప్రస్తుత శ్రీలంక ద్వీపానికి చేరడానికి మరో 45,000 సంవత్సరాలు పట్టింది. దీనిని బట్టి భూగోళం మీద మానవ జాతి విస్తరణ ఎంత సుదీర్ఘ కాలంపాటు జరిగిందో మనకు స్పష్టమౌతుంది.


ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుజిల్లా రేణిగుంట సమీపంలోను, కర్నాటకలోని షోరాపూర్ దోబ్ ప్రాంతంలోను, రాజస్థాన్‌లోని బుధపుష్కర్ ప్రాంతంలోను రాతిపెచ్చులతో తయారైన పరికరాలు దొరికాయి. ఇవి బహుశా మధ్యరాతియుగం నాటివి అయి ఉండొచ్చు. ఇంకా వాటికాలం ఫలానా అని నిర్ధారణ కాలేదు.

అటు వాయువ్యం వైపు నుంచి ప్రవేశించిన జాతులే కాక మనదేశంలోకి తూర్పున ప్రస్తుత మయన్మార్ వైపునుండి కూడా కొన్ని జాతులు ప్రవేశించాయి. త్రిపుర, బంగ్లాదేశ్ ప్రాంతాల్లో దొరికిన రాతి, కలప పనిముట్లు 11 వేల సంవత్సరాల నాటివి.


ఇప్పుడు మనుగడ కొనసాగిస్తున్న ఆధునిక మానవజాతి ఇతర హోమోఎరక్టస్ జాతులతో (నియాండర్ తల్ మానవుల వంటి జాతులతో) సంపర్కమూ జరిపింది. పోటీపడి హింసాకాండ కూడా జరిగింది. సంఖ్యరీత్యా పోటీలో పై చేయి సాధించడం రీత్యా ఆధునిక మానవజాతి తక్కిన హోమో ఎరక్టస్ జాతులనన్నింటినీ అంతమొందించింది.

పాత రాతియుగం నుండి మధ్య రాతి యుగానికి మారడం 70 వేల సంవత్సరాల పాటు జరిగింది. (లక్ష సంవత్సరాలకు పూర్వం నుండి 30 వేల సంవత్సరాలకు పూర్వం దాకా) అదే మధ్య రాతియుగం నుండి కొత్తరాతి

"నిటారుగా ఉండే శరీరాకృతి, ఎక్కువ సైజులో ఉండే ఊపిరితిత్తులు, శ్వాసనాళం వలన ఎక్కువమొత్తంలో గాలి పీల్చి వదలగలిగే స్థితి వచ్చింది. అందువలన ఇతడు రకరకాల ధ్వనులను పలికించగలిగాడు. వాటికి తన ఇతర అవయవాల కదలికలను కూడా తోడు చేసి తన భావాలను ఇతరులకు తెలియజేయగలిగే వాడు. ఏదో ఒక రూపంలో అది ఎంత ప్రాథమిక స్థాయిదైనా కానీ భాషను రూపొందించ గలిగింది నేటికి 50,000 సంవత్సరాల క్రితం."




పాత, కొత్త రాతియుగంలో మానవులు ఉపయోగించిన ఆయుధాలు



**❝ అంటే దక్షిణాపథంలో ఈకాలంలో మానవ నాగరికత ఉండేదన్నమాట. ఉత్తరప్రదేశ్‌లో క్రీపూ. 8000 నాటి ఆధారాలు తవ్వకాలలో లభించాయి. సరాయ్‌నహర్‌రాయ్, మహదపం అనే ప్రాంతాలలో ఆ కాలానికి చెందిన మానవ ఆస్థిపంజరాలు లభించాయి. వీటిని బట్టి ఆ మనుషులు ఎత్తైనవారని ధృవపడింది. మగవాడు 180 సెంటీమీటర్లు ఆడువారు 170 సెంటీమీటర్లు పొడవు సగటున ఉన్నారు. ఆ సమాధుల దగ్గర దొరికిన పరికరాలలో విల్లంబు లు ఉన్నాయి.❞**



గుహలలోని గోడలపై నాటి మానవుడు గీసిన చిత్రాలు

యుగానికి మారడానికి 25,000 సంవత్సరాలే పట్టింది. (34,000 సంవత్సరాలు -9,000 సంవత్సరాల మధ్య) దక్షిణ ఆంధ్రప్రాంతంలోని జ్వాలాపురం నుండి శ్రీలంకలోని ఫాహియాన్ గుహవరకు, మహారాష్ట్రలోని చలీస్‌గావ్, పట్నే వంటి ప్రాంతాలలోను ఈ యుగానికి చెందిన చిన్న (సూక్ష్మ) రాతిపరికరాలు లభ్యమయ్యాయి. అంటే దక్షిణాపథంలో ఈకాలంలో మానవ నాగరికత ఉండేదన్నమాట. ఉత్తరప్రదేశ్‌లో క్రీ.పూ. 8000 నాటి ఆధారాలు తవ్వకాలలో లభించాయి. సరాయ్‌నహర్‌రాయ్, మహదపం అనే ప్రాంతాలలో ఆ కాలానికి చెందిన మానవ ఆస్థిపంజరాలు లభించాయి. వీటిని బట్టి ఆ మనుషులు ఎత్తైనవారని ధృవపడింది. మగవాడు 180 సెంటీమీటర్లు ఆడువారు 170 సెంటీమీటర్లు పొడవు సగటున ఉన్నారు. ఆ సమాధుల దగ్గర దొరికిన పరికరాలలో విల్లంబు లు ఉన్నాయి. వాటిలో బాణం చివర మొనదేలిన చెకుముకి రాయిగాని, పదునుగా ఉండే ఎముక గాని ధృడంగా కట్టుబడి ఉన్నాయి. ఆ నాటి మానవులు వేటాడిన జంతువులలో ఎద్దు, దున్నపోతు, గొర్రె, మేక, జింక, పంది, ఖడ్గ మృగం, మెట్టతాబేలు, సముద్రపు తాబేలు వంటివి ఉన్నాయి. నిప్పుని ఉపయోగించి మాంసాన్ని కాల్చి తినేవారు. ఇంకా జంతువులను మచ్చిక చేయడం తెలియదు. వ్యవసాయం ప్రారంభం కాలేదు. కాని దొరికిన తృణధాన్యాలను ఏరుకొచ్చి పిండిచేసి తినేవారు. దీనికి ఆధారం అక్కడ దొరికిన తిరగళ్లు, దంచుడు రాళ్లు, జంతుచర్మాలే ధరించేవారు. ఇంకా నార, పీచు దుస్తుల వాడకం మొదలుకాలేదు. మట్టికుండలు వంటివి కూడా వాడకం మొదలు కాలేదు. ఎముకలతో చేసిన లాకెట్లు, హారాలు ధరించేవారు. అక్కడ దొరికిన ఆధారాలను బట్టి అప్పటి మానవులు సగటున 20-30 సంవత్సరాల వరకు జీవించేవారు.

నర్మదాలోయలో లభించిన ఆధారాలు క్రీ.పూ. 8,000-6,000 సంవత్సరాల మధ్య కాలానివి. ఇక్కడ లభించిన వివరాలు చూస్తే నాగరికత మరికొంత పురోగమించినట్లు తెలుస్తుంది. వేటనుండి పాక్షికంగా పశుపోషణ చేపట్టిన సమాజం అది. అక్కడ కుక్కలు, గేదెలు, గొర్రెలు మచ్చిక చేయబడినట్లు ఆధారాలున్నాయి. సూక్ష్మ రాతి పనిముట్లే అయినా మరికొంత వైవిధ్యం పెరిగింది. ఆరె, బరమా, ఉలివంటి పరికరాలు వాడకంలోకి వచ్చాయి. చేతితో మట్టిపాత్రలు తయారుచేయడం మొదలైంది. కొండగుహల్లో క్రీ.పూ 6,000 నాటి చిత్రాలు లభించాయి. విల్లు, అమ్ములతో వేటాడబడే జంతువుల చిత్రాలు అవి. మనుషుల చిత్రాలు రేఖామాత్రంగా (కర్రపుల్లల మాదిరిగా కాళ్లు, చేతులు చిత్రీకరించబడ్డాయి) ఉన్నాయి. ఇటువంటివి భోపాల్ సమీపంలోని బీమ్ బెట్కాలో లభించాయి. ఒకచోట ఆడుతున్న నెమలి చిత్రం ఉంది. ఇది ఆ కాలపు ప్రజల కళాత్మకతను సూచిస్తున్నది. ❋

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

వ్యవసాయరంగం

# ఎఫ్‌పివోల పేరుతో భూములకు ఎసరు



రచయిత
మార్క్సిస్టు బాధ్యులు

ఎ కోటిరెడ్డి

జూలై 5వ తేదీన పార్లమెంటులో ప్రవేశ పెట్టిన 2019-20 బడ్జెట్‌లో రానున్న ఐదు సంవత్సరాలలో దేశంలో 10,000 ఎఫ్‌పివో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్-రైతు ఉత్పత్తిదారుల సంఘాలు-) లను ఏర్పాటు చేయటం లక్ష్యమని ఆర్థికమంత్రి ప్రకటించారు. ఒక్కొక్క ఎఫ్‌పివోలో 1000 మందిసన్న, చిన్నకారు రైతులను సభ్యులుగా చేర్చుకోవాలని, వీటి ద్వారా వ్యవసాయోత్పత్తిని, రైతుల ఆదాయాన్ని పెంచుతామని ప్రకటించారు. ఆర్థికమంత్రి ప్రకటన, ఎఫ్‌పివోల ఏర్పాటు కోసం జరుగుతున్న ప్రయత్నాలు చూస్తే ఎఫ్‌పివోల ఏర్పాటు ఉత్పాదకత, రైతుల ఆదాయాలను పెంచటం కోసం కాక, రైతుల ఆదాయాలు పెరగకపోవటంలో తమ బాధ్యత ఏమీలేదని ప్రభుత్వం తప్పుకోవటానికి, రైతుల భూములను కార్పొరేట్ కంపెనీల పరం చేయటానికి వీలుగా రంగాన్ని సిద్ధం చేస్తున్నట్లు స్పష్టమౌతున్నది. రైతుల ఆదాయలను పెంచాలనే తపన ప్రభుత్వానికి నిజంగా ఉంటే రైతులు నష్టపోవటానికి కారణాలేమిటో పరిశీలించి, వాటి నివారణకు చర్యలు తీసుకొని ఉండేది. కాని మోడి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం గతంలో యుపిఏ ప్రభుత్వం నియమించిన స్వామినాథన్ కమిషన్ వ్యవసాయ ఖర్చులతో పాటు రైతుల శ్రమ, పెట్టుబడులపై వడ్డీలు, భూమికౌలు, కుటుంబ శ్రమతో కలుపుకొని వ్యవసాయోత్పత్తులకు అయిన ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి, కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న సందర్భంలో ఈ సూత్రం ప్రకారం ఖర్చులను లెక్కించి, అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలు నిర్ణయించటం సాధ్యం కాదని మోడి ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలను నిర్ణయించటం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో చెప్పిన ప్రభుత్వం ఆదాయాలను రెట్టింపు చేస్తానని రైతులను మభ్యపెట్టటానికి ప్రయత్నం చేస్తున్నది. ఎంతటి నయవంచన! ఇపుడు రైతులను ఎఫ్‌పిఒలలో చేర్చి, ఉత్పాదకత, ఆదాయం పెంచుతామనే పేరుతో వారిని భూములకు దూరం చేయటానికి, వారి భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టటం కోసమే ఎఫ్‌పివోల ఏర్పాటు కార్యక్రమాన్ని వేగిరం చేస్తున్నది. దేశంలోని కొన్ని ప్రాంతాలలో గతంలోనే ఎఫ్‌పివోలు ఏర్పాటైనా ప్రస్తుతం ప్రభుత్వం బడ్జెట్‌లో లక్ష్యం నిర్దేశించటంతో ఎఫ్‌పివోల ఏర్పాటు కార్యక్రమం ఊపందుకోనున్నది.

వ్యవసాయరంగంలో సవాళ్ళను ఎదుర్కోవటానికి రైతులకు తక్కువ ధరలలో వ్యవసాయ ఉపకరణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పాదకతను పెంచుకోవటానికి తగిన సహకారం, తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయటంలో బేరసారాల శక్తిని పెంచటం ఎఫ్‌పివోల ద్వారా సాధ్యమౌతుందని చెప్పారు. 1956 కంపెనీల చట్టం ప్రకారం ఎఫ్‌పివోలను ఏర్పాటు చేయాలని, ఒక్కొక్క ఎఫ్‌పివోలో 8-10 గ్రామాల నుండి 1,000 మంది సన్న, చిన్నకారు రైతులను సమీకరించాలని చెప్పారు. ఎఫ్‌పివోలో సభ్యులుగా చేరిన రైతుల భూమి కంపెనీ మూల ధనంగా ఉంటుంది. తమ భూమి విలువ నిష్పత్తిలో రైతులకు షేర్లు కేటాయిస్తారు. వ్యవసాయ ఖర్చులతో పాటు ఎఫ్‌పివో నిర్వహణకు అయిన ఖర్చులను మినహాయించి, మిగిలిన ఆదాయాన్ని షేర్ల దామాషా ప్రకారం రైతులకు పంచుతారు. సంవత్సరానికి 10 శాతం చొప్పున వ్యవసాయ ఉత్పాదకత పెంచాలని, ద్రవ్యోల్బణం పోనూ రైతుల రాబడి కూడా ప్రతి సంవత్సరం 10 పెరగాలని చెప్పారు. ఎఫ్‌పివోను నిర్వహించటానికి ఏర్పాటయే కమిటీకి సిఇవోను రిసెర్చి ఇన్స్టిట్యూట్ నియమిస్తుంది. రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లు కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటవుతాయి. కాబట్టి వారు కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చటానికి అనుగుణంగా కార్యక్రమాలు రూపొందిస్తారు. రైతుల భూములను తమ చేతుల్లోకి తెచ్చుకోవటమే కార్పొరేట్ల లక్ష్యంగా ఉన్నది. కార్పొరేట్ సంస్థలకు అత్యంత విశ్వాసపాత్రుడుగా పనిచేస్తున్న ప్రధాని మోడి రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టటానికి 2013 భూ సేకరణ చట్టాన్ని తిరిగి సవరించటానికి పూనుకున్నాడు. ఇటువంటి ప్రభుత్వం రైతులకు ఆదాయాలు పెంచి, వారు సక్రమంగా వ్యవసాయం కొనసాగించటానికి సహకరిస్తుందా?

**బాధ్యత నుండి తప్పుకుంటున్న ప్రభుత్వం**

ఎఫ్‌పివోలను ఏర్పాటు చేయటం ద్వారా ఉత్పాదకత, ఆదాయాలను పెంచుకోమని చెబుతున్న ప్రభుత్వం తాను ఎఫ్‌పివోలకు ఇచ్చే మద్దతు గురించి ఏమీ పేర్కొనలేదు. ఎఫ్‌పివోలను ఏర్పాటు చేసినపుడు మాత్రం ప్రభుత్వం కొంత మొత్తం గ్రాంటును అందజేస్తుంది. ఆ తర్వాత ఎఫ్‌పివోలు స్వయంగా నిధులు సమీకరించుకొని నడవాల్సిందే. ఎఫ్‌పివోలో 1000 మంది రైతులు ఉంటే సుమారుగా సగటున ప్రతిరైతుకు రెండున్నర ఎకరాలకి పైగా భూమి ఉంటుంది. అంటే 2,500 ఎకరాల భూమి ఎఫ్‌పివో కు ఉంటుంది. ఈ భూమిలో పంటలు పండించటానికి ఆయా పంటలను బట్టి కనీస పెట్టుబడి ఎకరాకు రూ. 25,000 నుండి రూ. 1,00,000 పైగా కావలసి ఉంటుంది. అంటే ఒక ఎఫ్‌పివోకు వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించటానికి రూ. 6,25,00,000 నుండి రూ.25,

**"చిన్న, సన్నకారు రైతులు తాము పండించిన పంటలను అమ్మటం ద్వారా వచ్చిన కొద్దోగొప్పో ఆదాయం తో తమ కుటుంబ అవసరాలను తీర్చుకొంటుంటారు. వచ్చిన ఆదాయం కుటుంబ పోషణకు సరిపోదు కాబట్టి అప్పులపై బతుకుతూ, మరు సటి సంవత్సరం పంటకోసం ఎదురు చూస్తుంటారు. పంట పండే వరకు చిల్లర వ్యాపారులు, గ్రామంలోని పరిచయస్తులో, వడ్డీ వ్యాపారులో అప్పులు ఇస్తారు. పంట వచ్చిన వెంటనే వారి రుణం తీర్చమని రుణదాతలు కోరతారు. తీర్చకపోతే మళ్ళీ అప్పు ఇవ్వరు"**

00,00,000 రూపాయలకు పైగా పెట్టుబడి అవసరం అవుతుంది. ఇంతమొత్తం పెట్టుబడులు బ్యాంకులలో తీసుకోవాలంటే ప్రభుత్వ సహకారం ఉండాలి.

అన్నీ సక్రమంగా ఉండి పంట బాగా పండి నా మార్కెట్‌లో ధరల సమస్య ఎదురౌతుంది. పంట కళ్ళాలో ఉండగా ధరలు రైతాంగానికి గిట్టుబాటు కాకుండా ఉండటం, పంట వ్యాపా రుల చేతుల్లోకి వెళ్ళిన తర్వాత ధరలు పెరగటం చూస్తున్నాం. ఎఫ్‌పివోలు దీనిని ఏ విధంగా ఎదుర్కోగలవు? ధరలు వచ్చే వరకు పంటను నిల్వచేయటం సాధ్యం అవుతుందా? ఒకవేళ నిల్వ చేయటానికి సిద్ధమైతే అందుకు అవసరమైన గోదాములు ఎక్కడున్నాయి? గోదాములు ఉన్న చోట్ల అయినా నిల్వచేస్తే గిట్టుబాటు ధర ఎప్పటికి వస్తుందో చెప్పలేం. ఒకవేళ మరుచటి సంవత్సరం పంటవేసే సీజన్ వరకు గిట్టుబాటు ధర రాక పోతే, బ్యాంకు లేదా ఇతర రుణదాతలు ఇచ్చిన రుణం తీర్చలేరు. ఇచ్చిన రుణం తీర్చకుండా బ్యాంకు/ సంస్థలు మళ్ళీ రుణం ఇస్తాయా? ఇటు వంటి పరిస్థితుల్లో గిట్టుబాటు ధరకోసం ఉత్పత్తిని నిల్వచేస్తే మరుచటి సంవత్సరం వ్యవసాయం సాగటం సాధ్యమవుతుందా? ఎఫ్‌పివో ఏర్పాటై 1,000 మంది రైతులు ఒకచోట సంఘటితమైనా కార్పొరేట్, బహుళజాతి సంస్థల చేతుల్లో మార్కెట్ ఉన్నపుడు ఇపుడు వ్యవహరిస్తున్న పద్ధతులలోనే అపుడూ వ్యవహరించి, రైతుల ఉత్పత్తిని చౌకగా కొట్టేయాలనే ప్రయత్నం చేస్తారు కదా! ప్రభుత్వం రైతులకు అనుకూలంగా మార్కెట్‌లో జోక్యం చేసుకోకుండా మార్కెట్‌లో బడా సంస్థల దోపిడీని అరికట్టటం సాధ్య మౌతుందా? కొన్ని సంవత్సరాలలో ప్రకృతి వైపరీ త్యాలు రైతాంగాన్ని తీవ్ర నష్టాలకు గురిచేస్తు న్నాయి. నష్టాలు వచ్చి ఎఫ్‌పివో తను తీసుకున్న మొత్తం రుణాన్ని ఆ సంవత్సరం చెల్లించలేకపోతే, బాకీ ఉండగా బ్యాంకులు మళ్ళీ ఆ ఎఫ్‌పివోకు రుణం ఇస్తాయా? రుణం ఇవ్వకపోతే వ్యవసాయాన్ని ఎలా కొనసాగించాలి? చిన్న,



భారత్‌లో ఆహార పంటలు పండిస్తున్న భూములు

సన్నకారు రైతులు తాము పండించిన పంటలను అమ్మటం ద్వారా వచ్చిన కొద్దోగొప్పో ఆదాయం తో తమ కుటుంబ అవసరాలను తీర్చుకొంటుం టారు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకు సరిపోదు కాబట్టి అప్పులపై బతుకుతూ, మరు సటి సంవత్సరం పంటకోసం ఎదురు చూస్తుం టారు. పంటపండే వరకు చిల్లర వ్యాపారులు, గ్రామంలోని పరిచయస్తులో, వడ్డీ వ్యాపారులో అప్పులు ఇస్తారు. పంట వచ్చిన వెంటనే వారి రుణం తీర్చమని రుణదాతలు కోరతారు. తీర్చకపోతే మళ్ళీ అప్పు ఇవ్వరు. అటువంటి పరిస్థితులలో తమ పంటలను అమ్మకుండా నిల్వ చేసుకొంటే ఈ రైతు కుటుంబాలు ఏ విధంగా మనుగడ సాగించాలి? రైతులు గోదాముల్లో నిల్వ చేసుకున్న పంట విలువలో 80 శాతాన్ని ప్రభుత్వం వెంటనేరుణంగా అందజేస్తేనే రైతులు తమ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలు వచ్చే వరకు నిల్వచేసుకోవటం సాధ్యం అవుతుంది.

మహారాష్ట్రలో 2500ల ఎఫ్‌పివోలను ఏర్పాటు చేశారు. వాటి అనుభం ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. వీటిలో 100 కన్నా తక్కు వ ఎఫ్‌పివోలే లాభాలలో ఉన్నాయి. ఎఫ్‌పివోలు నిలదొక్కుకోవటానికి, అభివృద్ధి కావటానికి ప్రభుత్వ సహాయం అవసరం కాగా, అటువంటి సహాయాన్ని ప్రభుత్వం అందించలేదు. సాధారణ రైతాంగానికి ఇస్తున్న సబ్సిడీలను ఎఫ్‌పివోలకు ఇస్తామని ప్రభుత్వం చెప్పలేదు. ప్రభుత్వం నుండి ఏదైనా సహాయం ఇచ్చినా ఎఫ్‌పివోలను నిర్వహి స్తున్న కంపెనీకి ఇచ్చింది మినహా రైతాంగానికి ఇవ్వలేదు. ఫలితంగా ఎఫ్‌పివోలు దారుణంగా విఫలమై సభ్యులుగాఉన్న రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి.

**భూములు తిరిగి రైతుల చేతికి వస్తాయా**

సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన వ్యవసాయంలో నష్టాలు రావ టం సర్వసాధారణంగా మారింది. ఎఫ్‌పివోలకు నష్టాలు వచ్చి, వ్యవసాయం సాగించలేని పరిస్థితులు ఏర్పడితే ఏమవుతుంది? కంపెనీ చట్టం ప్రకారం భూములు విలీనం అయిన తర్వాత కంపెనీకి వర్తించే నిబంధనలే ఎఫ్‌పివో లలోని రైతుల భూములకు కూడా వర్తిస్తాయి. ఏ కంపెనీ ఐనా బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థల నుండి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోతే ఆ ఆస్తులు ఎన్‌పిఎ (నాన్ పెర్ ఫార్మింగ్ ఆసెట్స్)గా మారతాయి. అపుడు భూములు ద్రవ్యసంస్థల పరమౌతాయి. రైతులకు షేర్లే మిగులుతాయి. భూమి కంపెనీ యాజ మాన్యంలోనే ఉంటుంది. రైతులు తమవద్ద ఉన్న షేర్లను అమ్ముకోవాలి మినహా భూమిపై హక్కుండదు. నష్టపోయిన కంపెనీల షేర్లను ఎవరు కొంటారు? అందువలన షేర్ మార్కెట్‌లో మదుపు చేసేవారు ఎఫ్‌పివోల షేర్లు కొనటానికి ఆసక్తి చూపకపోవచ్చు. తమ ఎఫ్‌పివోకు నష్టాలు వచ్చి, వ్యవసాయం సాగించలేని పరిస్థితులు ఏర్పడిన తర్వాత రైతులకు ఏ ధరకైనా షేర్లు అమ్ముకోక తప్పని పరిస్థితి ఎదురౌతుంది.

**మార్కెట్**

పంట పండించిన తర్వాత తన పంటను అమ్ముకొన్న రైతుకు లాభం వస్తుందా, లేదా నష్టపోతాడా అన్నది మార్కెట్‌పై ఆధారపడి ఉ ంటుంది. వ్యవసాయరంగంలో తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేయటం, ఉత్పాదకతను పెంచుకోవటం పైనే రైతులు లాభాలు సంపాదించటం ఆధార పడిలేదు. మార్కెట్‌పై ఆధిపత్యం కలిగిన దేశం లోని బడా పెట్టుబడిదారులు, వాణిజ్య సంస్థలు, బహుళజాతి సంస్థలు వ్యవసాయోత్పత్తుల ధరలను తమకిష్టం వచ్చిన విధంగా పెంచటం/ తగ్గించటం చేస్తున్నాయి. పంటలు మార్కెట్లోకి రానున్న సమయంలో ధరలను తగ్గిస్తారు. పంటలో అధికభాగం తమచేతుల్లోకి వచ్చిన తర్వాత తిరిగి ధరలు పెంచుతారు. అదనంగా

పెట్టుబడులు, కుటుంబ పోషణకు అవసరమైన వనరులు లేని పేద, మధ్యతరగతి రైతులు పంట చేతికి రాగానే తమ పంటలను అనివార్యంగా అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. దానితో పాటు ప్రభుత్వం వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై కస్టమ్స్ సుంకాలను తగ్గిస్తున్నది. అమెరికా, యూరప్ తదితర దేశాల ప్రభుత్వాలు వివిధ పంటలకు 30 నుండి 80 శాతం వరకు సబ్సిడీలను ఇస్తున్నాయి. మన ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తి విలువలో 3-4 శాతానికి మించి సబ్సిడీలివ్వటం లేదు. ఫలితంగా ఆ దేశాల వ్యవసాయోత్పత్తులు అతి తక్కువ ధరలకు అంతర్జాతీయ మార్కెట్‌లోకి వస్తున్నాయి. వ్యవసాయోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేయటంతో మన రైతాంగం చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లో పోటీ పడలేకపోతున్నాయి. అదే కారణంతో అధిక ఉత్పాదకత సాధించినా, తక్కువవ్యయంతో ఉత్పత్తి చేసినా మనరైతాంగం దేశీయ మార్కెట్లో కూడా పోటీ పడేస్థితి ఉండటం లేదు. ఈ సమస్యను పరిష్కరించటం ప్రభుత్వంపై ఆధారపడి ఉన్నది. అభివృద్ధి చెందిన దేశాలలోని రైతులకు ఇస్తున్న విధంగా మన రైతులకు ఇస్తున్న సబ్సిడీలను ప్రభుత్వం పెంచాలి. దానితో పాటు మనదేశంలోకి దిగుమతి అవుతున్న వ్యవసాయోత్పత్తులపై అవసరమైన మేరకు సుంకాలను విధించాలి. అపుడు మన రైతులు ఉత్పత్తి చేసే సరుకులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడగలవు. దేశంలోనూ దిగుమతయిన సరుకుల కన్నా తక్కువ ధరకు అమ్మటం ద్వారా పోటీని తట్టుకొని నిలబడగలవు. స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా మొత్తం వ్యవసాయ ఖర్చులు, పెట్టుబడి ఆస్తులపై వడ్డీలు, కౌలు, రైతు కుటుంబశ్రమను కలిపి లెక్కించి, దానికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలను నిర్ణయించి, రైతులు చేసిన ఉత్పత్తిని ప్రభుత్వమే సేకరించాలి. ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ కల్పించాలి. ఇటువంటి రక్షణలు కల్పిస్తేనే ఎఫ్‌పివోలు నిలదొక్కుకుంటాయి. రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

**"ఎఫ్‌పివోల ఏర్పాటుతో ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. దేశంలోని ప్రజలం దరికీ ఆహారభద్రతను కల్పించేలా ప్రభుత్వ విధానాలుండాలి. ప్రజలకు ఆహార భద్రత కల్పించాలంటే మొదటగా ప్రజలందరికీ సరిపోయే ఆహారధాన్యాలను దేశంలోనే ఉత్పత్తి చేయాలి. ప్రస్తుతం మన రైతాంగం ఉత్పత్తి చేస్తున్న ఆహార ధాన్యాలు మన ప్రజల సాధారణ ఆహార అవసరాలను తీర్చటానికి అస్తుబిస్తుగా సరిపోతున్నాయి."**



భారతదేశంలో చిన్న రైతుల భూముల్లో పంటల వైవిధ్యం

### ఆహార భద్రతకు చేటు

ఎఫ్‌పివోల ఏర్పాటుతో ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. దేశంలోని ప్రజలం దరికీ ఆహారభద్రతను కల్పించేలా ప్రభుత్వ విధానాలుండాలి. ప్రజలకు ఆహార భద్రత కల్పించాలంటే మొద టగా ప్రజలందరికీ సరిపోయే ఆహారధాన్యాలను దేశంలోనే ఉత్పత్తి చేయాలి. ప్రస్తుతం మన రైతాంగం ఉత్పత్తి చేస్తున్న ఆహార ధాన్యాలు మన ప్రజల సాధారణ ఆహార అవసరాలను తీర్చటానికి అస్తుబిస్తుగా సరిపోతున్నాయి. ఇంకా నాణ్యమైన పోషకాహారాన్ని మన ప్రజలకు అందించాలంటే ఆహారోత్పత్తులను ఇంకా పెంచాలి. కాని ఏర్పడనున్న ఎఫ్‌పివోలు ఆహారపంటలను పండిస్తాయనే గ్యారంటీ లేదు. ఏ పంటలు వేస్తే తమకు ప్రయోజనమని ఎఫ్‌పివో నిర్వాహకులు భావిస్తారో ఆ పంటలనే వేయిస్తారు. దానితో అనివార్యంగా ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోయి, వాణిజ్య పంటలు పెరుగుతాయి. ఆహారధాన్యాల కోసం విదేశాలపై ఆధారపడవలసి వస్తుంది. మన ప్రజలకు ఆహార కొరత, పోషకాహారలోపం పెరుగుతాయి.

### వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు

ఆర్థికమంత్రి చెప్పిన విధంగా ఎఫ్‌పివోలను ఏర్పాటు చేసి, వ్యవసాయం కొనసాగిస్తే ఎక్కువ భాగం యంత్రాలతో పనులు జరుగుతాయి. ఎఫ్‌పివోలలో సభ్యులు కావాలంటూ ప్రభుత్వం పేర్కొన్న సన్న, చిన్నకారు రైతులు తమ పొలంలో పనిచేసుకొంటూ, సీజన్‌లో ఇతరుల పొలాలలో కూలిపనులకు కూడా వెళతారు. ఈ పనుల ద్వారా పొందుతున్న ఆదాయం వారి కుటుంబ ఆదాయంలో మూడోవంతుకు పైగా ఉంటున్నది. ఎఫ్‌పివోలు ఏర్పాటైన తర్వాత చిన్న ముక్కలుగా ఉన్న భూముల స్థానంలో భారీస్థాయి వ్యవసాయ క్షేత్రాలు ఏర్పాటు కావటంతో వ్యవసాయంలో భారీ యంత్రాల వినియోగం పెరుగుతుంది. దానితో వీరికి లభించే పనులు తగ్గుతాయి. పనుల కోల్పోవటం ద్వారా పోగొట్టుకున్న ఆదాయాన్ని పొందటానికి వేరేమార్గం లేకపోవటంతో వీరి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దిగజారుతుంది.

ఎఫ్‌పివోలు ఏర్పాటైతే గ్రామాలలో పెద్ద సంఖ్యలో ఉన్న వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల పరిస్థితి ఏమిటి? ఉభయ తెలుగు రాష్ట్రాలలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాజిల్లాలలో పెద్దసంఖ్యలో కౌలురైతులు ఉన్నారు. రైతుల భూములను కౌలుకు చేయటం ద్వారా వీరు ప్రధానంగా జీవనోపాధిని పొందుతున్నారు. ఎఫ్‌పివోలను ఏర్పాటు చేయటంతో వీరికి భూములు కౌలుకు దొరికే అవకాశం ఉండదు. వీరంతా నిరుద్యోగులుగా మారతారు. గ్రామాలలో 50 శాతంగా ఉన్న వ్యవసాయ కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. ఇపుడు దొరుకుతున్న కనీస పనులు కూడా దొరికే పరిస్థితి లేకుండా పోతుంది. ఇటువంటి పరిస్థితిలో పెద్దమొత్తంలో ఉపాధి హామీ పనులు కల్పిస్తేనే చిన్న, సన్నకారు రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులకు పనులు

**"ఎఫ్‌పివోలకు బదులుగా రైతులతో సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి. ఈ సహకార సంఘాలకు ప్రభుత్వం అన్ని విధాలైన సహాయ సహకారాలను అందించాలి. సంఘానికి అవసరమైన రుణాలను ప్రభుత్వ బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి అందించాలి. ఆధునిక యంత్రాలను తక్కువ అద్దెకు ప్రభుత్వమే సరఫరా చేయాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర ఉపకరణాలను ప్రభుత్వమే తక్కువ ధరలకు సరఫరా చేయాలి."**



ఉపాధి హామీ పనులు చేస్తున్న వ్యవసాయ కార్మికులు

దొరకటం సాధ్యం అవుతుంది. కాని ప్రభుత్వం ఒకవైపు ఎఫ్‌పివోల ఏర్పాటును ప్రోత్సహిస్తుండగా, మరోవైపు ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయబోమని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు. ఈ పరిణామాలతో గ్రామాలలోని వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటారు. సాగుభూములు రైతుల చేతుల్లో ఉన్నపుడు వ్యవసాయ పనులు ఎక్కువ భాగం కూలీలతో చేయించేవారు. అప్పటికి కూడా వ్యవసాయ కార్మికులకు పనులు దొరకక వలసలు పెరగటంతో వ్యవసాయ కార్మిక సంఘాలు, కమ్యూనిస్టు ఉద్యమం చేసిన పోరాటాలతో తప్పనిసరి పరిస్థితులలో మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకు వచ్చారు. ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించటంతో పాటు నిరుద్యోగభృతిని కూడా అమలు జరపాల్సిన పరిస్థితులలో అసలుకే ఎసరు పెట్టటం బిజెపి ప్రభుత్వ వంచనను వెల్లడిస్తున్నది. ఈ చర్య ఫలితంగా గ్రామాలలో నిరుద్యోగంతో పాటు వలసలు పెరుగుతాయి. ఇపుడు జరుగుతున్న రైతుల ఆత్మహత్యలతో పాటు వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల ఆకలి చావులను కూడా మనం చూడాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

అందువలన ప్రభుత్వం ఎఫ్‌పివోలను ఏర్పాటు చేయటం ద్వారా రైతుల ఆదాయం పెంచుతామని చెబుతున్న మాటలు "కొండ నాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడిందన్న" చందంగా రైతుల ఆదాయాలను పెంచకపోగా, వారికి ఉన్న భూమికూడా లేకుండా చేయటానికి దారితీస్తుంది. పైకి ఎన్ని కల్లబల్లి మాటలు చెబుతున్నా వాస్తవంగా మోడి ప్రభుత్వం చేయబూనుకున్నది కూడా ఇదే. రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టటమే లక్ష్యంగా పనిచేస్తున్న మోడి ప్రభుత్వం కార్పొరేట్లు రైతుల భూములు కాజేయటానికి అనుకూలంగా 2013 భూ సేకరణ చట్టాన్ని సవరించటానికి పట్టుపట్టి ప్రయత్నం చేస్తున్నది. రైతులను భూములకు దూరం చేసే ఎఫ్‌పివోల లాంటి కార్యక్రమాల అమలును వేగిరం చేస్తున్నది.

### ప్రత్యామ్నాయ విధానాలు


నిజంగా రైతాంగం ఆదాయాలనున పెంచాలనే భావమే మోడి ప్రభుత్వానికి ఉంటే అందుకు తీసుకోవలసిన చర్యలు వేరుగా ఉన్నాయి. ఎఫ్‌పివోలకు బదులుగా రైతులతో సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి. ఈ సహకార సంఘాలకు ప్రభుత్వం అన్ని విధాలైన సహాయ సహకారాలను అందించాలి. సంఘానికి అవసరమైన రుణాలను ప్రభుత్వ బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి అందించాలి. ఆధునిక యంత్రాలను తక్కువ అద్దెకు ప్రభుత్వమే సరఫరా చేయాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర ఉపకరణాలను ప్రభుత్వమే తక్కువ ధరలకు సరఫరా చేయాలి. మొత్తం ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి, కనీసమద్దతు ధరగా నిర్ణయించాలి. పంట మార్కెట్‌లోకి వచ్చిన తరుణంలో మద్దతు ధర కన్నా మార్కెట్ ధర తక్కువగా ఉంటే ప్రభుత్వమే మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలి. ప్రతిరైతుకు బీమా సదుపాయం కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినపుడు రైతులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించాలి. వ్యవసాయోత్పత్తులకు ఇస్తున్న సబ్సిడీలను పెంచాలి. ప్రభుత్వ భూములు, భూస్వాముల వద్ద ఉన్న మిగులు భూములు వ్యవసాయ కార్మి కులు, పేదరైతులకు పంచాలి. రైతుల భూములకు నీటి సదుపాయం భారత ప్రభుత్వం తీసుకోవాలి. కౌలురైతులకు రుణాలు అందించాలి. ఉపాధి హామీ చట్టం అమలుకు అధిక నిధులు కేటాయించి, వ్యవసాయ కార్మికుల కుటుంబాలలోని ప్రతివారికీ సంవత్స రంలో అత్యధిక రోజులు పనులు కల్పించాలి. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల కుటుంబాలకు ఉచిత వైద్యం అందించాలి. వారి పిల్లలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు ఉచిత విద్య అందించాలి.

ప్రభుత్వం ఇటువంటి చర్యలుతీసుకొంటేనే రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అవుతుంది. వారి కుటుంబ ఆదాయాలు పెరుగుతాయి. సహకారోద్యమం, దానితో పాటు గ్రామాలు అభివృద్ధి అవుతాయి. దీనిని వదిలివేసి, ఎఫ్‌పివోల ఏర్పాటు, వాటి నిర్వహణను కార్పొరేట్లకు అప్పగించటం రైతులను భూములకు దూరం చేయటానికి దారితీస్తుంది. ఎఫ్‌పివోలకు వ్యతిరేకంగా, ప్రత్యామ్నాయ విధానాల కోసం రైతాంగం ఉద్యమిస్తేనే భూములు రైతుల చేతిలో ఉంటాయి. లేకపోతే కార్పొరేట్‌ల పరమౌతాయి. అందుకని ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానా లను వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ విధానాల సాధన కోసం వ్యవసాయ కార్మికులు, కౌలురైతులతో కలిసి రైతాంగం ఉద్యమించాలి. ❋

**73వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకం**

# భారత జాతీయ ఉద్యమం, లౌకికవాదం, మతతత్వం

**బిపన్ చంద్ర**



రచయిత ప్రముఖ చరిత్రకారుడు

**భా**రత స్వాతంత్ర్య ఉద్యమం ఒకఉమ్మడి దృక్పథం ప్రాతిపదికగా సాగింది. ఒక సమున్నతమైన జాతిని నిర్మించాలన్నది ఆ దృక్పథం. జాతీయతావాదానికి, జాతీయ సమైక్యతకు, జాతీయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితం కావాలన్నది ఆ దృక్పథం. ఒక ధృఢమైన సమైక్య భారతదేశాన్ని ఏర్పాటు చేయాలన్నది ఆ దృక్పథం. ప్రజాస్వామ్యం మాత్రమే భారత్ వంటి సువిశాల, వైవిధ్య భరిత దేశాన్ని సమైక్యంగా ఉంచుతుందని ఆ ఉద్యమనేతల ప్రగాఢ విశ్వాసం. ఆర్థిక, సామాజిక బలాలమీదే స్వాతంత్ర్యం ఆధారపడి ఉందన్నదీ, తొలగింపు, సామాజిక మార్పు, సామాజిక న్యాయం సాధ్యమన్నది జాతీయ ఉద్యమ సిద్ధాంతం.

అలాగే, భారత జాతీయ ఉద్యమానికి ఒక స్పష్టమైన సామాజిక దృక్పథం ఉంది. సంస్కృతి, మతం, భాషలకు సంబంధించి లౌకికమైన అనేకతాసమాజం,లౌకిక విధాన రాజ్యం అవసరమన్న భావన ఆ దృక్పథంలోకే వస్తుంది. మొత్తంమీద పటిష్టమైన లౌకికవాదం ప్రాతిపదికగానే భారత జాతీయతావాదం ఉండాలని ఉద్యమ నిర్మాతలు సంపూర్ణంగా అవగాహన చేసుకున్నారు. దాన్నే వారు ప్రవచించారు. ఒక ఆధునిక, పటిష్ఠ, సమైక్య భారతదేశాన్ని లౌకిక పునాదులమీద తప్ప నిర్మించలేమని భారత గణతంత్ర వ్యవస్థాపకులు సంపూర్ణంగా గుర్తించారు. జాతి నిర్మాణానికి మతతత్వం విసిరిన సవాలును ముఖాముఖీ ఎదుర్కొన్నప్పుడు, వారు రాజీపడని అంశం ఈ లౌకికవాదమే. మతతత్వం మీద సాగించే ఉద్యమానికి ఆనాటి ఈ లౌకికవాద దృక్పథ వారసత్వం ఒక ప్రధాన ఆలంబన. ఈ వారసత్వం ఎంతటి బలీయమైనదంటే. దేశ విభజన సమయంలో జరిగిన అల్లర్లలో మతోన్మాద మారణకాండ దావానలంలా వ్యాపించినప్పటికీ, పాకిస్థాన్‌లో తమ సర్వస్వాన్ని కోల్పోయిన కాందిశీకులు లక్షల సంఖ్యలో తరలివస్తున్నప్పటికీ, 1946–47లో అనేక ప్రాంతాల్లో మత విద్వేషాలు వెల్లువలా పెల్లుబికినప్పటికీ మనం మతతత్వాన్ని అదుపు చేయగలిగాం. అయితే మనం దాన్ని ఆసాంతం తుదముట్టించలేకపోయాం. ఫలితంగా అది దేశాన్ని చీల్చటంలో విజయవంతం అయింది. అయినప్పటికీ మనం ఒక లౌకిక రాజ్యాన్ని, ఒక లౌకిక సమాజాన్ని ఏర్పాటు చేసుకోవటంలో సఫలీకృతమయ్యాం. మనకు మనం ఒక లౌకిక రాజ్యాంగాన్ని రాసుకోగలిగాం.

భారత జాతీయ ఉద్యమం ఒక్క ఖిలాఫత్ అంశంలో తప్ప మత సమస్యల మీద ఏనాడూ పోరాటాలు సాగించలేదు. ఇది నిజంగా ఒక విశేషం. ముఖ్యంగా 1880లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడిన తరువాత, మతపరమైన అంశాలను ముట్టుకోలేదు. 1920– 1922 మధ్యకాలంలో ఖిలాఫత్ ఉద్యమాన్ని కూడా అది వలస వ్యతిరేక అంశం కావడం వల్ల చేపట్టింది. పైగా హిందూ–ముస్లింలను జాతీయ విముక్తిపోరాటంలో సమైక్యం చేయడానికి గాంధీజీ చేస్తున్న కృషిలో భాగంగా కూడా దాన్ని నడిపించింది. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ ఆ ప్రయోగాన్ని పునరావృతం చేయలేదు. మరీ ముఖ్యంగా 1918 తర్వాత, జాతీయతావాద సైద్ధాంతిక నిర్వచనంలో లేదా జాతీయతావాద కార్యక్రమంలో మతాన్ని ఉపయోగించుకోలేదు. బ్రిటిష్ వారు క్రైస్తవులు కాబట్టి వారి పాలనను వ్యతిరేకిస్తున్నామని ఏనాడూ పేర్కొనలేదు. లేదా బ్రిటిష్ పాలనను క్రైస్తవ పాలన అని ఏనాడూ అభివర్ణించలేదు. ఆ పేరిట వారి పాలనను వ్యతిరేకించలేదు. క్రైస్తవం కాబట్టి బ్రిటిష్ పాలన పోవాలని ఒక్కటంటే ఒక్కసారి సైతం అనలేదు. భారత ప్రజలపై బ్రిటిష్ వారి ఆర్థిక, రాజకీయ, మానసిక, సాంస్కృతిక పెత్తందారీతనం కారణంగానే వారి పాలనను అది వ్యతిరేకించింది.

అన్ని వైపుల నుంచి కమ్ముకొచ్చిన ఒక విస్తృత ఉద్యమం, అటు మితవాదుల నుంచి ఇటు వామపక్షవాదుల వరకు విభిన్న రాజకీయ, సైద్ధాంతిక వర్గాలనూ జాతీయ ఉద్యమం తనలో ఇముడ్చుకుంది. హిందు–ముస్లీం ఐక్యతను, భారతీయ సంకీర్ణ సంస్కృతిని సమ్మతించినంత కాలం, మత విద్వేషాన్ని నూరిపోయనంత కాలం, వలసవాదంపై సమైక్య పోరాటానికి కలిసి వచ్చినంత కాలం, ఆఖరికి మతతత్వవాదులను సైతం తమతో చేర్చుకోవటానికి అది సిద్ధపడింది. 1920లలో వారికి తమ సరసన స్థానం కల్పించింది. వారు హిందువులు కానీయండి, ముస్లీంలు కానీయండి – ఎప్పుడైతే మతతత్వ వేర్పాటువాదం గురించి మాట్లాడటం ప్రారంభించారో, హిందూ జాతి, ముస్లిం జాతి అనటం సాగించారో, ఇతర మతావలంబీకులపై విద్వేషాన్ని ప్రబోధించసాగారో, వలసవాదంపై పోరాటంలో కలసిరావడానికి నిరాకరించారో, ఆఖరుకు దాన్ని విచ్ఛిన్నం చేయడానికి సైతం ప్రయత్నించారో, ఇంకా చెప్పాలంటే వలస పాలకులతో చేతులు కలిపారో అప్పుడు జాతీయోద్యమం వారిపై విరుచుకుపడింది. వారు ఏ మతానికి చెందినవారైనా సరే సహించలేదు. హిందూ మహాసభ, ముస్లీంలీగ్ సభ్యులు కాంగ్రెస్‌లో అట్టడుగు గ్రామ శాఖల నుంచి పైవరకు ఎలాంటి పదవులు చేపట్టకుండా 1938లో సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వారిని బహిష్కరించింది.

మనం మొదటి అధ్యాయంలో చర్చించిన విధంగానే భారత జాతీయోద్యమం అంతే సమగ్రమైన తీరులో లౌకికవాదాన్ని నిర్వచించింది. రాజ్యం అన్ని మత విశ్వాసాల పట్ల తటస్థ వైఖరి అవలంబించాలి. లేదా రాజ్యం నాస్తికత్వంతో సహా అన్ని మతాల పట్ల సమభావం ప్రదర్శించాలి. అతడి లేదా ఆమె మతం ప్రాతిపదికగా రాజ్యం ఏపౌరుడి ఎడలా వివక్ష చూపించరాదు. ఏ తరహాదైనా సరే ప్రతి మతతత్వవాదాన్ని స్పష్టంగా, కఠినంగా వ్యతిరేకించాలి. అన్నింటికీ

“ముందుగా గాంధీజీని తీసుకుందాం. మతతత్వానికి ఆయన సంపూర్ణ వ్యతిరేకత కారణంగానే నాథూరాం గాడ్సే అనే ఒక మతోన్మాది ఆయనను హతమార్చాడు. మతాన్ని రాజకీయాల నుండి వేరుచేయాలంటూ 1940లలో గాంధీజీ చేసిన ప్రబోధలను ఇప్పటికే ఉటంకించాను. హిందూ, ముస్లిం, సిక్కు ఇలా అన్నిరకాల మతతత్వాలనూ ఆయన వ్యతిరేకించాడు. 1942లో ఆయన ఇలా పేర్కొన్నాడు. “మత కారణాలతో మనుషులను వేరు చేయడం పూర్తిగా తప్పు.”

మించి, రాజకీయాల నుంచి, ఆర్థిక, విద్యా రంగాల నుంచి మతాన్ని వేరు చేసి తీరాలి. మతాన్ని ఒక ప్రయివేటు లేదా వ్యక్తిగత వ్యవహారంగా పరిగణించాలి.

ఈ విషయంలో, గాంధీజీ లౌకికవాద అవగాహన తద్విరుద్ధమైనదని కొందరు వ్యక్తులు చిత్రీకరించారు. అది వాస్తవం కాదు. జాతీయోద్యమం మొత్తంగా ఏం చెప్పిందో అదే మాదిరిగా గాంధీజీ కూడా లౌకికవాదాన్ని నిర్వచించాడు. అలాగే జీవించాడు. గాంధీజీ మతతత్వాన్ని సంపూర్ణంగా వ్యతిరేకించాడు. కాబట్టే నాథూరాం గాడ్సే ఆయన్ని హతమార్చిన సంగతి బాగా తెలిసిందే. ఒక వ్యక్తికి తన మతాన్ని అవలంబించే హక్కు ఉండి తీరాలి, మతం పేరిట అతడు లేదా ఆమె ఎలాంటి వివక్షకు గురికాకూడదు. నాస్తికత్వంతో సహా అన్ని మతాల పట్లా సమాన గౌరవభావాన్ని అందరూ ప్రదర్శించాలి. ఇది గాంధీజీ విశ్వాసం. ఇది జగమెరిగిన విషయమే.

ఏమైనప్పటికీ, రాజకీయాలను మతం నుంచి విడదీయలేమన్న గాంధీజీ చర్వితచరణ సూత్రీకరణ అపార్థాలకు దారితీసింది. 1925లో తన ఆత్మకథ లేదా సత్యంతో నా ప్రయోగాలు పుస్తకంలో ఆయన చేసిన ప్రకటన ఇందుకు ఒక ఉదాహరణ. దీంతో మతాన్ని రాజకీయాల నుంచి వేరుపరచడమన్న లౌకిక వాద నిర్వచనం గాంధీజీకి సమ్మతం కాదని చాలామంది నిగ్గుతేల్చారు. గాంధీజీ భావాలను పూర్తిగా అపార్థం చేసుకోవడం, అర్థం చేసుకోలేకపోవడం వల్లే ఈ గందరగోళం ఉత్పన్నమైంది. గాంధీజీ సదాచార సంపన్నుడు, ధర్మపరాయణుడు. ఆయన రెండు విభిన్న అర్థాలలో 'మతం' పదాన్ని ఉపయోగించాడు. ఒకటి మతవర్గం అనే అర్థంలో హిందుమతం, ఇస్లాం, క్రైస్తవం అని. రెండవ అర్థంలో మతం అంటే దైవంలో, సత్యంలో, ధర్మంలో విశ్వాసం కలిగి ఉండటం. ధర్మం అంటే మనిషి ఎలా జీవించాలో నిర్దేశించే నైతిక నియమావళి. మతం ప్రాతిపదికగా రాజకీయాలు ఉండాలనటంలో ఆయన ఉద్దేశ్యం హిందూమతం అనో, ఇస్లాం అనో కాదు, అవి నైతిక విలువల మీద ఆధారపడి ఉండాలని, అంటే ధర్మబద్ధంగా ఉండాలని చెప్పాడు. నైతిక విలువలను ప్రబోధించే మతమని ఆయన ఉద్దేశం. అలాగే 'మౌలిక నైతిక విలువలు అన్ని మతాలలోనూ ఒకటిగానే ఉంటాయని' కూడా ఆయన తరచూ ఉద్ఘాటిస్తూ ఉండేవాడు. 'మతాన్ని నైతికతనూ కలగలపవద్దు' అని కోరేవాడు. ఈ సార్వజనీనతను నొక్కి చెప్పేందుకే ఆయన 'దైవమే సత్యం' అనే తన తొలి సూత్రాన్ని 'సత్యమే దైవం'గా మార్చాడు. కాని తర్వాత 1930ల చివర్లో, 1940లలో భారతీయులను రాజకీయంగా విభజించడానికి, పర మతస్తుల పట్ల విద్వేషాన్ని నూరిపోయడానికి, ఘర్షణలు రెచ్చగొట్టడానికి, 'హిందూ జాతి' 'ముస్లిం జాతి' సిద్ధాంతాలను వ్యాప్తి చేయడానికి హిందూ ముస్లిం మతతత్వవాదులు ఉభయులూ మతాన్ని సంఘటిత, వర్గ, సిద్ధాంత సంబంధ రూపంలో వినియోగిస్తూ ఉన్నందువల్ల గాంధీజీ తన సూత్రీకరణను పూర్తిగా మార్చాడు. మతాన్ని (హిందుమతం, ఇస్లాం వంటి అర్థంలో) రాజకీయాన్ని దేనికదిగా వేరువేరుగా ఉంచాలని, మతాన్ని రాజకీయాల్లోకి, ప్రజా జీవితంలోకి తీసుకురాకూడదని, దాన్ని వ్యక్తి యొక్క ప్రైవేటు వ్యవహారంగానే చూడాలని ఆయన అప్పుడు చెప్పాడు. ఒక్కసారి కాదు రెండు సార్లు కాదు. 1940 నుంచి తను మరణించే రోజు వరకూ వారపత్రికలో పదేపదే అదే చెబుతూ వచ్చాడు. వాటిలో కొన్నిఉద్బోధలు ఆయన 'కలెక్టెడ్ వర్క్స్' పుస్తకంలో నమోదై ఉన్నాయి.

అలా ఆయన చెప్పిన మాటలు ఉదాహరణకు కొన్ని. మతాన్ని యధాతథంగా ఉండనిస్తే, అప్పుడు అది వ్యక్తిగత విషయం, దైవానికి మానవుడికి మధ్య వ్యవహారం అవుతుంది (1940). మతం వ్యక్తిగత వ్యవహారం. దానికి రాజకీయాలలో స్థానం ఉండకూడదు (1942). రాజ్యంపూర్తిగా లౌకికంగా ఉండాలి (1947). గాంధీజీ ఒక మిషనరీకి ఇలా చెప్పాడు. నేనే గనుక ఒక నియంతనైతే మతాన్ని, రాజ్యాన్ని వేరువేరుగా ఉంచుతాను. నేను నా మతానికి కట్టుబడి ఉంటా. దాని కోసం ప్రాణాలిస్తా. అది నా స్వంత వ్యవహారం. రాజ్యానికి దాంతో ఎలాంటి సంబంధం లేదు. (1946).

మతతత్వం మీద జాతీయ ఉద్యమం జరిపిన పోరాటంలో ఒక ప్రధాన బలహీనత ఉంది. మతతత్వానికి వ్యతిరేకంగా గాని, లౌకిక దృక్పథం వ్యాప్తికి గాని భావజాల స్థాయిలో ప్రచారోద్యమం అంతగా జరగలేదు. ఫలితంగా మతతత్వ శక్తులు పూర్తిగా అదుపులోకి రాలేదు. భారత రాజకీయ వ్యవస్థకు అవి ఒక మానని పుండుగా మిగిలిపోయాయి. ఆఖరుకు ఈ దేశాన్ని ముక్కలు చేయడంలో విజయవంతమయ్యాయి. అయినప్పటికీ, ఇంతకు ముందే పేర్కొన్నట్లు, 1946-47లో ఎంతగా మతతత్వం పెల్లుబికినా, విభజనకు దారితీసినా స్వతంత్ర భారతావని ఒక లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించుకోవడంలో, లౌకిక రాజ్యానికి, లౌకిక సమాజానికి పునాదులు వేసుకోవడంలో కృతకృత్యమయ్యిందంటే అది జాతీయ ఉద్యమం సాధించిన మహోన్నత విజయాల్లో ఒకటి.

నాటి జాతీయ ఉద్యమ ప్రధాన నాయకులు లౌకికవాదానికి కట్టుబడ్డారు. మతతత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ఈ విషయంలో వారు ఏ విధంగానూ రాజీ పడలేదు. కొన్ని ఉదాహరణలతో ఈ అంశాలను క్లుప్తంగా చెప్పుకుందాం. నిజానికి వీటిపై లెక్కలేనన్ని ఉదాహరణలు వున్నాయి. అన్నీ చెబితే వాటితోనే ఒక పెద్ద పుస్తకం నిండిపోతుంది.

ఎ. ముందుగా గాంధీజీని తీసుకుందాం. మతతత్వానికి ఆయన సంపూర్ణ వ్యతిరేకత కారణంగానే నాథూరాం గాడ్సే అనే ఒక మతోన్మాది ఆయనను హతమార్చాడు. మతాన్ని రాజకీయాల నుండి వేరుచేయాలంటూ 1940లలో గాంధీజీ చేసిన ప్రబోధలను ఇప్పటికే ఉటంకించాను. హిందూ, ముస్లిం, సిక్కు ఇలా అన్ని రకాల మతతత్వాలనూ ఆయన వ్యతిరేకించాడు. 1942లో ఆయన ఇలా పేర్కొన్నాడు. 'మత కారణాలతో మనుషులను వేరు చేయడం పూర్తిగా తప్పు'. హిందువులు, ముస్లింలు వేరువేరు మతాల వారు కాబట్టి వారి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు విభిన్నంగా ఉంటాయన్న మతతత్వ మౌలిక సూత్రీకరణను కూడా ఆయన ఖండించాడు. ఆయన ఒక చోట ఇలా రాస్తాడు. 'రెవెన్యూ పారిశుధ్యం, పోలీసు, న్యాయం లేదా ప్రజా ప్రయోజనాల వినియోగం విషయాలలో హిందూ ముస్లింల నడుమ

ప్రయోజనాల పరంగాఏం వైరుధ్యం ఉంటుంది? తేడా అంతా మతావలంబనలో, ఆచారాలలో ఉంటుంది. వాటితో లౌకిక రాజ్యానికి సంబంధమే లేదు.'

గాంధీజీ పౌరహక్కులకు పూర్తిగా కట్టుబడ్డాడు. కాని ఆయన ఒక మినహాయింపు ఇచ్చాడు. మత విద్వేషాన్ని వ్యాప్తి చేసేవారి వాక్, రచనా స్వేచ్ఛ హక్కులను పరిహరించాలని చాటిచెప్పాడు. 1936లో ఇలా రాస్తాడు.. 'నాకే కనుక అధికారం ఉంటే, మతతత్వాన్ని ప్రోత్సహించే ఎత్తుగడతో రాసిన రచనలన్నింటిని నిషేధిస్తా', మతతత్వం దేశవ్యతిరేకమే కాదు, అది హిందూ మతతత్వమైతే హిందుమత వ్యతిరేకం, ముస్లిం మతతత్వమైతే ముస్లీం మత వ్యతిరేకం కూడా అని ఆయన నిరంతరం ఘోషిస్తూ ఉండేవాడు.

"జవహర్‌లాల్‌నెహ్రూ దృష్టిలో హిందూ, ముస్లీం లేదా సిక్కు వంటి అన్ని రకాల మతతత్వ ప్రేలాపనలూ స్వతంత్ర భారతావని సమైక్యతకు పెను ముప్పు వాటిల్లజేసే విచ్ఛిన్న శక్తులే. 'లౌకిక ప్రాతిపదిక మీదే మన దేశ సమగ్రతను కాపాడు కోగలం' అన్నాడాయన. మతతత్వం 'భారత్‌ను ముక్కచెక్కలు చేస్తుంది' అని హెచ్చరించాడు."



ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను వ్యతిరేకించిన గాంధీ, నెహ్రూ, పటేల్

బి. జవహర్‌లాల్‌నెహ్రూ దృష్టిలో హిందూ, ముస్లీం లేదా సిక్కు వంటి అన్ని రకాల మతతత్వ ప్రేలాపనలూ స్వతంత్ర భారతావని సమైక్యతకు పెను ముప్పు వాటిల్లజేసే విచ్ఛిన్న శక్తులే. 'లౌకిక ప్రాతిపదిక మీదే మన దేశ సమగ్రతను కాపాడు కోగలం' అన్నాడాయన. మతతత్వం 'భారత్‌ను ముక్కచెక్కలు చేస్తుంది' అని హెచ్చరించాడు. భారత ప్రజాతంత్ర వ్యవస్థను ఖూనీ చేయడానికే ఉన్నట్లున్నాయని మతతత్వవాదుల కార్యకలాపాలను ఉద్దేశించి మరో సందర్భంలో ఆయన అన్నాడు. కాబట్టే, మతతత్వాన్ని నెహ్రూ 'ప్రధాన అరిష్టంగా, 'అత్యంత ప్రమాదకర పరిణామమని' భావించాడు. దీనిపై 'అన్ని వైపుల నుంచీ దాడి చేయాల'ని, భారతీయ జీవనం నుంచి సమూలంగా పెకలించి వేయాలని పేర్కొన్నాడు. అంతే కాకుండా, 'బయటి శత్రువుతోనైతే ముఖాముఖీ తలపడి పోరాడగలం. కాని శత్రువు మనలో లోపలే, మన మనసుల్లోనే, మన హృదయాల్లోనే ఉన్నప్పుడు మనం ఏం చేయాలి?' అంటూ మరో చోట తన ఆవేదన వ్యక్తం చేశాడు.

మతతత్వం అంశం మీద రాజీ సమస్యే లేదని ఆయన పదేపదే వాదించాడు. పడినా లేచినా లౌకికవాదాన్నే దేశం అంటిపెట్టుకుని ఉండాలని చెప్పాడు. ఈ విషయంలో ఏ కాంగ్రెస్ వాది మనసులోనూ ఇసుమంతైనా సంశయం ఉండడానికి వీల్లేదని 1951 జులై ఏఐసిసి సదస్సులో తేటతెల్లం చేశాడు. 'కడశ్వాస దాకా మనం ఒక లౌకిక రాజ్యం కోసం నిలిచి ఉందాం' అని పిలుపు ఇచ్చాడు. అంతకు ముందు 1948లో ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు. 'అది ఖచ్చితంగా ఒక దుష్టశక్తి, దానితో రాజీ పడటం ఎప్పటికీ ప్రమాదకరమే. జాతీయతా వాద భారతదేశం వేటికైతే కట్టుబడి ఉందో వాటన్నింటినీ కూలదోయడమే ఆర్ఎస్ఎస్ ప్రత్యక్ష లక్ష్యంగా పెట్టుకుంది' ఆనాటి నుంచీ ఆయన మతతత్వానికి వ్యతిరేకంగా పట్టు సడలని ప్రచార ఉద్యమం చేపట్టాడు.

మతతత్వాన్ని భారతీయ తరహా ఫాసిజంగా కూడా నెహ్రూ భావించాడు. కాబట్టి లౌకిక వాదం ప్రజాస్వామ్యానికి ఒక తప్పనిసరి అవసరంగా ఆయన పరిగణించాడు. 1930ల చివర్లో, 1940లలో మతతత్వానికి సమకాలీన ఫాసిజంతో సన్నిహిత సారూప్యత ఉన్నట్టు నెహ్రూ స్పష్టంగా గ్రహించగలిగాడు. దాని మాదిరిగా విద్వేషం, హింస, పెద్ద అబద్దాలప్రచారం వంటి పద్ధతులను, దాని తరహాలో సంస్థాగత నిర్మాణాలను, నాయకత్వ శైలిని భారత్‌లో మతతత్వ వాదులు అనుసరిస్తున్నారు. 1939లో ఆయన ఇలా అన్నారు.. 'ఫాసిస్టు భావాలు ముస్లింలీగ్ లోనే కాకుండా ఖచ్చితంగా హిందూ మహాసభ లోనూ ప్రబలుతున్నాయి'. ముస్లింలీగ్‌ను, జిన్నాను ప్రస్తావిస్తూ, 1940లో ఇలా పేర్కొన్నాడు.. 'నాజీ పద్ధతుల్లో విద్వేషం, హింసాకాండలతో కూడిన ఓ ప్రతికూల కార్యక్రమం' రూపుదిద్దుకుంది. 1945లో లార్డ్ వేవెల్‌తో సమావేశమైనప్పుడు కూడా, ముస్లింలీగ్ నాయకత్వ పంథాలోనూ, విధానంలోనూ హిట్లేరియన్‌'గా మారిందని నెహ్రూ ఆయనతో అన్నాడు.

1947 నుంచీ నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను ఫాసిస్టు సంస్థగా అభివర్ణించసాగాడు. ఉదాహరణకు 1947లో ముఖ్యమంత్రులకు రాసిన లేఖను తీసుకుందాం. అందులో ఇలా పేర్కొన్నాడు. రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఒక ప్రయివేటు ఆర్మీ తరహా సంస్థ. అది తూ. చా. తప్పకుండా నాజీ పంథాలో సాగుతోంది. ఆఖరుకు దాని సంస్థాగత నిర్మాణ పద్ధతి కూడా అలాగే ఉంది. ఇలా చెప్పడానికి కావల్సినన్ని ఆధారాలు ఉన్నాయి.

డిసెంబర్ 1948లో ఆయన ఆర్ఎస్ఎస్ మీద మరొకసారి ఆగ్రహపూరిత వ్యాఖ్యలు చేశాడు. ఆర్ఎస్ఎస్ ఒక బహిరంగ సంస్థగా కనిపించే రహస్య సంస్థ. దానికి సభ్యత్వ నియమాలు లేవు. రిజిష్టర్లు లేవు. భారీ మొత్తాల్లో నిధులు వసూలు చేస్తున్నా వాటికి అకౌంట్లు లేవు. ఆ సంస్థకు సత్యాగ్రహం వంటి శాంతియుత మార్గాలలో నమ్మకం లేదు. వారుపైకి చెప్పేది చేసేదానికి పూర్తిగా విరుద్ధం. ఫాసిజం మద్దతుతో యూరపులో పలు ప్రాంతాల్లో వృద్ధి చెందిన సంస్థల లాంటిదే ఆర్ఎస్ఎస్'.

భారతీయ సందర్భంలో లౌకికవాదం అంటే మైనారిటీలకు పూర్తి రక్షణ కల్పించటం, వారిలోని భయాలను తొలగించడం అని కూడా నెహ్రూకు స్పష్టత ఉంది. మతతత్వానికి చెల్లుబాటు లేదు. వాస్తవంలో దానికి ఎలాంటి ప్రాతిపదిక

**"సర్దార్ పటేల్‌కూడా లౌకికవాదానికి పూర్తిగా కట్టుబడ్డాడు. ఆయన మతతత్వానికి గట్టి వ్యతిరేకి. సిద్ధాంతపరంగా ప్రత్యేక మొగ్గు కనబరచకపోయినా లౌకికవాదానికి తను కట్టుబడి ఉన్నానని, మతతత్వాన్ని మతతత్వ సంస్థలను వ్యతిరేకిస్తామని ఆయన తరచూ ప్రకటిస్తూ ఉండేవాడు. 1947 జూన్‌లో భారత్‌ను ఒక హిందూ రాజ్యం చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు పటేల్ దాన్ని తిరస్కరించాడు."**

లేదు, అందులో 'సత్యం'లేదు అంటూ పదేపదే చెప్పాడు. మతపరంగా గాని భాషపరంగా గానీ మైనారిటీలు సంఖ్యాపరమైన బలహీనత కారణంగా అధిక సంఖ్యాకుల చేతిలో ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా లేదా మతపర మైన వివక్షకు గురవుతామన్న భయం– అందుకు అస్కారం లేకపోయినా – వారిలో గూడు కట్టుకుని ఉంటుందన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. ఈ భయం, ఈ అభద్రతా భావం వారిలో నుంచి తొలగించాలని, మైనారి టీల రక్షణ కోసం అవసర చర్యలు తీసుకోవాలని నెహ్రూ నిరంతరం నొక్కి చెబుతుండేవాడు. అదే సమయంలో ఆయన మెజారిటి, మైనారిటి మతతత్వాలు రెండింటినీ సమానంగా వ్యతిరేకిం చాడు. లౌకికవాదం మైనారిటీల క్షేమం కోసం కూడానని, మైనారిటీ మతతత్వవాదం దేశానికే కాకుండా మైనారిటీలకూ హానికలిగించిందని చెప్పాడు. హిందూ, ముస్లీం లేదా సిక్కు ఏదైనా కానివ్వండి అన్ని మతతత్వాలపై ఏకకాలంలో నిరంతరం దాడి చేయడమే లౌకికవాదానికి అర్థమని ఆయన స్పష్టంగా గుర్తించాడు. మెజా రిటీ కాని, మైనారిటీ కాని ఏ మతతత్వమైనా భారతదేశ సమైక్యతకు, అభివృద్ధికి భంగకరమని భావించాడు.

మతతత్వానికి వ్యతిరేకంగా అంత కఠిన మైన పంథా తీసుకున్నందువల్లే మతతత్వ వాదులు ఆయన్ను బతికినంత కాలం ద్వేషిం చారు. ఆయన పట్ల అంత శతృభావంతో మెలిగారు... ఈనాటికీ వారిది అదే వైఖరి.

సి. సర్దార్ పటేల్‌కూడా లౌకికవాదానికి పూర్తిగా కట్టుబడ్డాడు. ఆయన మతతత్వానికి గట్టి వ్యతిరేకి. సిద్ధాంతపరంగా ప్రత్యేక మొగ్గు కనబరచకపోయినా లౌకికవాదానికి తను కట్టుబడి ఉన్నానని, మతతత్వాన్ని మతతత్వ సంస్థలను వ్యతిరేకిస్తామని ఆయన తరచూ ప్రకటిస్తూ ఉండేవాడు. 1947 జూన్‌లో భారత్‌ను ఒక హిందూ రాజ్యం చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు పటేల్ దాన్ని తిరస్కరించాడు. ఈ దేశంలో 'ఇతర మైనారిటీలు ఉన్నారన్న విషయాన్ని మర్చిపోకూడదు. వారి పరిరక్షణ మన ప్రాథమిక బాధ్యత. కులం లేదా మత విశ్వాసాలతో సంబంధం లేకుండా రాజ్యం అందరిదీ అయి ఉండాలి' అని స్పష్టం చేశాడు. 1948 డిసెంబర్ నాటి కాంగ్రెస్ జైపూర్ సదస్సులో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం రెండూ భారత్‌ను ఒక నిజమైన లౌకిక రాజ్యంగా తీర్చిదిద్దాలి' అనే కృతనిశ్చయంతో ఉన్నాయని ప్రకటించాడు. 1949 ఫిబ్రవరిలో "హిందూరాజ్" అనే చర్చ వచ్చినప్పుడు దాన్ని 'పిచ్చి ప్రేలాపనగా' అభివర్ణించాడు. 'మనది లౌకికరాజ్యం. మన విధానాలు, మన నడవడిక పాకిస్థాన్ మాదిరిగా ఉండవు. మన లౌకిక ఆదర్శాలు ఆచరణలో నిజం కావాలి. ఇక్కడ ప్రతి ముస్లీమూ తానొక భారతీయ పౌరుడినని, భారతీయుడిగా తనకు సమాన హక్కులు ఉన్నాయని భావించి తీరాలి. ఆ విధంగా భావిం చేలా అతడిని చేయలేకపోతే, మన వారసత్వానికి, మనదేశానికి తగిన వాళ్లం కాబోము' అని 1950లో ఒక బహిరంగ సభలో పటేల్ సభికులకు స్పష్టం చేశాడు. బార్డోలీ సత్యాగ్రహం (1928)లోనూ, తాను నడిపిన అన్ని ప్రజా ఉద్యమాలలోనూ ఆయన పూర్తిగా లౌకికవాది. కేవలం మరికొన్ని స్థానాలు గెలుచుకోవడం కోసం 1945 డిసెంబర్‌లో బెంగాల్‌లోహిందూ మహాసభతో కాంగ్రెస్ ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు.

మతపరమైన అల్లర్లకు పాల్పడే వారి మీద కఠిన చర్యలు తీసుకోవలసిందిగా 1946–47లో అప్పటి బ్రిటిష్ పాలకులను డిమాండ్ చేశాడు. భారత ప్రభుత్వంలో హోం సభ్యుడిగా ఆయన మతోన్మాదులపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకున్నాడు. 1947లో జరిగిన మత కలహాల ను 'భారత చరిత్రలో ఒక చీకటి అధ్యాయం' గా అభివర్ణించాడు. నెహ్రూ వలే ఆయన కూడా మెజారిటీ, మైనారిటీ మతతత్వాలు రెండింటినీ వ్యతిరేకించాడు.

గాంధీజీ హత్యలో హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్‌ల పాత్రకు సంబంధించి, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీకి 1948 జులై 18న రాసిన లేఖలో పటేల్ ఇలా వ్యాఖ్యానిస్తాడు.. 'గాంధీజీ హత్య కేసు న్యాయవిచారణలో ఉన్నందున, ఆర్ఎస్ఎస్ హిందూ మహాసభల ప్రమేయం గురించి నేను ఏ విషయం చెప్ప దలుచుకోలేదు: కాని ఈ రెండు సంస్థలు, ముఖ్యంగా మొదటి సంస్థ (ఆర్ఎస్ఎస్) కార్యకలాపాల ఫలితంగా ఇలాంటి భయానక విషాదం సంభవించగల వాతావరణం నెలకొన్నదని మా నివేదికలు నిర్ధారిస్తున్నాయి. హిందూ మహాసభలోని ఉగ్రవాద వర్గం ఈ కుట్రలో పాల్గొందని నేను నిస్సందేహంగా భావిస్తున్నాను. ఆర్ఎస్ఎస్ కార్యకాలపాలు ప్రభుత్వం, రాజ్యం ఉనికికి ముప్పు తెస్తున్నాయి' అని చెప్పాడు. అంతకు ముందు 1948 మే 6న ఆయన ఇలా రాశారు.. 'మహాసభ ప్రతినిధులు పలువురు కొద్ది నెలల క్రితం వరకూ కూడా ప్రబోధించిన తీవ్రవాద మతతత్వం ప్రజా భద్రతకు ప్రమాదంగా తప్ప మరెలానూ పరిగణించలేం. ఇదే ఆర్ఎస్ఎస్‌కూ వర్తిస్తుంది. మిలిటరీ లేదా సెమీ – మిలిటరీ పంథాలో రహస్యంగా నడుస్తున్న ఈ సంస్థలో మరింత ముప్పు నిపురుగప్పి ఉంది'. గాంధీజీ హత్యానంతరం 1948లో హోంమంత్రి హోదాలో ఆయన ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించాడు.

డి. సుభాష్ చంద్రబోస్ కూడా మతతత్వానికి తీవ్ర వ్యతిరేకి. ఈ భావజాలాన్ని వ్యతిరేకిం చాల్సిన, అధిగమించాల్సిన సమస్యగా గుర్తించాడు. ఉదాహరణకు, 1940లో ఆయన వ్యక్తం చేసిన లిఖిత పూర్వక అభిప్రాయం ఇది.. 'మతతత్వ మనస్తత్వం పోయినప్పుడే మతతత్వం పోతుంది. కాబట్టి మతతత్వాన్ని మట్టుపెట్టట మనే పని ముస్లీంలు, సిక్కులు, హిందువులు, క్రైస్తవులు తదితరులందరిదీ, భారతీయులంద రిదీ. దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి, నిజమైన జాతీయతావాద మనస్తత్వాన్ని అలవరుచుకోవాలి.'

సుభాష్ తన ఆత్మకథ 'ద ఇండియన్ స్ట్రగుల్'లో స్వాతంత్ర్య పోరాటంలో మతతత్వ పార్టీలు పోషించిన పాత్ర గురించి చర్చిస్తూ, ఇలా రాస్తాడు.. పాలకులు విసిరిన రొట్టెముక్కల్లాంటి వాటిని తమలో తాము పంచుకోవడంలోనే మతతత్వ పార్టీలు నిమగ్నమై ఉండేవి. భారత జాతీయ కాంగ్రెస్‌ను వేధించడానికి, దాని పలుకుబడిని తగ్గించడానికి ప్రభుత్వం విభ

జించి-పాలించు వ్యూహంతో ఈ పార్టీలను ఎంతగానో ప్రోత్సహించింది.' 'రాజకీయ స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటం మీద వీటికెలాంటి ఆసక్తి లేదు' అని వారినుద్దేశించి ఆయన పేర్కొన్నాడు.

సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు కలిసి 1928లో స్థాపించిన ఇండిపెండెన్స్ ఆఫ్ ఇండియా లీగ్ ఒక మతతత్వ సంస్థ సభ్యుడిని అందులో చేరకుండా నిషేదించడం చెప్పుకోదగిన విషయం. అలాగే, కాంగ్రెస్ కమిటీకి హిందూ మహాసభ లేదా ముస్లిం లీగ్ సభ్యుడెవరూ ఎన్నిక కాకుండా బోస్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు జాతీయ కాంగ్రెస్ ఆయన మార్గదర్శకత్వంలో వారిపై నిషేధం విధించింది.

జాతీయ ఉద్యమ ఆనవాయితీకి అనుగుణంగా సుభాష్ కూడా 'భిన్నత్వంలో ఏకత్వం' సూత్రానికి పూర్తిగా కట్టుబడ్డాడు. ఉదాహరణకు 1938లో హరిపుర కాంగ్రెస్ సదస్సులో ఆయన చేసిన సుప్రసిద్ధ అధ్యక్షోపన్యాసంలో కొన్ని వ్యాఖ్యలు.. 'ఉమ్మడి స్వాతంత్ర్యంలో సమైక్యత, సహకారాలు ఉండాలన్న ధ్యేయానికి అర్థం ఏ విధంగానూ భారతీయ జీవన ఉన్నత సాంస్కృతిక వైవిధ్యాన్ని రూపుమాపటం కాదు, తద్వారా ప్రతి వ్యక్తికి, ప్రతి గ్రూపుకు నిర్నిరోధకంగా తన సామర్థ్యం, విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి చెందే స్వేచ్ఛను, అవకాశాన్ని కల్పించేందుకు వీలుగా ఆ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవలసి ఉంది'.

ఇ. భగత్ సింగ్ ఆయన కామ్రేడ్ల పేర్లను, ప్రఖ్యాతిని తమ స్వంత రాజకీయం కోసం వినియోగించుకోవాలని మతోన్మాదసంస్థలు కపటంతో ప్రయత్నిస్తున్నాయి. వాస్తవానికి గాంధీజీ మినహా మరే ఇతర భారతీయ నాయకుడికంటే కూడా ఎక్కువగా భగత్‌సింగ్ మతతత్వం ముప్పును అర్థం చేసుకున్నాడు. భారతీయ సమాజానికి, జాతికి, వలసపాలన వ్యతిరేక భారత ఉద్యమానికి మతతత్వం విసిరే ముప్పును ఆయన గుర్తించాడు.

**"భారత ప్రజలకు వలసపాలనవలే మతతత్వం కూడా పెద్ద శత్రువని భగత్‌సింగ్ తన కామ్రేడ్స్‌ను, యువ అనుచరులను తరచూ హెచ్చరిస్తూ ఉండేవాడు. 1926లో భగత్‌సింగ్ ఆయన కామ్రేడ్స్ కలిసి విప్లవకారుల బహిరంగ వేదికగా నౌజవాన్ భారత్ సభను నెలకొల్పారు. పంజాబ్‌లో మతతత్వం మీద పోరాటం జరిపి రాజకీయాలను 'మతపర భావోద్వేగాల నుంచి' విముక్తి చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలలో ఒకటి."**



సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్

భారత ప్రజలకు వలసపాలన వలే మతతత్వం కూడా పెద్ద శత్రువని భగత్‌సింగ్ తన కామ్రేడ్స్‌ను, యువ అనుచరులను తరచూ హెచ్చరిస్తూ ఉండేవాడు. 1926లో భగత్‌సింగ్ ఆయన కామ్రేడ్స్ కలిసి విప్లవకారుల బహిరంగ వేదికగా నౌజవాన్ భారత్ సభను నెలకొల్పారు. పంజాబ్‌లో మతతత్వం మీద పోరాటం జరిపి రాజకీయాలను 'మతపర భావోద్వేగాల నుంచి' విముక్తి చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. 1928 ఏప్రిల్‌లో నౌజవాన్ భారత్ సభ పునర్వ్యవస్థీకరణ కోసం యువజన సదస్సు ఒకటి జరిగింది. ఆకాలీ పార్టీ వంటి మతతత్వ సంస్థలకు చెందిన యువతను భారత్ సభ శ్రేణుల్లో చేర్చుకోవాలన్న ప్రతిపాదనను భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్స్ విజయవంతంగా ప్రతిఘటించారు. మతతత్వ ప్రయోజనాలు సాధించుకోవడానికి మతాన్ని వాడుకోవడాన్ని కూడా వారు విమర్శించారు. 'అసలు దాన్ని కప్పిపుచ్చి మిధ్యా సమస్యను సృష్టిస్తున్నారని మతతత్వ నేతలను అప్పుడు విడుదల చేసిన మేనిఫెస్టోలో సభ నిరసించింది.

నౌజవాన్ భారత్ సభ ఆరు నియమాల్లోని రెండు అలాంటివే. అవి ఇలా ఉన్నాయి. "మతతత్వ సంస్థలు లేదా మతతత్వ భావాలే ప్రధానంగా ఉండే ఇతర పార్టీలతో సంబంధం లేదు. 'మతాన్ని మనిషి వ్యక్తిగత వ్యవహారంగా పరిగణిస్తూ ప్రజల్లో సహనశీల స్ఫూర్తిని కలిగించాలి'.

భగత్‌సింగ్ విషయంలో ఇదెంత వాస్తవమో సాయుధ పోరాటాన్ని నమ్మిన ఇతర విప్లవకారుల విషయంలోనూ అంతే వాస్తవం. గదర్‌పార్టీ (1914-1918) లౌకికవాదాన్ని అనుసరించింది. మతాన్ని రాజకీయం నుంచి వేరు చేసింది. మతం వ్యక్తి స్వంత వ్యవహారమని ప్రకటించింది. తన సభ్యుల్లో, అనుయాయుల్లో లౌకిక స్పృహను పాదుగొలపడానికి నడుం బిగించింది. ఆ సంస్థ ప్రముఖుడు బాబా సోహాన్ సింగ్ భాక్నా ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నాడు. "మేము సిక్కులం లేదా పంజాబీలం కాదు, మా మతం దేశభక్తి'.

1925- 28నాటి కకోరి అమరవీరులు లౌకికవాదులకు ఎంత మాత్రం తీసిపోరు. 1920ల మతఘర్షణలు, మతతత్వ సంస్థలు సృష్టించిన మతతత్వ విభజన చూసి చలించిపోయిన రామ్‌ప్రసాద్ బిస్మిల్ 1928 జనవరిలో తన ఆఖరు సందేశంలో హిందు-ముస్లింలు సమైక్యం కావాలని పిలుపునిచ్చాడు. అష్ఫఖుల్లా ఖాన్ అనే మరో కకోరి అమరవీరుడితో తన సాన్నిహిత్యాన్ని ప్రసావిస్తూ, ఆయనిలా రాశాడు... ' మా దేశ ప్రజలకు మా మరణాలు కించిత్ అయినా బాధ కలిగించేట్లయితే, వారికి మా విజ్ఞప్తి ఒక్కటే. హిందూ ముస్లింలు ఐకమత్యంతో మెలగాలి. ఇది మా చివరి కోరిక. ఈ ఐకమత్యమే మా పట్ల వారి నివాళి అవుతుంది'. 1927 డిసెంబర్ 16న ఫైజాబాద్ జైలు నుంచి అష్ఫఖుల్లా ఖాన్ ఇలా పిలుపు ఇచ్చాడు. 'సహచర భారతీయులారా, మీరే మతానికి చెందిన వారైనా, మీరే వర్గానికి చెందిన వారైనా కానివ్వండి.దేశ సేవలో మీరంతా ఒక్కటవ్వండి. పరస్పరం పోట్లాడుకోకండి. మీ దేశాన్ని విముక్తం చేసేందుకు విదేశీ పాలకులపై పోరాడేందుకు మీరంతా ఒక్కటికండి'. ❋

# మార్క్స్ - ఏంగెల్స్ చారిత్రాత్మక సమావేశం

ఎం శివరామకృష్ణన్

“రైనిష్ జీటుంగ్” అనే తీవ్రవాద పత్రికలో ఏంగెల్స్ రాసిన కథనాలను మార్క్స్ చదివాడు. రాజకీయ అర్థశాస్త్రం పై “ ఫ్రెంచ్–జర్మన్ స్పెషల్ నెంబర్” సంచికలో ఏంగెల్స్ రాసిన విమర్శనాత్మక వ్యాసాలు మార్క్స్‌ని చాలా ఆకట్టుకున్నాయి. బూర్జువా అర్థశాస్త్రం, బూర్జువా సామాజిక వ్యవస్థపై ఏంగెల్స్ చేసిన మొట్ట మొదటి సోషలిస్టు విమర్శగా మార్క్స్ భావించాడు. కాపిటల్ గ్రంథంతో పాటు అనేక రచనలలో మార్క్స్ ఏంగెల్స్ విమర్శలను ప్రస్తావించాడు.

కొలోన్‌లో కారల్ మార్క్స్ ఏంగెల్స్‌ను కలిసినప్పటికీ ఆ సమయంలో అతనితో ఎలాంటి చర్చలు జరపలేకపోయాడు. ఇంగ్లాండ్‌లోని కార్మికవర్గ పరిస్థితులపై ఏంగెల్స్ రాసిన వ్యాసాలతో పాటు అతను రాసిన ఇతర వ్యాసాలను చదివిన తర్వాత మార్క్స్‌కి ఒక విషయం అర్థమయింది. తనకి ఏంగెల్స్‌కి ఒకే రకమైన అభిప్రాయాలున్నాయని తెలుసుకున్నాడు. అప్పటి నుండి మాంచెస్టర్‌లో ఉన్న ఏంగెల్స్‌ను కలుసుకోవడానికి మార్క్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూశాడు.

“ఫ్రెంచ్–జర్మన్ స్పెషల్ నెంబర్” సంచిక కోసం వ్యాసాలు రాయాలని మార్క్స్ ఏంగెల్స్‌కి లేఖ రాశారు. ఏంగెల్స్ చాలా సంతోషంగా రెండు వ్యాసాలను రాసి పంపాడు. అప్పటికే పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ గురించిఅధ్యయనం చేయడంలో మునిగిపోయిన ఏంగెల్స్, మార్క్స్‌ని కలుసుకొని కార్మికులు అనుభవిస్తున్న దారుణమైన పరిస్థితులపై చర్చించడానికి ఎంతో ఆతురతగా ఎదురు చూశాడు.

1844 ఆగష్టు చివరిలో ఏంగెల్స్ జర్మనీకి తిరిగి వెళ్ళే క్రమంలో పారిస్ వెళ్ళి మార్క్స్‌ను అతని ఇంట్లో కలుసుకున్నాడు. ఆ సమయంలోనే జెన్నీ మార్క్స్ అనారోగ్యంతో ఉన్న తల్లిని కలవడానికి ట్రైయర్ వెళ్ళింది. జెన్నీ కూడా ఇంట్లో లేకపోవడంతో ఏంగెల్స్ మార్క్స్ నివాసంలో సుమారు 10 రోజులపాటుఉన్నాడు. వారిద్దరూ తత్వశాస్త్రం,రాజకీయాలు, అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానం, దాని క్రూరమైన దోపిడీ సంబంధాలు, కార్మికవర్గ పరిస్థితితో పాటు కార్మికులపై ఊహాజనిత సోషలిస్ట్ సిద్ధాంతాల ప్రాబల్యం గురించి సూటిగా చర్చించారు. పారిస్‌లో ఉన్న 10 రోజుల్లో కారల్ మార్క్స్ ఏంగెల్స్ వివిధ కమ్యూనిస్టు సోషలిస్టు గ్రూపుల సభ్యులను కలుసుకున్నారు. మార్క్స్ ఏంగెల్స్‌ను వలస వచ్చిన జర్మన్ కార్మికుల వద్దకు తీసుకువెళ్ళాడు. ఇద్దరూ కలిసి గ్రూపులతో, వలస కార్మికులతో చర్చలు జరిపారు. వారిద్దరూ శ్రామికవర్గం కోసం కొత్త విప్లవాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని ప్రముఖంగా ఎత్తి చూపే విధంగా పుస్తకం రాయాలని నిర్ణయించుకున్నారు. వారు హెగెల్ తత్వశాస్త్రంలోని విరుద్ధమైన స్వభావాన్ని, ఫ్యూయర్‌బా భౌతికవాదంలోని బలహీనతల గురించి చర్చించారు. హెగెల్ తత్వశాస్త్రంలోని ఆదర్శపూర్వక మధింపులను, ఫ్యూర్‌బా భౌతికవాదంలోని అశాస్త్రీయమైన అంచనాలను తొలగించాలని వారు బావించారు.

రాజకీయ ఆర్థిక వ్యవస్థపై పుస్తకం రాయడానికి మార్క్స్ తీసుకున్న నిర్ణయాలను ఏంగెల్స్ ఆమోదించారు. భవిష్యత్తులో ఇద్దరూ కలిసి శ్రామికవర్గం కోసం పనిచేస్తూ తమ జీవితాలను అంకితం చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

ఏంగెల్స్ ఇలా అన్నారు : “1844 వేసవిలో పారిస్‌లో మార్క్స్‌ను కలిసినప్పుడు అన్ని సైద్ధాంతిక రంగాలలో నిర్దిష్టమైన తేదీలలో, నిర్దిష్టమైన సమయాల్లో ఉమ్మడిగా పనిచేయాలని మా మధ్య ఒప్పందం జరిగింది. వారి మధ్య చర్చల సందర్భంగా మార్క్స్ జర్మన్ తత్వశాస్త్రంలో బాగా ముందున్నారని, ఏంగెల్స్ రాజకీయ, ఆర్థిక అంశాలలో బాగా ప్రావీణ్యం కలవారని వారు భావించారు. వారు క్రమం తప్పకుండా ఒకరినొకరు సంప్రదించుకొని కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

యువ హెగెలియన్ల సైద్ధాంతిక పరిమితులపై బుక్ లెట్ రాయాలనే కోరికను మార్క్స్ ఏంగెల్స్‌కు తెలియజేశాడు. బుక్‌లెట్‌ను తయారు చేయడానికి సహకరించమని ఏంగెల్స్‌నుకోరాడు. ఏంగెల్స్ వెంటనే ఈ ప్రతిపాదనను అంగీకరించి బుక్‌లెట్‌కు సుమారు 30 పేజీలకు సరిపడా వ్యాఖ్యానాలు రాసి ఇచ్చారు.

బుక్‌లెట్‌ను రాయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందంటే? “రైనిష్ జీటుంగ్” పత్రికను స్థాపించినప్పుడు యువ హెగెలియన్లు తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేక వైఖరి తీసుకున్నారు. తర్వాత క్రమ క్రమంగా ఆ వైఖరిని వదులుకున్నారు. వారు అనేక సమస్యలపై తమ ప్రజాస్వామ్య విశ్వాసాలను విడిచిపెట్టారు. తరువాత వారు మితవాద వైఖరి తీసుకున్నారు. మతం మరియు ప్రష్యన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువ హెగెలియన్లు తమ పోరాటాన్ని వదులుకున్నారు. చివరికి అరాచకవాద వైఖరి గల మేధావుల సమూహంగా మారారు. అంతే కాదు వారు శ్రామికులను అనాలోచిత ద్రవ్యరాశిగా పరిగణించడం ప్రారంభించారు. వారు వ్యక్తి ఆరాధనను సమర్థించారు. బ్రూనో బాయర్ అనే యువ హెగెలియన్ ప్రష్యన్ పాలకుల అభివృద్ధి నిరోధక వైఖరిని ఉత్సాహంగా స్వాగతించారు.

మార్క్స్ 1844 నవంబర్ చివరి నాటికి బుక్ లెట్ పనిని పూర్తి చేసి,1845 చివరి నాటికి ఫ్రాంక్‌ఫర్ట్‌లో ముద్రించారు. “హోలీ ఫ్యామిలీ లేదా బ్రూనో బాయర్ అండ్ కోకు వ్యతిరేకంగా విమర్శనాత్మకమైన శాస్త్రీయ విమర్శ” గా బుక్ లెట్ ప్రచారంలోకి వచ్చింది

“జర్మన్ – ఫ్రెంచ్ స్పెషల్ నంబర్ సంచిక” ప్రచురించిన తరువాత పత్రిక తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. జర్మనీలో పత్రిక నిషేధించడమే సంక్షోభానికి ప్రధాన కారణం. పత్రిక సంక్షోభానికి ఇతర కారణాలతో పాటు అంతర్గత

**“పేదరికం అనేది ప్రైవేట్ ఆస్తి ఉత్పత్తి రూపం. ప్రైవేటు ఆస్తి అనేది ప్రస్తుత వ్యవస్థ యొక్క చట్రంలో సంస్కరణ లేదా ప్రభుత్వ జోక్యం ద్వారా రద్దు చేయబడదని మార్క్స్ ఒక నిర్ణయానికి వచ్చారు. ‘వోర్వార్ట్స్‌లో మార్క్స్ రాస్తున్న రచనలను గమనిస్తున్న జర్మన్ ప్రభుత్వం మార్క్స్ రచనలపై తీవ్రమైన కోపంతో ఉంది. జర్మన్ ప్రభుత్వం చాలా అడ్డంకులను సృష్టించినప్పటికీ పత్రిక వివిధ మార్గాల ద్వారా జర్మనీలోకి ప్రవేశించింది.”**

కారణం కూడా ఉంది. అది ఏమిటంటే పత్రిక సంయుక్త సంపాదకుడు యంగ్ హెగెలియన్లలో ఒకరైన ఆర్నాల్డ్ రూజ్ మార్క్స్, ఏంగెల్స్ విప్లవాత్మక రచనలను చూసి భయపడ్డాడు. అతను కార్మికవర్గాన్ని విప్లవాత్మక వర్గంగా పరిగణించక పోగా అనాలోచిత ద్రవ్యరాశి గుంపుగా విమర్శించాడు. కార్మికవర్గాన్ని విప్లవాత్మక వర్గంగా మార్క్స్ భావించారు. మార్క్స్, ఆర్నాల్డ్ రూజ్ అనేక సమస్యలపై భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉన్నారని చాలా త్వరగా స్పష్టమైంది. వారి స్నేహం కూడా ముగియడం పత్రికను ప్రభావితం చేసింది. పత్రిక ప్రచురణ కూడా ఆగిపోయింది. పత్రిక మూతపడటంతో మార్క్స్ తన వ్యాసాలను ప్రచురించడానికి ఇతర పత్రికల కోసం వెతుకుతున్నాడు. విదేశాల నుండి 15 రోజులకు ఒకసారి ప్రచురించే ‘వోర్వార్ట్స్’ అనే పత్రికలో అతనికి అవకాశం లభించింది. కొంతకాలం తరువాత మార్క్స్ స్నేహితుడు కార్ల్ బెర్నేస్ పత్రికకు సంపాదకుడు అయ్యాడు. అనతి కాలంలోనే మార్క్స్ ప్రధాన పాత్రను ఇతరులు గుర్తించారు. పత్రిక కోసం ఏంగెల్స్ రచనలు చేసే ఏర్పాటును మార్క్స్ చేశాడు. పత్రిక ఎడిటోరియల్ బోర్డులో మార్క్స్ తో పాటు అతని స్నేహితులు హీన్, హెర్వెగ్, బకునిన్, రూజ్తో పాటు మరికొందరున్నారు.

1844 జూన్‌లో జర్మనీలోని సిలేసియా ప్రాంతంలో క్రూరమైన దోపిడీ, తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా చేనేత కార్మికులు పెద్ద పోరాటం ప్రారంభించారు. ఇది జర్మన్ కార్మికవర్గ మొట్ట మొదటి వర్గ పోరాటం. ‘వోర్వార్ట్స్’ పత్రికలో “సమ్మె కోసం కార్మికులపై దాడి” అనే వ్యాసం ఆర్నాల్డ్ రూజ్ రాశారు. కార్మికులు చేస్తున్న సమ్మెను తెలివిలేని వీరోచిత చర్యగా, వ్యర్థమైన తిరుగుబాటుగా ఆర్నాల్డ్ రూజ్ వ్యాసంలో పేర్కొన్నాడు. మార్క్స్ మరొక వ్యాసంలో ఆర్నాల్డ్ రూజ్ అభిప్రాయాలతో విభేదిస్తూ తగిన సమాధానం ఇచ్చారు. సిలేసియన్ చేనేత కార్మికుల పోరాటం, జర్మన్ కార్మికులలో పెరుగుతున్న కార్మికవర్గ చైతన్యానికి సంకేతం అని మార్క్స్ నొక్కి చెప్పారు. ప్రైవేటు ఆస్తితో కూడిన సమాజాన్ని కార్మికులు నేరుగా వ్యతిరేకిస్తున్నారని వ్యాసంలో పేర్కొన్నారు.

పేదరికం అనేది ప్రైవేట్ ఆస్తి ఉత్పత్తి రూపం. ప్రైవేటు ఆస్తి అనేది ప్రస్తుత వ్యవస్థ యొక్క చట్రంలో సంస్కరణ లేదా ప్రభుత్వ జోక్యం ద్వారా రద్దు చేయబడదని మార్క్స్ ఒక నిర్ణయానికి వచ్చారు. ‘వోర్వార్ట్స్ లో మార్క్స్ రాస్తున్న రచనలను గమనిస్తున్న జర్మన్ ప్రభుత్వం మార్క్స్ రచనలపై తీవ్రమైన కోపంతో



**1844లో సమ్మె చేస్తున్న సిలేసియా చేనేత కార్మికులు**

ఉంది. జర్మన్ ప్రభుత్వం చాలా అడ్డంకులను సృష్టించినప్పటికీ పత్రిక వివిధ మార్గాల ద్వారా జర్మనీలోకి ప్రవేశించింది. పత్రికను నిషేధించాలని జర్మన్ ప్రభుత్వం ఫ్రెంచ్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం ప్రారంభించింది. ఫ్రాన్స్‌లోని జర్మన్ రాయబారి పత్రికపై నిషేధాన్ని ప్రకటించాలని ఫ్రెంచ్ ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేశాడు. జర్మన్ ప్రభుత్వ ఒత్తిడికి లొంగిన ఫ్రాన్స్ ప్రభుత్వం పత్రిక యొక్క సంపాదకుడు బెర్నేస్‌ని చట్టబద్ధంగా ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లించలేదనే నెపంతో పత్రికను మూసి వేసింది. పత్రిక ఎడిటోరియల్ బోర్డు వెంటనే డిపాజిట్‌ను ప్రభుత్వానికి చెల్లించినా ప్రభుత్వం అంగీకరించక పోవడంతో నెలవారీ పత్రికగా మార్చాలని ఎడిటోరియల్ బోర్డు నిర్ణయించింది.

1845 జనవరి 16 న ఫ్రెంచ్ ప్రభుత్వం మార్క్స్, కవి హీన్, బర్గర్స్, బకునిన్ తదితరులపై బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసింది. జర్మన్, ఫ్రెంచ్ ప్రభుత్వాల నిరంకుశచర్యలను వామపక్ష పత్రికలు తీవ్రంగా ఖండించాయి. జర్మనీలోని మితవాద వార్తాపత్రికలు, మ్యాగజైన్స్ మాత్రం ఫ్రెంచ్ ప్రభుత్వ చర్యను ప్రశంసించాయి. పారిస్‌లో గడిపిన 13 నెలలు కాలంలో మార్క్స్ వర్గ పోరాటాల యొక్క గొప్ప అనుభవాలను ప్రత్యక్షంగా ఎదుర్కొన్నాడు. ఉహాజనిత సోషలిస్టు సిద్ధాంతాల ప్రభావం ఫ్రాన్స్‌లో ఎంత ప్రబలంగా ఉందో మార్క్స్ తన జీవితంలో మొట్టమొదటిసారిగా చూశాడు. ఫ్రెంచ్ కార్మికవర్గంపై ఉహాజనిత సోషలిస్టు సిద్ధాంతం చూపిన ప్రభావాన్ని మార్క్స్ గుర్తించారు. దీని ప్రభావంతో మార్క్స్ శాస్త్రీయ సోషలిజాన్ని సాధించే దిశగా ఆలోచనలు చేశారు.

ప్రష్యాలో ఉన్నప్పుడు మార్క్స్ తన జీవితంలో మొదటిసారి పారిస్‌లోని కార్మికవర్గంలోని వివిధ వర్గాలతో సంభాషించాడు. కార్మికుల జీవితాలు, బాధలు, పోరాటాల నుండి ప్రత్యక్ష అనుభవాన్ని పొందాడు. పారిస్‌లో మార్క్స్ పొందిన అనుభవం సమీప భవిష్యత్తులో శాస్త్రీయ సోషలిజాన్ని సూత్రీకరించడానికి అతనికి సహాయపడింది. 1845 ఫిబ్రవరి 3న బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌ను మార్క్స్ – జెన్నీలు వదిలి వెళ్ళారు. తన దగ్గరున్న ఫర్నీచర్‌ను తక్కువ మొత్తానికి విక్రయించిన మార్క్స్ పసిపాప జెన్నీతో కలిసి కొద్ది రోజుల వ్యవధిలో బ్రస్సెల్స్‌కు వెళ్లారు. 13 నెలల క్రితం కొత్త దృక్పథాన్ని వెతుక్కుంటూ బ్రస్సెల్స్‌కు వెళ్ళిన మార్క్స్ విప్లవాత్మక ప్రజాస్వామ్యవాదిగా, భౌతికవాదిగా, కమ్యూనిస్టుగా అభివృద్ధి చెంది పారిస్‌కి తిరిగివచ్చారు. ఇక మార్క్స్ ముందున్న ఏకైక ఎజెండా ఏంగెల్స్‌తో కలిసి కొత్త విప్లవాత్మక తత్వశాస్త్రాన్ని సృష్టించడం, అభివృద్ధి చేయడం.

**అనువాదం: కె హరికిశోర్**

అంతర్జాతీయం

# సామ్రాజ్యవాద దోపిడీతో పెరుగుతున్న వలసలు

**విజయప్రసాద్**



రచయిత ప్రముఖ పాత్రికేయుడు

అన్యాయమైన వాణిజ్య విధానాలు, పర్యావరణ సంక్షోభాలతో బడుగు దేశాలు ధ్వంసమవుతుండటంతో ఉత్తర ఆఫ్రికా ప్రాంతం నుండి వలసలు అనివార్యమవుతున్నాయి. ఇందుకు మూలకారణాలను అన్వేషించి బాధ్యతలను చేపట్టేందుకు పెట్టుబడిదారీ దేశాలు నిరాకరిస్తుండటం సహారా ప్రాంతం నుండి మధ్యధరా ప్రాంతానికి పొట్టచేతపట్టుకుని వలసబాట పడుతున్న వలసదారుల జీవన్మరణ రేఖను మరింత విస్తరిస్తోంది. ఇలా పొట్ట చేతపట్టుకుని మధ్యధరా సముద్ర ప్రాంతానికి చేరుకుంటున్న శరణార్థులు మధ్యధరా సముద్రంలో ప్రయాణించేందుకు విముఖత చూపుతున్నారు. అయితే వలసల జీవన్మరణ సమస్యతో పోరాడుతున్న వారు అనివార్య పరిస్థితుల్లో లిబియా తీర ప్రాంతం నుండి తమకు అందుబాటులోకి వచ్చిన రద్దీ బోట్లలో ఎక్కి సముద్ర మార్గాన ప్రయాణిస్తుండటం వారి జీవితాలను మరింత ప్రమాదంలోకి నెడుతోంది. పశ్చిమ, తూర్పు ఆఫ్రికా ప్రాంతాలలో పంటలు పండక బీళ్లుగా మారిన పొలాలను విడిచి వలసబాట పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీనితో పాటు సూడాన్ తదితర ఆఫ్రికన్ దేశాలలో కొనసాగుతున్న అంతర్యుద్ధాలతో బతుకు జీవుడా అనుకుంటూ పొట్ట చేతన పట్టుకుని సుదూర ప్రాంతాలకు వలస బాట పడుతున్న ఈ శరణార్థులకు తాము ఎక్కడ తేలుతామో తెలియని పరిస్థితి నెలకొంటోంది. వలసపాలనా కాలంలో స్వర్గధామంగా కన్పించిన ఐరోపా దేశాలకు వారు వలసబాట పడుతున్నారు. పాత వలస సిద్ధాంతాలు, ఐరోపా సంపద అంతా వలస కార్మికుల శ్రమశక్తిపై పెరిగిందే. ఇది భూమికి దుర్భరమైన మృత్యు ఘోషగా మారుతోంది. అనేక మంది ఆఫ్రికన్ల కథ లిబియాలోని వర్చువల్ కాన్‌సట్రేషన్ కాంపుల్లో ముగుస్తోంది. ఐరోపా వైపు కన్నెత్తి కూడా చూడని కొందరు ఆఫ్రికన్లు ఇక్కడి నుండి బానిసలుగా అమ్ముడు పోయారు. లిబియా వెళ్లేందుకు వలసదారులు, శరణార్థులు సుదీర్ఘమైన సహారా ఏడారిని అధిగమించాల్సి వుంటుంది. అరబ్బీ భాషలో మహా ఎడారి (అల్ సహారా అల్ కుబ్రా) అని పేరొందిన ఈ ప్రాంతం అత్యంత వేడి ప్రాంతం, అత్యంత ప్రమాదకరమైన ప్రాంతం. అజలాయ్ పేరుతో ఒంటెలతో నడిచే పాతకాలపు రథాలు, బండ్ల వంటి వాహనాలు మాలి, నైగర్, లిబియా మధ్య ప్రయాణిస్తుంటాయి. వీటికి సారథ్యం వహించే టువారెగ్ ప్రజలు ఇందులోనే బంగారం, ఉప్పు, ఆయుధాలు, తాము బంధించిన మానవులను తరలించి వాటితో వ్యాపారం చేస్తుండే వారు. జలవనరులుండే ప్రాంతాలకు తరచు ప్రయాణించే ఇటువంటి పాత వాహనాలను ఇప్పటికీ ఈ ప్రాంతంలో చూడవచ్చు. ఇప్పుడు ఈ పాత వాహనాల స్థానంలో కొత్తవి వచ్చినప్పటికీ, వాటిని ఒంటెలకు కట్టి నడపటం లేదు. వీరంతా ఇప్పుడు బస్సుల్లో ప్రయాణించటానికి ప్రాధాన్యతనిస్తున్నారు. మనుషులు, కొకెయిన్ వంటి వాటిని ఐరోపా దేశాలకు తరలించటానికి, డబ్బును దక్షిణ ప్రాంతాలకు తరలించటానికి పికప్ ట్రక్కులు, జీపుల వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. ఈ కొత్త కారవాన్‌లు ఇసుక తిన్నెల మధ్య సంచరిస్తూ, గతంలో ఇసుక తుపానుల్లో చిక్కుకుని సమాధి అయిపోయిన వాహనాల జాడల కోసం గాలిస్తుంటాయి. సహారా ప్రాంతం అత్యంత ప్రమాదకరమైనది. ఈ ప్రాంతంలో పికప్ ట్రక్‌లో ప్రయాణించేందుకు కనీసం మూడు రోజులు పడుతుంది. ఈ ప్రయాణంలో వుండే శరణార్థులు, కొకెయిన్ సరఫరాదారులు తరచు దాహానికి గురై, తీవ్రవాదులు, స్మగ్లర్ల చేతుల్లో లేదా భద్రతా దళాల చేతుల్లో చిక్కి ప్రాణాలు కోల్పోతుంటారు. స్మగ్లర్ల చేతుల్లో చిక్కి ప్రాణాలు కోల్పోయే వారి వాహనాలు దొంగిలించేందుకు అనేక మంది సిద్ధంగా వుంటారు. మరణించిన వారికి సంబంధించి ఎటువంటి సమాచారమూ లభించదు. వలసదారులు తమ వాహనాలు నైజీరియన్ పట్టణాలు అగాడెజ్, డిర్కో వంటి నగరాల మధ్య చిక్కుకున్నపుడు దాహంతో, వేడి వాతావరణం దెబ్బతో మరణిస్తుంటారు. ఎడారి ప్రాంతంలో చిక్కుకునే వారి ప్రాణాలను రక్షించటం గతంలో ఎన్నడూ లేనంత అవసరమైపోతోందని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్‌లో నైగర్ చీఫ్ ఆఫ్ మిషన్‌గా వ్యవహరిస్తున్న గిసుప్ లోప్రెట్ చెబుతున్నారు.

### మూలాలు, మార్గాలు

అసలు వలసలు ఎందుకు ఏర్పడతాయి. అంతర్యుద్ధాలతో, అన్యాయమైన వాణిజ్య విధానాలతో తమ దేశాలు తుడిచిపెట్టుకు పోవటం, సంపద అంతా కొద్ది మంది చేతుల్లో మాత్రమే చిక్కి, అధికశాతం మంది ప్రజలు పేదరికంలో మగ్గుతుండటం వంటి కారణాలతో వలసలు సంభవిస్తుంటాయని పరిశీలకులు చెబుతున్నారు. 'మీరు అందించే వ్యవసాయ సబ్సిడీలు మా గొంతు నులుముతున్నాయి' అంటూ 2003లో మాలి, బుర్కినాఫాసో అధ్యక్షులు అమడావ్ తోమిన టూర్, బ్లైసే కాంపోర్ మీడియాలో రాసిన వ్యాసంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పండే పత్తి పంట ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశానికి టికెట్ వంటిది. పశ్చిమ, మధ్య ఆఫ్రికాల అభివృద్ధికి, అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది జీవనానికి ఇది కీలకం. అయితే ప్రపంచ వాణిజ్య సంస్థ అనుసరిస్తున్న వాణిజ్య విధానాలతో పత్తి (వస్త్ర)పరిశ్రమ పెనుముప్పును ఎదుర్కొంటోంది. ఇదే మా దేశ ప్రజలకు జీవనాధారం' అని వారు తమ కథనంలో పేర్కొన్నారు. ధనిక దేశాల ప్రభుత్వాలు తమ దేశాలలోని పత్తి రైతులకు భారీ సబ్సిడీలు

ఇస్తుండటంతో తమ ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాలు తమ రైతులకు 580 కోట్ల డాలర్ల మేర సబ్సిడీలిస్తుండగా ఒక్క అమెరికాలోనే 300 కోట్ల డాలర్ల సబ్సిడీలు రైతులకు అందుతున్నాయి. ఇది బుర్కినాఫాసోలో వున్న మొత్తం 2 కోట్ల మంది రైతుల ఉత్పత్తికన్నా ఎక్కువ. అగ్రరాజ్యాలు తమ రైతులకిస్తున్న సబ్సిడీలు ఆఫ్రికన్ రైతులను కుదేలు చేస్తున్నాయి. పశ్చిమాఫ్రికా ఆర్థిక వ్యవస్థ విధ్వంసానికి, ప్రస్తుత శరణార్థుల సమస్యకూ ఇదే ప్రధాన కారణం. ఇక వాణిజ్య యుద్ధాలు నిజమైన యుద్ధాల వంటివే.. సొంతరైతులకిచ్చే సబ్సిడీలు ఎదుటివారిపై బాంబుదాడులే... మాలిలో వున్న దాదాపు 25 లక్షల మంది ప్రజలు ఆకలిదప్పులతో అల్లాడుతున్నారు. అక్కడ ప్రతి పది మందిలో ముగ్గురు పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నవారే. ప్రతి ఐదుగురిలో నలుగురికి రక్తహీనత, ప్రతి నలుగురిలో ఒకరికి గుండె స్టెంట్‌ల అమరిక... ఇది మాలి ప్రజల ఆరోగ్య పరిస్థితి. ప్రపంచ బ్యాంకుకు చెందిన బౌబౌసిస్సె మాలి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సంక్షోభ పరిస్థితులపై పూర్తి అనాసక్తి కనబర్చిన ఆయన పోషకాహార లోపం వుంటే మరణించటం ఖాయమని గత ఏడాది వ్యాఖ్యానించారు. ఇది అందరినీ చంపేస్తుంది. దీని నుండి బయటపడిన స్త్రీ, పురుషులు మిగిలిన జీవితమంతా దీని ప్రభావాన్ని అనుభవించాల్సిందే' అని ఆయన అన్నారు. వాణిజ్య విధానాల ఫలితంగా ఏర్పడిన ఈ సంక్షోభం కేవలం నైతికంగా మాత్రమే కాక, తమ జాతీయ ఆర్థిక మనుగడ దృష్ట్యా కూడా ఏ మాత్రం ఆమోదయోగ్యం కానిదన్నారు. 2016లో మాలి ఎగుమతుల్లో 8 శాతం మేర వున్న బంగారం, పత్తి రెండూ బలహీనమైన రంగాలే. వాతావరణ మార్పులు, అంతర్జాతీయ ధర వరలు మాలి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. గత ఏడాది మాలి ఎగుమతులు గత ఐదేళ్ల కాలంలో అతి తక్కువ స్థాయికి పడిపోయాయని మాలి ఎగుమతి గణాంకాలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రతినిధి బృందం గత ఏడాది ఒక మీడియా సంస్థకు రాసిన వ్యాసంలో పేర్కొంది. బహుళజాతి కంపెనీలు మాలి నుండి బంగారాన్ని తమ దేశాలకు తరలిస్తుండటం, పశ్చిమ దేశాల సబ్సిడీలతో మాలి పత్తి పంటకు మార్కెట్ అవకాశాలు తగ్గిపోవటం, అసమతుల్యతతో కూడిన అభివృద్ధి వంటి పరిణామాలతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోందన్న విషయాన్ని ఎవరూ అంగీకరించటం లేదు.

> **"పశ్చిమ దేశాలు తమ రైతులకు 580 కోట్ల డాలర్ల మేర సబ్సిడీలిస్తుండగా ఒక్క అమెరికాలోనే 300 కోట్ల డాలర్ల సబ్సిడీలు రైతులకు అందు తున్నాయి. ఇది బుర్కినాఫాసోలో వున్న మొత్తం 2 కోట్ల మంది రైతుల ఉత్పత్తికన్నా ఎక్కువ. అగ్రరాజ్యాలు తమ రైతులకిస్తున్న సబ్సిడీలు ఆఫ్రికన్ రైతులను కుదేలు చేస్తున్నాయి. పశ్చిమాఫ్రికా ఆర్థిక వ్యవస్థ విధ్వంసానికి, ప్రస్తుత శరణార్థుల సమస్యకూ ఇదే ప్రధాన కారణం. ఇక వాణిజ్య యుద్ధాలు నిజమైన యుద్ధాల వంటివే."**



అత్యంత ప్రమాదకర మార్గంలో వలస వెళుతున్న ఆఫ్రికా పేదలు

ప్రభుత్వ ఖజానాకు చేరుతున్న నిధుల్లో సింహభాగం ఉగ్రవాదంపై పోరు, అల్‌ఖైదాపై పోరు పేరుతో భద్రతా రంగానికి తరలిపో తున్నాయి. మాలి వంటి దేశాలు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలకు పశ్చిమదేశాలకు చెందిన వివిధ వేదికలు, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ వేదికల నుండి ఎటువంటి సమాధానమూ లభించటం లేదు. ఈ వేదికలన్నీ చేతులెత్తేస్తూ, ప్రజలను నిర్వాసితులను చేస్తున్నాయి. తమ వాణిజ్య విధానాలను పునః పరిశీలించేందుకు లేదా మల్టి నేషనల్ మైనింగ్ సంస్థలను కట్టడి చేసేందుకు పశ్చిమ దేశాలు ఏ విధంగానూ ఆసక్తి చూపటం లేదు. ఆఫ్రికాలో బంగారం ఉత్పత్తిలో మూడో స్థానంలో వున్న మాలిని కెనడియన్ మైనింగ్ సంస్థలు చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఆఫ్రికా దేశాల నుండి ప్రస్తుతం కొనసాగుతున్న శరణార్థి, వలసల సమస్యను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సమస్యగా గుర్తించేందుకు పశ్చిమ దేశాలు ముందుకు రావటం లేదు. ఆఫ్రికాలోని దాదాపు సగానికి పైగా ప్రజలు కేవలం ఖండంలోని దేశాల మధ్యే శరణార్థులుగా, వలసదారులుగా వుంటూ పశ్చిమ దేశాలవైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితిని కూడా ఈ దేశాలు గుర్తించటం లేదు. సాహెల్ వెంట మారిటానియా నుండి చాడ్ వరకూ ఐరోపా దేశాలు, అమెరికా భారీ యెత్తున సైనిక బలగాలను మోహరించటం ప్రారంభించాయి. ఐరోపా తన సరిహద్దులను మధ్యధరా సముద్రం ఉత్తర తీరం నుండి సహారా ఎడారి దక్షిణ తీరం వరకూ విస్తరించుకుంది. దీనితో ఉత్తర ఆఫ్రికా సార్వభౌమాధికారానికి ముప్పు ఏర్పడుతోంది. ఫ్రాన్స్ తనకు తాను సృష్టించిన జి5 సాహెల్ ఇనీషియేటివ్‌తో ఐదు ఆఫ్రికా దేశాలు భాగస్వాములుగా ప్రత్యేక కూటమి ఏర్పడింది. ఈ ప్రాంతానికి ఫ్రెంచ్ సైనిక బలగాలతో భద్రత కల్పించేందుకు ఈ ఒప్పందం అవకాశాన్ని కల్పించింది. అగాదెజ్‌లో అమెరికా ఒక భారీ సైనిక స్థావరాన్ని నిర్మించింది. ఇక్కడి ప్రత్యేక దళాలు సాహెల్ నుండితమ కార్యకలాపాలను నిర్వహిస్తుండటంతో పాటు ఈ ప్రాంతం అంతా సాయుధ డ్రోన్‌లు కాపలా కాస్తుంటాయి. ఇప్పటి వరకూ ఎక్కడా ప్రస్తావనకు రాని ఒగాదుగో (బుర్కినాఫాసో), సోమాలియా నుండి ఎన్‌జామెనా (ఛాడ్) వరకూ విస్తరించిన మరి కొన్ని సైనిక శిబిరాలకు ఇది అదనం. మాగ్రెబ్‌లో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు శత్రువులుగా వున్న అల్‌ఖైదాపై ఐరోపా, అమెరికన్ సేనలు యుద్ధాన్ని తప్పనిసరిగా కొనసాగించాల్సిన పరిస్థితి. అసలు ఎవరీ ఉగ్రవాదులు? వీరిలో కొందరు 80వ దశకంలో ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా నేతృత్వంలోని జిహాదీల అనుభవంతో ఇప్పుడు కరుడుగట్టిన సాయుధులుగా

> **"చిన్నరైతులపై వివక్ష చూపుతున్న వాణిజ్య విధానాలు, కర్బన పెట్టుబడిదారీ విధానాలతో పంట పొలాలు ఎడారి భూములుగా మారుతున్న నేపథ్యంలో నిరాశ నిస్పృహలతో మధ్యధరా ప్రాంతానికి చేరుకుంటున్న శరణార్థులకు ఇది పెద్ద అడ్డంకిగా మారింది. దీనితో పాటు ఈ దేశాలలో విస్తరిస్తున్న కరువు పరిస్థితులు, నానాటికి పెరుగుతున్న ఎడారి ప్రాంతాలు ప్రజలకు కంటిపై నిద్ర లేకుండా చేస్తున్నాయి."**

మారారు. వీరంతా 2013లో అల్జీరియా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు పన్నిన మొక్తర్ బెల్‌మొక్తర్, అబ్దుల్ మాలిక్ డ్రోక్‌డెల్ వంటి వారే. అయితే వీరిది సంప్రదాయక మిలిటెంట్ పోరు కాదు. ఈ ప్రాంతంలో విచ్చల విడిగా చెలామణి అవుతున్న స్మగుల్డ్ సిగరెట్లను రవాణా చేసే స్మగ్లర్స్ రాకెట్‌ను రక్షించి వారి నుండి 10 నుండి 15 శాతం మేర పన్ను వసూలు చేస్తూ అల్ ఖైదా ఈ ప్రాంతంపై తన పట్టు బిగిస్తోంది. ఈ సంస్థకు చెందిన మిలిటెంట్ల లో అధికశాతం స్మగ్లింగ్ అంటేనే మక్కువ చూపు తారు. దీనితో టాంగో సరిహద్దు వద్ద జరిగే కాల్పుల ఘటనలు ఎక్కువగా అల్‌ఖైదా అమెరికా దళాల మధ్య కన్నా అమెరికన్ దళాలు స్మగ్లర్ల మధ్యే ఎక్కువగా చోటు చేసుకుంటుంటాయి. 'ఉగ్రవాదంపై పోరు' జరిగిన ప్రతిసారి ఒక అమెరికన్ సైనికుడు తుపాకీ పేలుస్తాడు. ప్రమాదకరమైన ఈ ఎడారి ప్రాంతంలోకి శరణార్థుల వెల్లువను కట్టడి చేసేందుకు సరిహద్దులు మూయటం లేదా తెరవటం కానీ, డ్రోన్‌లతో స్పెషల్ ఆపరేషన్‌లు కానీ చేపట్టాల్సిన అవసరం లేదు. ఎక్కడయినా సంఘర్షణలకు మూల కారణం. ఒక్కటే పర్యావరణాన్ని విచ్ఛినం చేయటం, పలువురి శ్రమతో సాధించిన సంపద కేవలం కొందరి గుప్పిట్లో చిక్కుకోవటం. దీనినే మనం పెట్టుబడి దారీ విధానం అంటున్నాం. ఈ పరిస్థితులే యుద్ధానికి దారి తీయటంతో పాటు ప్రజలను నిర్వాసితులుగా మారుస్తున్నాయి. పేదల మధ్య జాతులు, మతపరమైన చిచ్చు పెట్టి ప్రపంచాన్ని యుద్ధం వైపు నెడుతున్నాయి.

### జి5 సాహెల్ ఒప్పందం

వలసదారులు మధ్యధరా ప్రాంతానికి చేరటాన్ని నిరోధించేందుకు తమ జి5 సాహెల్ ఒప్పందంలో భాగస్వాములు కావాలని ఫ్రాన్స్ ఐదు ఆఫ్రికా దేశాలు (బుర్కినాఫాసో, ఛాడ్, మాలి, మారిటానియా, నైగర్)ను కోరింది. సహారా ఎడారి కిందుగా ఆఫ్రికా దేశాలను



సాహిల్ స్థావరంలో ఫ్రెంచ్ సైనికులు

చుట్టివచ్చే భద్రతా వలయం ఈ సాహెల్. ఈ ప్రాజెక్టులో ఐరోపా కూటమి కూడా భాగస్వామి గా వుంది. ఈ ప్రాజెక్టుకు ఫ్రాన్స్ ఆర్థికంగా అండదండలు సమకూర్చింది. ఇందులో ఛాడ్ ప్రభుత్వ ప్రోత్సాహం కూడా వుంది. ఈ ప్రాజెక్టులో అభివృద్ధి నిధుల కన్నా ఉగ్రవాదంపై పోరు నిధులే ఎక్కువ. నైజీరియాకు చెందిన బొకోహరాం ఉగ్రవాద గ్రూపు అక్కడి నుండి ఛాడ్‌లోకి ప్రవేశించిందన్న మాట నిజం. అయితే నైజీరియాతో పోల్చుకుంటే ఈ గ్రూప్‌తో ఛాడ్‌కు వున్న ముప్పు తక్కువేనని చెప్పవచ్చు. నైజీరియాలో 120కి పైగా ఉగ్రదాడులు చేసిన బొకోహరాం గ్రూప్ ఛాడ్‌లో కేవలం నాలుగు దాడులు మాత్రమే చేసింది. ఈ నేపథ్యంలో ఫ్రెంచ్ బలగాలు మాలి లేదా నైగర్‌లోకాకుండా ఛాడ్‌లో ఎందుకు తిష్ట వేస్తున్నాయి. జి5 సాహె ల్ బలగాల ఏర్పాటు వెనుక ఉగ్రవాదంపై పోరా లేక ఈ ఒప్పందంలోకి అమెరికా చొచ్చుకు రావటమా? ఐరోపా కూటమి దేశాలు తమ పరిధిని మధ్యధరా సముద్ర తీరం నుండి సహారా ఎడారి దక్షిణ ప్రాంతం వరకూ విస్తరించాలని కోరుకుంటున్నాయి. సాహెల్ మొత్తం ఫ్రెంచ్ సైనిక బలగాలు తమ స్థావరాలను నిర్మించు కుంటున్నాయి. అమెరికా ఇప్పటికే అగాడెజ్ (నైగర్)లో భారీ సైనిక స్థావరాన్ని నిర్మించింది. ఇక్కడ సైనిక దళాలకు డ్రోన్‌ల మద్దతు కూడా వుండటం గమనార్హం. వలసదారులను అడ్డుకునేందుకు సైన్యం సాహెల్‌లోకి ప్రవేశించింది. అగాడెజ్‌లో సైనిక, డ్రోన్‌ల స్థావరాలను నిర్మించేందుకు దాదాపు 10 కోట్ల డాలర్లకు పైగా ఖర్చు పెట్టిన అమెరికా సైన్యం ప్రస్తుత సంక్షోభానికి కారణమైంది. చిన్నరైతులపై వివక్ష చూపుతున్న వాణిజ్య విధానాలు, కర్బన పెట్టుబడిదారీ విధానాలతో పంట పొలాలు ఎడారి భూములుగా మారుతున్న నేపథ్యంలో నిరాశ నిస్పృహలతో మధ్యధరా ప్రాంతానికి చేరుకుంటున్న శరణార్థులకు ఇది పెద్ద అడ్డంకిగా మారింది. దీనితో పాటు ఈ దేశాలలో విస్తరి స్తున్న కరువు పరిస్థితులు, నానాటికి పెరుగుతున్న ఎడారి ప్రాంతాలు ప్రజలకు కంటిపై నిద్ర లేకుండా చేస్తున్నాయి. సూడాన్ అంతర్యుద్ధంలో ఎడారీకరణ పాత్రను మనం విస్మరించలేం. భూమండలాన్ని ప్రమాద పుటంచుల్లోకి నెడుతున్న కర్బన పెట్టుబడిదారీ విధానాన్ని మనం పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న అంతర్యుద్ధాలలో ఎడారీకరణ పాత్ర కీలకంగా మారుతోంది. ఇది సాహెల్‌లో కొన్ని అంశాలను నిర్వచిస్తోంది. సాహెల్‌లో వ్యవసాయాదాయం తగ్గిపోతుం డటం తో ఇక్కడి ప్రజల్లో కొన్ని వర్గాలు స్మగ్లింగ్ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నాయి. దక్షిణ అమెరికాకు చెందిన కొన్ని కొకెయిన్ మాఫియాలు ఇక్కడ తిష్ట వేస్తుండటంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఇక్కడ ప్రధాన సమస్యగా మారుతోంది. 2012లో ఐరాస వెలువరించిన అంచనాల ప్రకారం దక్షిణ అమెరికా నుండి దాదాపు 30 టన్నుల కొకెయిన్ సాహెల్ ద్వారా ఐరోపాకు చేరినట్లు తెలుస్తోంది. ఈ స్మగ్లింగ్‌లో స్మగ్లర్లకు దాదాపు 120 కోట్ల డాలర్లకు పైగా లాభాలు వచ్చాయి. సెంట్రల్ అమెరికా నుండి అమెరికాకు కొకెయిన్ తరలించటాన్ని అమెరికా ప్రభుత్వం కట్టడి చేయటంతో కొకెయిన్ మాఫియా తన కార్యకలాపాలను సెంట్రల్ ఆఫ్రికా దేశాలకు మార్చింది. నైగర్‌లో 2016లో మరణించిన 'మిస్టర్ కొకెయిన్' చెరిఫ్ ఊల్డ్ అబిడిన్ అక్కడ ప్రముఖ రాజకీయ వేత్తగా చెలామణి అయ్యాడు. వందల కోట్ల డాలర్ల విలువైన కొకెయిన్ సాహె ల్ ద్వారా సహారా ప్రాంతం నుండి ఐరోపాకు తరలి వెళ్లింది. శరణార్థులను తరలిం చే పికప్ ట్రక్‌లు ఈ అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషించాయి. ఇక్కడే ఫ్రెంచ్ మల్టీ నేషన ల్ కంపెనీలు యురేనియం తవ్వకాలు ప్రారం భించాయి. ఫ్రాన్స్ విద్యుత్ వెలుగుల్లో నైగర్ యురేనియం నిక్షేపాలదే కీలక పాత్ర. అందువల్ల మనకు ఇక్కడ శరణార్థులు, కొకెయిన్, యురేని యం, సైనిక దళాలు కీలకంగా కన్పిస్తుంటాయి.

# ఉద్యోగుల మెడపై కత్తిగా సాంకేతికాభివృద్ధి

బి అర్జున్

మూడు దశాబ్దాల నాడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించే పేరుతో ఆరంభమైన సరళీకరణ ప్రక్రియ ఇప్పుడు క్రమంగా క్షీణిస్తోంది. మితవాద భూతం మళ్లీ తలెత్తుతోంది. ప్రపంచాన్ని వేధిస్తున్న వలసల సమస్యపై ఆయా దేశాల స్పందన, జాతి వివక్ష, మతోన్మాదాలకు పెరుగుతున్న ఆకర్షణ వంటి అంశాలు క్షీణిస్తున్న సరళీకరణవాదానికి నిలువెత్తు సాక్ష్యాలు. ప్రతీకారం, జాతి వివక్ష, మతోన్మాదం, సెన్సార్‌షిప్, ప్రభుత్వ నిఘా వంటి అంశాలకు చట్టబద్ధత కల్పించటం తదితరాలతో గుత్తాధిపతుల నియంతృత్వం ప్రతీకారేచ్ఛతో తిరిగివస్తున్నది. సరళీకరణవాదులు కమ్యూనిజంలో వెదికిన లోపాలన్నీ ఇపుడు వారిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వాలకు యధాతదవాదం ప్రధాన సైద్ధాంతికాంశంగా మారుతున్నది. ఇటీవల ముగిసిన జి-20 సదస్సులో పాల్గన్న మెజార్టీ దేశాలు... దాదాపు అన్ని దేశాలకు చెందిన నేతలందరూ మితవాద యధాతథవాద విధానాలకు చెందినవారే. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వాస్తవాన్ని విశ్వయవనికపై ఆవిష్కరించారు. సరళీకరణ విధానాలకు కాలం చెల్లింది. ఈ మధ్యకాలంలో సరళీకరణ వాదులు దేనినీ, ఎవరినీ శాసించలేని స్థితికి చేరుకున్నారు' అని ఆయన వ్యాఖ్యానించారు.

రష్యా అనుసరిస్తున్న అంతర్జాతీయ వైఖరిని గట్టిగా సమర్థించుకోవటంతో పాటు పుతిన్ ఇటీవలి కాలంలో ఐరోపాపై విమర్శల దాడి ఉధృతం చేశారు. తన ప్రత్యర్థులు డిమాండ్ చేస్తున్నట్లే ఆయన అట్లాంటిజం (రష్యా పశ్చిమ దేశాలవైపు మొగ్గు చూపే ధోరణి) నుండి దూరం జరుగుతున్నారు. పుతిన్ ఇప్పుడు అనుసరిస్తున్న విధానానికి యూరాసియనిజం మూలం అని చెప్పవచ్చు. 'సాంస్కృతిక మూలాలను కోల్పోకుండానే సాంకేతిక, సామాజిక ఆధునీకరణ వైపు అడుగులు వేయటాన్ని యూరాసియనిజం అని పరిశీలకులు చెబుతున్నారు. వామపక్ష సిద్ధాంతానికి కాలం చెల్లిందని, సరళీకరణ, స్వేచ్ఛా మార్కెట్ విధానాలదే అంతిమ విజయమని అమెరికన్ వ్యాఖ్యాత ఫ్రాన్సిస్ ఫుకుయామా 90వ దశకం ఆరంభంలో ప్రకటించినట్లుగానే ఒక భావజాలం మరణించిందని పుతిన్ ప్రకటించటం 'తొందరపడి ఓ కోయిల ముందే కూసి'నట్లుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో కమ్యూనిజాన్ని అపఖ్యాతిపాలు చేయటం, ఓడించటమే లక్ష్యంగా సరళీకరణ విధానాలను తెరపైకి తెచ్చిన నేపథ్యంలో ఫుకుయామా చెప్పిన వ్యాఖ్యలు సమర్థనీయమేనని వారంటున్నారు. 'చరిత్ర అంతం' గురించి ఫుకుయామా చేసిన అపరిపక్వ వ్యాఖ్యలు 'మితవాద విద్రోహులు' సరళీకరణ వాదుల మధ్యనే ఉన్నారన్న అంశాన్ని వదిలివేశాయి. కమ్యూనిజాన్ని ఓడించటం కోసం మితవాదులు, సరళీకరణ వాదుల మధ్య ఏర్పడిన ఐక్యత శాశ్వతమని భావించినందు వలన ఆయన ఈ వ్యాఖ్యలు చేసి ఉండవచ్చు. ఫుకుయామా అనుభవం లేనివాడు. మితవాదం సరళీకరణ వాదంతో కలిసి మనుగడ సాగించలేదన్న విషయం ఆయనకు అర్థం కాలేదు. కమ్యూనిస్టులను ఎదుర్కొనేందుకు పెట్టుబడిదారులు ఆడుతున్న క్రీడలో సరళీకరణ వాదులు పావులుగా మారుతున్నారన్న విషయాన్ని ఆయన అర్థం చేసుకోలేకపోయారు. కమ్యూనిస్టులను ఓడించిన తరువాత ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం సరళీకరణ వాదులను, సోషల్ డెమొక్రాట్లను లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో సరళీకరణవాదులు, మితవాదులు నయా సరళీకరణ సామాజిక, ఆర్థిక విధానాలవైపు మొగ్గు చూపటంతో ధనిక, పేదల మధ్య వ్యత్యాసం మరింత విస్తరించింది. పెరుగుతున్న అసమానతలు సరళీకరణ విధానాలు కేంద్రంగా ఉన్న వ్యవస్థపై విద్వేషాన్ని పెంచుతున్నది. మిత వాదులు ఈ విద్వేషాన్ని వినియోగించుకోవటం ప్రారంభించారు. పెట్టుబడిదారీ విధానంపై పెరుగుతున్న ప్రజాగ్రహాన్ని సరళీకరణవాదులపైకి మళ్ళించటం ద్వారా పెట్టుబడిదారీ విధానానికి కొమ్ము కాస్తున్నారు. గుర్తింపుకు సంబంధించిన అంశాలను ముందుకు తెస్తూ జనాకర్షణ నినాదాలను మరింత రెచ్చగొట్టటం ద్వారా దీనిని సాధించారు. చరిత్రను మర్చిపోయే ప్రయత్నాన్ని ఎవరూ చేయరాదు. సరళీకరణ వాదం పెట్టుబడిదారీ విధానానికి మొదటి ఎంపిక కాదు. 1930 నాటి మహామాంద్యం, కమ్యూనిస్టులు పురోగమిస్తున్న పరిస్థితులలో పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించుకునేందుకు బ్రిటిష్ ఫాబియనిజం, అమెరికన్ న్యూడీల్ వంటి విధానాలను కాలానుగుణంగా ఉపయోగించుకున్నారు.

**సాంకేతికాభివృద్ధితో ఉదారవాద క్షీణత**

ఈ నేపథ్యంలో సరళీకరణ విధానంపై పుతిన్ చేసిన ప్రకటనను విశ్లేషిస్తే ప్రపంచంలో ప్రజాస్వామ్య భవిష్యత్తు అర్థమవుతుంది. సరళీకరణ విధానాలకు కాలం చెల్లటాన్ని మార్క్సిస్టు దృక్కోణం నుండి పరిశీలిస్తే పెట్టుబడిదారీ విధానానికి ఇకపై సరళీకరణ విధానాలు ఏ మాత్రం అవసరం లేదన్న అంశం స్పష్టమౌతుంది. ఇక్కడ మనం ఒక ప్రశ్న అడగాల్సిన అవసరం వుంది. ఉదారవాదులను వదులుకొనే ధైర్యం వారికి ఎలా వచ్చింది? బహుళ సంస్కృతుల నుండి మితవాదులకు ఎదురవుతున్న ముప్పు ఏమిటి? వారెందుకు మధ్యతరగతిని పీల్చి పిప్పి చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం కావా

**"పెట్టుబడి, శ్రామికశక్తి మధ్య సంబంధాలను సాంకేతిక పరిజ్ఞానం మార్చటం మొదటి అంశం. పెట్టుబడి ఎప్పుడూ శ్రమశక్తిని భారం గానూ, అనవసరమైన తలనొప్పిగానే పరిగణిస్తుంది. ఒక ఫ్యాక్టరీలో కార్మికులను పెట్టుబడి ఎల్లపుడూ అవసరమైన చెడుగానే చూస్తుంది. బూట్ల నుండి విమానాల ఇంజన్ల వరకూ కృత్రిమ మేధస్సు సాయంతో తయారు చేసే రోబోలు, త్రిడి ప్రింటర్ల రంగ ప్రవేశంతో పెట్టుబడిదారులు స్థానిక, స్థానికేతర శ్రామికుల అవసరం లేకుండానే సరుకులను తయారు చేయగలమన్న భావనకు వస్తున్నారు."**



**ఉత్పత్తిలో పాల్గొంటున్న రోబోలు**

లంటే మనం రోబోటిక్స్ తెస్తున్న మార్పులను, కలకలాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. 80వ దశకం ఆరంభంలో పశ్చిమ దేశాలకు చెందిన పెట్టుబడిదారులు తమ ఫ్యాక్టరీలకు అవసరమైన శ్రమశక్తిని చౌకలో సాధించేందుకు చైనా, ఆగ్నేయాసియా దేశాల బాట పట్టారు. తమతో పాటే వారు కాలుష్యాన్ని కూడా అటు తరలించారు. దీనితో ఉదారవాద విధానాల చట్టాల గుదిబండలను వదిలించుకొని సామ్రాజ్యవాద కేంద్రాలలో ప్రశాంతతను పాదు కొల్పారు. ఫ్యాక్టరీలను తరలించిన తరువాత పశ్చిమదేశాల పెట్టుబడిదారులు ద్రవ్య రంగాన్ని సరళీకరించటం ద్వారా ధనార్జన చేసే అంశంపై దృష్టి కేంద్రీకరించారు. ఆ సమయంలోనే రంగప్రవేశం చేసిన కంప్యూటర్లు వారు తమ పెట్టుబడులను అతివేగంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు సహకరించాయి. ఇదంతా ప్రపంచీకరణ తాజా దశగా పేర్కొన్నారు. అంగీకారం లేదా బలవంతం చేయబడటం ద్వారా ఒక దాని తరువాత మరొకటిగా దేశాలన్నీ వరుసగా 'వాషింగ్టన్ ఏకాభిప్రాయం' రూపొందించిన సరళీకరణ బాట పట్టాయి. ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో అమెరికన్ సామ్రాజ్యవాదం పతాకస్థాయికి చేరింది. పెట్టుబడిదారీ విధానానికి 2008 నాటి ద్రవ్య సంక్షోభం ఎదురయే వరకు ఇది కొనసాగింది. చైనా ఎదుగుదల, పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాల వంటి అంశాలు ఉన్నప్పటికీ, అందుబాటులోకి వస్తున్న అధునిక సాంకేతిక పరిజ్ఞానం తనను ఆధిక్యతలోఉంచుతుందనే నమ్మకంతో అమెరికా తన సామ్రాజ్యాన్ని కాపాడుకోగలనని ధీమాతో ఉంది.

పెట్టుబడి, శ్రామిక శక్తి మధ్య సంబంధాలను సాంకేతిక పరిజ్ఞానం మార్చటం మొదటి అంశం. పెట్టుబడి ఎప్పుడూ శ్రమశక్తిని భారం గానూ, అనవసరమైన తలనొప్పిగానే పరిగణిస్తుంది. ఒక ఫ్యాక్టరీలో కార్మికులను పెట్టుబడి ఎల్లపుడూ అవసరమైన చెడుగానే చూస్తుంది. బూట్ల నుండి విమానాల ఇంజన్ల వరకూ కృత్రిమ మేధస్సు సాయంతో తయారు చేసే రోబోలు, త్రిడి ప్రింటర్ల రంగ ప్రవేశంతో పెట్టుబడిదారులు స్థానిక, స్థానికేతర శ్రామికుల అవసరం లేకుండానే సరుకులను తయారు చేయగలమన్న భావనకు వస్తున్నారు. ఒక అంతస్తులోని షాపు నిర్వహణ, పర్యవేక్షణ వంటి అంశాలు ఇప్పుడు ఒక బటన్ నొక్కి తెలుసుకునేంత సులువుగా అందుబాటులోకి వచ్చేశాయి. ఇప్పుడు కేవలం వర్కర్లు మాత్రమే కాదు, బ్లూ కాలర్ ఉద్యోగులు, ఉన్నత స్థాయి మేనేజర్ల వంటి వారు కూడా ఉత్పత్తి ప్రక్రియ నుండి క్రమంగా కనుమరుగై పోతున్నారు. సమీప భవిష్యత్తులో కార్మికులు, యజమాని మధ్య సారధిగా ఒక విద్యావంతుడైన ఉద్యోగి అవసరం పెట్టుబడిదారులకు ఉండకపోవచ్చు. ఇంతకు ముందు ఉద్యోగులు సెలవు, పనిగంటల నియంత్రణ వంటి అంశాల కోసం పోరాడేవారు. ఇప్పుడు కంపెనీలు ఉద్యోగులను ఇంటి నుండే పనిచేయమని అడుగుతున్నాయి. 'పనే దైవం'గా భావించాలని ప్రచారం చేసిన వారే ఇప్పుడు వారానికి మూడు పనిదినాలు మాత్రమే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇటు భారత ప్రధాని మోడీ మీడియాతో వ్యవహరిస్తున్న విధానంలో ఈ ధోరణి స్పష్టంగా కన్పిస్తోంది. ప్రజలతో నేరుగా ముఖాముఖి అయ్యేందుకు సోషల్ మీడియా అందుబాటులోకి వస్తుండటంతో జర్నలిస్టులు, రిపోర్టర్లు వృధా అన్న భావన ఇరువురిలోనూ క్రమంగా బలపడుతోంది. రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు అధికార యంత్రాంగం అవసరం లేకపోవచ్చు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నగదును నేరుగా పేద ప్రజల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తుండటమే ఇందుకు కారణం. దీనితో తమను క్రమంగా అణచి వేస్తున్నారన్న భావన మధ్యతరగతి వర్గంలో క్రమంగా పెరుగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నిరుద్యోగితకు దారి తీస్తోందన్న అంశం పెట్టుబడిదారీ విధానానికి క్రమంగా అర్థమవుతోంది. భారీగా పెరుగుతున్న నిరుద్యోగులలో రాయితీలు పొందేవారి సంఖ్యను సాధ్యమైనంతగా తగ్గించటానికి ప్రయత్నిస్తున్నారు. అందుకోసమే మితవాదులు వలసలను, బహుళ సంస్కృతులను వ్యతిరేకి స్తున్నారు. చివరిగా పెట్టుబడిదారీ విధానం యథాతథంగా కొనసాగాలనే వారు ప్రజాకర్షక విధానాల వెనుక ఎందుకు తలదాచుకుం టున్నారు? పెట్టుబడిదారులు ఎప్పుడూ తిరుగు బాటు వస్తుందనే భయంతో తల్లడిల్లుతుంటారు. అది తన ఆస్తులను కాపాడుకోవటానికి అంతర్గతంగాశాంతి కావాలని కోరుకుంటుంది. కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిదారుల చేతుల్లో దృఢంగా ఉండటంతో ప్రపంచం ఇప్పుడు పతాకస్థాయి పెట్టుబడిదారీ విధానంవైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఇది ప్రస్తుతం మనం అనుభవిస్తున్న నియంతృత్వ విధానం కన్నా మరింత దారుణం గా వుండబోతోంది. ❋

ఈ మాసం ప్రత్యేకం

# తెలంగాణా పోరాటంలో స్త్రీల వీరోచిత పాత్ర



రచయిత సిపిఐ(ఎం)
మాజీ ప్రధాన కార్యదర్శి

కామ్రేడ్ సుందరయ్య

తెలంగాణా పోరాటంలో స్త్రీలు చాలా ప్రముఖ పాత్ర వహించారు. భూమికోసం అధిక వేతనాల కోసం, భూస్వాముల ధాన్యాన్ని, పశువులను పంపిణీ చేసుకోవటం మొదలైన వాటి కోసం జరిగిన పోరాటాల్లో వారు పురుషులకు తీసిపోలేదు. అడవులలో నుండి, చిన్న చిన్న గూడేల నుండి కోయ, చెంచు మొదలైన వారందరినీ తరిమి వేసే 'బ్రిగ్స్ పథకాన్ని' పురుషులతో సమానంగా స్త్రీలూ ఎదిరించారు.

నైజాం – రజాకార్ వ్యతిరేక పోరాటం లోనూ, తర్వాత నెహ్రూ సైన్యాలకు, కాంగ్రెస్ గూండాలు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడటం లోనూ, తమ అన్నదమ్ములతో, భర్తలతో పాటు స్త్రీలూ పాల్గొన్నారు. వారూ దళాలలో చేరారు. చీమలు దూరని చిట్టడవులలో, దూరానికి నునుపుగా వుండే కొండల్లో, గుట్టల్లో మిగతా అన్ని దళాలతోపాటే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కష్టసుఖాలు పంచుకున్నారు. స్త్రీలు కూడా కొరియర్లుగా, రాజకీయ ఆందోళనకారులుగా కూడా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యమం కొత్తగా విస్తరిస్తున్న ప్రాంతాలలో ప్రజా ఉద్యమా లలోనూ, ప్రజాసంఘాలలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించారు. రజాకార్, నైజాం పోలీసులు, ఆ తర్వాత నెహ్రూ సైన్యాలు జరిపిన అమానుష, చిత్రహింసలకు ఎక్కువగా గురైంది, బలైందీ స్త్రీలే! స్త్రీలనే విచక్షణ లేకుండా చాలామందినీ శతఅవులు చింత బరికలతో వొళ్లు పెట్టిపోయేట్లు బాదారు. వారిని అవమానించారు. చివరికి పశుత్వంతో స్త్రీల శీలంతోనే చెరలాటలాడారు. తమ కళ్లముందే తమ ప్రాణంలో ప్రాణం అయిన కన్న బిడ్డలను హింసిస్తుంటే, తమ అన్నదమ్ములను, భర్తలను అరెస్టు చేసి కాల్చి చంపుతుంటే భరించవలసివచ్చింది. శత్రువు దుర్మార్గాల నుండి తప్పించుకునేందుకో, గెరిల్లా దళాలలో చేరేందుకో, రహస్యజీవితం గడిపేందు కనో తమ ఇళ్ళలో మగవారు వెళ్లిపోతే పోలీసు లూటీల తర్వాత మిగిలివున్న కొంపా గోడూ కాపాడుకోవలసిన బాధ్యత స్త్రీల పైనే బడింది.

తమ ఆత్మగౌరవం కాపాడుకునేందుకు ఆ కిరాతక సైనికుల దౌర్జన్యానికి తమ ధనమాన ప్రాణాలు బలిగాకుండా రక్షించుకునేందుకు, స్త్రీలు చూపిన దీక్ష, పోరాట పటిమ మనలనుఉత్తేజ పరుస్తాయి. నాడు వారిలో కలిగిన వినూత్న చైతన్యం, నైతిక, సాంస్కృతిక జీవనంలో స్త్రీలలో కలిగిన సరికొత్త మార్పు ఇవన్నీ తలచు కుంటే ఆర్థికంగా, సాంఘికంగా అణగారిన మన స్త్రీ జాతిలో ఎంతటి విప్లవదీక్ష, శక్తి ఇమిడి వున్నా యోనని ఆశ్చర్యానందాలు కలుగుతాయి. వారిని సాంప్రదాయాల సంకెళ్ల నుండి విడిపించి, నిద్రాణమైన ఆ శక్తిని రగల్కొల్పేందుకు కొంచెం శ్రమ తీసుకోవాలే గాని, ఎంతటి శక్తివంతమైన తిరుగుబాటునైనా తీసుకురాగలం!

### భూమి నిలుపుకోవటంలో స్త్రీల పాత్ర

విసునూరు దేశముఖ దురాక్రమణకు గురి కాకుండా తన భూమిని నిలబెట్టుకునేందుకై ఆంధ్ర మహాసభ – కమ్యూనిస్టు పార్టీల సహకారంతో మొట్ట మొదట తీవ్రంగా పోరాడింది జనగామ తాలూకా పాలకుర్తి గ్రామానికి చెందిన చాకలి ఐలమ్మ. ఎన్ని కష్టాలచ్చినాసరే తన కొడుకులను, కూతుళ్లను కూడా పార్టీకి అండగా నిలబడమని ప్రోత్సహించిందామె. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలకు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు ఆ వూళ్లో వారిల్లే కేంద్రం. అది ఆమె స్వార్థంకోసం జరిగిన పోరాటం కాదు. తెలంగాణా రైతు 'గడ్డ' కోసం జరిపిన పోరాటపు తొలిదశ కామె చిహ్నం.

మిర్యాలగూడెం తాలూకా ముకుందాపురం లో ఒక షావుకారు, కుమ్మరి మట్టయ్యను భూమి స్వాధీనం చేయమని బలవంతపెట్టాడు. మట్టయ్య అంగీకరించకపోవటంతో నెహ్రూ సైన్యాల సహకారంతో మట్టయ్యను చిత్రహింసలు పెట్టి, చివరికి చంపేయించాడు. కాని మట్టయ్య భార్య రంగంలో దూకింది. ఈ భూమిని ససేమిరా వదిలేది లేదంది. ఆమెను పోలీసులు పశుత్వంతో చెరిచారు. అయినా ఆమె దిగజారి పోలేదు. ఆ గ్రామ ప్రజలందరినీ తమ భూమికోసం జరిగే పోరాటంలో సహకరించమని వారిని కదిలించి తమభూమిని నిలుపుకుంది. "అవును! ఆ భూమి నాది!!" ఇదే ఆమెమాట.

భూమిని తనకు అప్పగించనందుకు వాడపల్లిలో ఒక లంబాడీ రైతును భూస్వామి హత్య చేయించాడు. అతని భార్య కూడా పోరాటంలోకి దిగి, కాంగ్రెస్ పోలీసుల బీభత్సాన్ని యెదిరించి భూమి నిలుపుకుంది.

కొండప్రోలులోనూ ఇంతే. భూమి తిరిగి తనకే దక్కాలని, దత్తుడు అనే భూస్వామి 2 ఎకరాల మాగాణి భూమి సాగు చేసుకుంటున్న లంబాడి రైతును చంపేయించాడు. కానీ రైతు భార్య ముందుకు వచ్చి ఆ భూమిని తానే నిలుపుకొంది. సిలారుమియాగూడెంలో భూమిని భూస్వామికి స్వాధీనం చేయనందుకు గొల్ల ముత్తయ్యను చంపేశారు. ఆయన భార్య మాత్రం ఆ భూమి తిరిగి భూస్వాముల వశం కాకుండా పోరాడి సాధించింది..

మొద్దులకుంటలో ఒక లంబాడి రైతు రామకృష్ణమ్మ అనే భూస్వామికి చెందిన కొద్ది భూమిని ఆక్రమించుకున్నాడు. నెహ్రూ సైన్యాల ప్రవేశం అనంతరం ఆ భూమిని పోలీస్‌ల సహాయంతో తిరిగి స్వాధీనం చేసుకొనటానికి ఆ భూస్వామి ప్రయత్నించాడు. ఆ లంబాడి రైతును చితక బాది, యింట్లోంచి పొలంలో నుంచి వెళ్లగొట్టారు. అయినా ఆయన భార్య మాత్రం తలగ్గలేదు. ఆ భూమిని దున్నుకుని పంటను యింటికి చేర్చుకోగలిగింది.

వీరారం గ్రామంలో తన భూమిని భూస్వామి తిరిగి ఆక్రమించుకుంటుంటే, ఒక లంబాడీ రైతు, అతని భార్య కలిసి భూస్వాముల గూండాలను, పోలీసులను ఎదిరించారు.

**“భారత సైన్యాలు ప్రవేశించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత, హుజూర్ నగర్ తాలూకాలో విజయ నగరం కేంద్రంలోనూ, మిర్యాలగూడెంలోనూ పోలీసులు చాలా మంది పురుషులను పట్టుకొని లారీలలో ఎక్కించుకున్నారు. స్త్రీలందరూ లారీలను చుట్టుముట్టారు. పురుషులందరినీ విడుదల చేయవలసిందిగా డిమాండ్ చేశారు. పదేపదే లాఠీచార్జీ చేసినా వారు జంకలేదు. గత్యంతరం లేక పురుషులనక్కడే వదిలేసి వెళ్ళిపోవలసి వచ్చింది.”**



తెలంగాణా పోరాట గెరిల్లా దళాలలో మహిళలు

పోలీసులు గర్భవతిగానున్న ఆమె పొట్టపై కాలేసి తొక్కి చంపారు. తెలంగాణా పోరాటానికి సంబంధించిన పాత ఫైళ్ళలో కనిపించిన కొన్ని ఘటనలివి. ఇలాంటి ఘటనలు వందలాదిగా జరిగాయి. నాడు ఆ పోరాటం మొత్తం కాలంలో ఎన్ని జరిగాయన్నది అలా వుంచండి! వేలాది స్త్రీలు తమ పురుషులతో పాటు రంగంలో నిలబడి భూమికోసం, దక్కిన భూమిని నిలుపుకోవటం కోసం పోరాడారు.

**కూలి పెంపుదల కోసం స్త్రీల పోరాటం**

వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో ఒక్క పురుషుని సంపాదనతోనే సంసారం జరగదు. ఆ కుటుంబాలలోని చాలామంది స్త్రీలు తాము కూడా కూలికి వెళ్ళి సంపాదించనిదే తమకు, తన బిడ్డలకు పూటన్నా కడుపు నిండటం అసాధ్యం. అందువలననే వ్యవసాయ కార్మిక సమ్మెల లోనూ, భూస్వాముల, దొరల గడీలలోని గిడ్డంగులలోని ధాన్యం స్వాధీనం చేసుకుని పంచుకోనటంలోను స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండ్రపల్లి ప్రాంతంలోనూ ఆ పరిసర ప్రాంతాలలోనూ కూలి రోజుకు రెండు లేక మూడు శేర్లుండేది. దాన్ని 4 శేర్లకు పెంచవలసిందని కూలీల సమ్మె జరిగింది. స్త్రీలు పెద్ద సంఖ్యలో కదిలారు. జెండాలు చేతబూని ప్రదర్శనలు చేశారు. భూస్వాములను లొంగదీసేందుకు, వారి ధాన్యపు కొట్లపై దాడి జేసి ధాన్యం స్వాధీనం చేసుకోవడం మొదలెట్టారు. భూస్వాములులొంగివచ్చి ఆ కూలికి వొప్పుకొనక తప్పలేదు.

గోదావరి తీర అడవులలో బీడిఆకు కోత ఒక పెద్దవృత్తి. వేలాది స్త్రీలు దానితో జీవనం గడుపుతారు. బీడి ఆకు కోతకు హెచ్చు కూలీ కావాలని జరిగిన పోరాటంలో స్త్రీలు ముందు పీటీన నిలిచారు.

పిండిప్రోలు, ఇల్లెందు పరిసర ప్రాంతాలలో 90 గ్రామాలలో వ్యవసాయ కార్మిక సమ్మెలు జరిగాయి. దాదాపు 20 గ్రామాలలో ప్రత్యేకించి స్త్రీ కూలీల వేతనాల సమస్య ఇమిడి వుంది. ఈ గ్రామాలలో స్త్రీలే ముందున్నారు.

పోలీసు నిర్బంధకాండకు దాడులకు వ్యతిరేకంగా, నిజాం రజాకార్ వ్యతిరేక పోరాట దినాలలో కూడా బాలేముల, పాత సూర్యాపేట, మల్లారెడ్డి గూడెం, దేవరుప్పల తదితర అనేక గ్రామాలపై సాయుధ సైనికులు దాడిచేసినప్పుడు వారిని వడిశలలతో ప్రతిఘటిస్తున్న పురుషుల పక్కనే స్త్రీలు నిలబడి వడిశలలకి రాళ్లందించారు. ఈ కార్యక్రమంలో నిమగ్నమైన ఒక స్త్రీ మల్లారెడ్డిగూడెంలో పోలీసు కాల్పులలో బలైపోయింది. (ఈ సందర్భంగా గాజుల్లంకలో మరణించిన వియ్యమ్మ గుర్తుకు వస్తున్నది. ఆమె చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా కృష్ణా జిల్లాలో పోరాడుతున్నప్పుడు, పోలీసులామెను సన్నీలతో పొడిచి చివరకు కాల్చి చంపారు.) పురుషులను మిలిటరి లారీలలో యెక్కించుకుపోతుంటే తనను కూడా వారితోపాటు తీసుకుపోవాలని, వారినేమి చేసినా తాము అందులో భాగం పంచుకోవాలని స్త్రీలు లారీలను నిలిపివేశారు. చివరకు వీళ్లను కూడా కొంతమందిని లారీలలో యెక్కించుకుంటే తప్ప లారీలు కదిలేవి కావు.

భారత సైన్యాలు ప్రవేశించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత, హుజూర్ నగర్ తాలూకాలో విజయనగరం కేంద్రంలోనూ, మిర్యాలగూడెంలోనూ పోలీసులు చాలామంది పురుషులను పట్టుకొని లారీలలో ఎక్కించుకున్నారు. స్త్రీలందరూ లారీలను చుట్టుముట్టారు. పురుషులందరినీ విడుదల చేయవలసిందిగా డిమాండ్ చేశారు. పదేపదే లాఠీ చార్జీ చేసినా వారు జంకలేదు. గత్యంతరం లేక పురుషులనక్కడే వదిలేసి వెళ్ళిపోవలసి వచ్చింది.

గోదావరి అడవులలో గుండాల కోయగూడెంలో పోలీసులు చాలామంది మగవాళ్లను పట్టుకుని, వాళ్లను తీసుకుపో యత్నించుతుండగా, ఈ సంగతి తెలియటం తోటే, పక్కనే వున్న 10 గూడేల నుండి స్త్రీలు కదిలి వచ్చారు. పోలీసులను చుట్టుముట్టారు. పోలీసుల కాల్పులు సాగించారు. అయినా చెట్ల చాటునుండి రాళు విసురుతూ పోలీసులను నిలేశారేగాని వారు చెదిరిపోలేదు. చివరికి పోలీసులు మగవారిని వదిలి వెళ్ళక తప్పలేదు.

గుండాల ప్రాంతంలోనే, కట్టగూడెం అనే కోయపల్లెపై మిలటరీ దాడిచేసినప్పుడు, గూడెంలోని స్త్రీలు, పురుషులు కలిసి ప్రతిఘటించారు. వారు ఒక సుబేదారును మగ సైనికులను చంపి వారి ఆయుధాలను గుంజుకున్నారు. సైన్యం పారిపోయింది. తర్వాత సైన్యం పెద్ద బలగాన్ని సమికరించుకుని మళ్లీ ఈ గూడేలపై దాడికి వచ్చింది. గూడెం మొత్తంగా నట్టడివిలోకి వెళ్లి తలదాచుకుంది. ఆ సందర్భంలో స్త్రీలు చూపిన ఓర్పు, సహనం, దీక్ష మరపురానివి. చివరికి వాళ్ళ పిల్లలు ఏడిస్తే శతృవుకు తమ ఉనికి తెలిసిపోతుందని, వారిని ఏడవకుండా నోళ్లు మూశారు. ఆ సందర్భంలో ఎదురైన యెన్నో ఇబ్బందులను ఎదుర్కొని స్త్రీలలో ఉన్న పట్టుదల, కృతనిశ్చయం, గట్టితనం, దృఢత్వాన్ని నిరూపించారు. ❋

## మామిడాల సుబ్బారావు

(2వ పేజీ తరువాయి)

దళ సభ్యులు ఒక్కసారిగా బలయ్యేవారు. 25 మంది ప్రాణాలు రక్షించిన అతన్ని దళసభ్యులందరూ ప్రాణదాతగా భావించుకున్నారు.

పగలు ఒక రోజు అడవిలో నిరాయుధుడిగా ప్రయాణిస్తున్న కామ్రేడ్ సుబ్బారావుని ఒక ద్రోహి పోలీసులకు పట్టించారు. పోలీసువారు సుబ్బారావుకు కాఫీలు, టిఫిన్‌లు, పానీయాలు, పొగడ్తలతో చుట్టాలు చేసే మర్యాదలన్నీ చేశారు. తనకు తెలిసిన వివరాలన్నింటినీ చెప్పాలనీ, లొంగదీసుకోడానికి చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశారు. అయితే కామ్రేడ్ సుబ్బారావు లొంగలేదు. పోలీసులు బెదిరించినా బెదరలేదు. తనకేవిషయాలూ తెలియవనే సమాధానాన్నే చెబుతూ వచ్చారు. సావధానంగా అడిగారు. అయినా ఏమీ చెప్పలేదు. అప్పటివరకూ శత విధాలా ప్రయత్నించి విసుగెత్తిన పోలీసులు ఇక లాభం లేదనుకుని లాఠీలు చేతబుచ్చుకున్నారు. కాళ్లు, వేళ్లు విరగగొట్టారు. ప్రతిరోజూ చితక బాదారు. ఒళ్లంతా తూట్లు పొడిచారు. ఒళ్లంతా బొబ్బలు కట్టి పుళ్లు పడ్డాయి. గొంతుతడారి పోతోంది. పెదాలు చిట్లి కారిన రక్తం గడ్డకట్టింది. కళ్లు లొట్టలు పోయాయి. గొంతు పెగలటం లేదు. స్పృహ కోల్పోయారు. స్పృహవచ్చేంత వరకూ ఉండి, గోళ్లల్లో గుండు సూదులు గుచ్చేవారు. అరచేతిలో గోలీలను ఉంచి కుర్చీకాళ్ల కిందఉంచి తొక్కించేవారు. పోలీసుల హింసతో ఒళ్లంతా పుండైంది. ఎర్రగా కాల్చిన ఇనుప చువ్వలని ఛాతిపై, వీపుపై ఉంచారు. కామ్రేడ్ మామిడాల సుబ్బారావు రక్తంతో తడిచి ముద్దయ్యారు. ఎన్నో చిత్రహింసలతో కూడిన బాధలను అనుభవించారు. పూర్తిగా స్పృహకోల్పోయారు.

అన్ని చిత్రహింసలు పెట్టినా నోరువిప్పి ఒక్కమాటైనా చెప్పలేదు. ప్రతిఘటించారు. అలా ఒక్క రోజుకాదు. నెల రోజులు భయంకరమైన నరకయాతన అనుభవించారు. చెక్ దేశస్థుడైన జూలియస్ ఫ్యూజిక్ వలే పోరాడారు. వజ్రసంకల్పాన్ని సడలనీయలేదు. ఒక్కమాట జారలేదు. ఎవరికీ నష్టం జరుగలేదు. ఇంత పట్టుదల గల మనిషిని ఇంతకు ముందెన్నడూ చూడలేదని పోలీసులు నిర్ఘాంతపోయారు. మహా మొండి వాడన్నారు. అసలు వీడు మనిషే కాదన్నారు. తన పట్టుదల ఏమాత్రమూ వదులుకోలేదన్నారు. పోలీసు క్యాంప్‌లో జరుగుతున్న సంఘటనలు ఏరోజుకారోజుబజారు కొట్లవద్దకు పోలీసువారు వచ్చినప్పుడు కథలు కథలుగా చెప్పుకునేవారు. ఈ వార్తలు వినుకొండ చుట్టూ ఉన్న గ్రామ గ్రామాలకు చేరుతూనే ఉన్నాయి. ఈ వార్తలు కామ్రేడ్ రత్తయ్యను, ఇతర దళ సభ్యులను దహించివేశాయి. ఎంత ఆలోచించినా ప్రయోజనం కనిపించలేదు. కామ్రేడ్ సుబ్బారావు రహస్యాలు చెప్పి ఉంటే దళ సభ్యులుగాక నాయకులుకూడా పట్టుబడి ఉండేవారు. వారిని కాల్చిచంపి ఎదురు కాల్పుల్లోమరణించినట్లుపేపర్లలో ప్రకటించే వారు. అటువంటి సంఘటనలు అనేకం జరిగాయి.

నెలరోజులు చిత్రహింసలు పెట్టి విసిగిపోయిన పోలీసులు తమ ఆఖరి అస్త్రాన్ని ప్రయోగించారు. తెలిసిన రహస్యాలు చెప్పక పోతే కాల్చి చంపుతామని బెదిరించారు. అప్పుడు కామ్రేడ్ మామిడాల సుబ్బారావు పోలీసులకు గుండెచూపి కాల్చుకోండన్నారు. 'నా ప్రాణం ఉల్లిగడ్డ పైపొరతో సమానం' అన్నారు. 'పై పొరలెన్ని తీసినా ఉల్లిగడ్డ ఘాటుని తీసివేయలేరన్నారు.' పోలీసులు నిర్ఘాంత పోయారు. చివరికి అన్నంతపనీచేశారు పోలీసులు. కామ్రేడ్ మామిడాల సుబ్బారావును బొల్లాపల్లి అడవుల్లో కాల్చిచంపారు. అవసాన దశలో కూడా సన్నగిల్లని అతని పట్టుదల, విప్లవదీక్ష అందరికీ ఆదర్శం. గొప్పదేశభక్తుడు, ఆదర్శప్రాయుడు, ప్రాణదాత. ఈ వీరయోధుడు నేటి యువతరానికి, భావితరాలకూ ఆదర్శ మూర్తి. బ్రిటీష్ సామ్రాజ్య ప్రభుత్వాన్ని పారదోలడానికి తమ ప్రాణాలను సైతం లెక్కచేయక గుండెలు ఎదురొడ్డి ఉరికంబాలెక్కిన స్వాతంత్ర్య పోరాట వీరులు, విప్లవయోధులు ఎంతోమంది త్యాగమూర్తుల మార్గంలోనే పయనించిన విప్లవ జ్యోతి కామ్రేడ్ మామిడాల సుబ్బారావు అమరజీవి.

*(గుంటూరుజిల్లా అమరవీరులు పుస్తకం నుంచి)*

## అంతానికి చేరిన నయా ఉదారవాదం

(9వ పేజీ తరువాయి)

రాజకీయలలోకి తీసుకొచ్చి వారిని పెంచుతుంది. వారి ద్వారా ఫాసిస్టు భావజాలాన్ని జొప్పిస్తుంది. ఇదంతా ప్రజాతంత్ర పునరుద్ధరణ పేరుతోనే జరుగుతుంది. ఇక్కడ ప్రజాతంత్ర పునరుద్ధరణ అంటే ఉదారవాద విధానాల పునరుద్ధరణే. అవన్నీ అవసరమైన ఫలితాలను ఇవ్వకపోతే వెనిజులాలో జరిగినట్టు ఆర్థిక యుద్ధం ప్రారంభ మవుతుంది. ఆ తరువాత సైనిక చర్యే. మూడో ప్రపంచ దేశాలలో నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం పతనం అవుతున్న కొద్దీ సామ్రాజ్యావాదం ఎలా ప్రవర్తించబోతుందో అన్నదానికి ఈ నాటి వెనిజులాయే గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. ఇటువంటి దేశాలలో మరిన్ని తిరుగుబాట్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ జోక్యాల్లో రెండు పార్శ్వాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఒకటి, ప్రపంచీకరణ యుగంలో ద్రవ్య పెట్టుబడి అధికారంలో అభివృద్ధి చెందిన సామ్రాజ్య వాద దేశాల మధ్య వైరుధ్యాలు స్తబ్దుగా ఉండాలనుకోవడం. రెండోది, మిత వాదుల నుండి ఉదారవాదుల వరకు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి జోక్యానికి మద్దతు ఉండడం. పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా సంక్షో భంలో మునిగిపోతుండగా రాజ్యం జోక్యం చేసుకొని దాన్ని పునరుద్ధరించాలన్న ఆలోచన మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే వచ్చినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తరువాత గాని అది వాస్తవ రూపం దాల్చలేదు. ఈ రోజు సంక్షోభం నుండి ఎలా బయట పడి తిరిగి పుంజుకోవాలనే అంశంపై నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి ఒక ఆలోచన అంటూ లేదు. పైగామూడో ప్రపంచ దేశాలలో ఫాసిజాన్ని అమలుచేయడం, సామ్రాజ్యవాదం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం ఎల్లకాలం కొనసాగలేవు. ప్రజల ఆగ్రహం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించేటట్టు చేస్తుంది.

**అనువాదం : కె. ఉషారాణి**


## సామాజిక న్యాయం అస్తిత్వవాదం

(7వ పేజీ తరువాయి)

నామమాత్రమనో మనం భావించేంతగా ఉంటుంది) ఆర్థిక ఉద్యమం అనివార్యతను ముందుకు తెస్తుంది. అలా లేకపోతే ఏ సామాజిక దశలోనైనా సిద్ధాంతాన్ని అమలులో పెట్టటం చిన్నపాటి లెక్కకు సమాధానం చెప్పినంత తేలిగ్గా జరిగిపోతుంది" (ఫ్రెడరిక్ ఎంగెల్స్ 1890లో జె.బ్లాక్‌కు రాసిన లేఖలో)

ప్రత్యేకించి కేంద్రంలోనూ, అత్యధిక రాష్ట్రాలలోనూ మతోన్మాద బిజెపి అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ కృషికి మరింత ప్రాధాన్యత ఏర్పడుతోంది. మన ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ బిజెపి ఎదుగుదల ప్రమాదం పొంచి ఉన్నదనే విషయం మన దృష్టిలో ఉండాలి. బిజెపిని ఎలా నిలువరించాలి? కేవలం ఎన్నికల ఎత్తుగడల ద్వారా అది సాధ్యం కాదు. వైజాగ్ పార్టీ అఖిలభారత మహాసభలో చెప్పినట్లు రాజకీయ కృషికి ఉదార ఆర్థిక విధానాలను ఎదుర్కొనే కృషిని జోడించాలి. దాంతోబాటు సామాజిక, సాంస్కృతిక, విద్యారంగాలపై కేంద్రీకరించి, క్షేత్రస్థాయిలో ఉద్యమాలు నిర్వహించగలిగితేనే మన లక్ష్యం సాధించగలం. రాబోయే కాలంలో ఈ దిశగా ముందుకు సాగుదాం. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-08-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20



# వలస, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటాలు

## హరికిషన్‌సింగ్ సూర్జిత్

"భారత కార్మికవర్గం అది జన్మించినప్పటి నుంచి వేతనాల విషయంలోను, పనిగంటల విషయంలోను, గృహవసతి తదితర సమస్యలపైనా విపరీతమైన దోపిడికి గురవుతూ వచ్చింది. భద్రతా చర్యలు తీసుకోవడం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడటంతో తరచు ప్రమాదాలకు గురవడం జరుగుతూ వుండేది. 19వ శతాబ్దం మధ్యకాలాన్నుండే 'గో స్లో', వాకౌట్ తదితర రూపాల్లో వారు తమ నిరసనను వ్యక్తం చేస్తూ ఉండేవారు. కార్మికులు అనైక్యతను పెంచేందుకు కుల, మత విభేదాలు, జాతి, సంస్కృతి విభేదాలను పెట్టుబడిదారులు రెచ్చగొడుతూ తమ పబ్బాన్ని గడుపుకునేవారు. కార్మికుల్లో చైతన్యం, పరిపక్వత లేమి వలన, ట్రేడ్ యూనియన్‌లు లేనందువలన ఉద్యమాల పెరుగుదలకు ఆటంకంగా పరిణమించేది. ఒకవైపున వలస విధానం, మరోవైపున పెట్టుబడిదారుల దోపిడీ వలన ప్రజలు దారిద్ర్యానికి గురయ్యేవారు. దేశంలో గల వర్గ వైరుధ్యాలను ఆధారం చేసుకొని జమీందార్లు, వడ్డీ వ్యాపారస్తులు ప్రజలను దోచుకునేవారు. ఒకవైపున దేశం పారిశ్రామికవంతం అవుతూ ఉండగా మరోవైపున కరువు కాటకాల వలన, పంటలు దెబ్బతినడం వలన దారిద్ర్యం విస్తృతంగా వ్యాపించింది. 1825–1850 సంవత్సరాల మధ్య కరువు నాలుగు లక్షల మందిని బలిగొన్నది. 1850–1865 మధ్య ఆరుసార్లు, 1875–1900 మధ్య ఎనిమిదిసార్లు ప్రజలు కరువు వాతపడ్డారు. ఈ విధంగా మొదటిసారి 50 లక్షల మంది, రెండోసారి 60 లక్షల మంది క్షామ పరిస్థితులకు బలయ్యారు. 19వశతాబ్దం ఆఖరి దశాబ్ద కాలంలో అత్యంత శక్తివంతంగా జౌళి, జనపనార, రైల్వే సమ్మెలు జరిగాయి. ఈసమ్మెల్లో ఇతరులు కూడా చేరడం సంభవించింది. ఇవన్నీ క్రమంగా ఆర్థికపరమైన డిమాండ్ల నుండి రాజకీయ మలుపులు తీసుకొని కొంతవరకు స్వాతంత్ర్య ఉద్యమానికి తోడ్పడినాయి. స్వదేశీ ఉద్యమంతో ఏకమై ఈ పోరాటాలు ఈ శతాబ్దం మొదటి దశాబ్దంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాల రూపం తీసుకున్నాయి. ఈ పోరాటాలు, ముఖ్యంగా 1908లో బొంబాయిలో జరిగిన జనరల్ సమ్మె లెనిన్‌ను ఉత్తేజపరిచాయి. అందుకే ఆయన ఇలా వ్యాఖ్యానించారు. "ఇండియాలో రచయితలు, రాజకీయ నాయకులు వీధుల్లోకి రావడం ప్రారంభమైంది."

"మరోవైపున బ్రిటిష్ పాలకులు ధనికవర్గాల ప్రయోజనాలను కాపాడుతూ, జాతీయ ఉద్యమంలోని మితవాద నాయకులను తమ వైపుకు తిప్పుకునేందుకు అనేక రాజకీయ చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. బ్రిటిష్ పాలనను సమరశీలతతో ఎదుర్కొనే వారిని అమానుషమైన రీతిలో అణిచివేసేందుకు 1904–1914 మధ్య కొన్ని చట్టాలను చేశారు. స్వదేశీ ఉద్యమాలు భారతదేశంలోని బూర్జువా వర్గంలోని ముఖ్య భాగాన్నుండి సానుభూతిని సంపాదించుకున్నవి. విదేశీ వస్తువుల బహిష్కరణ మూలంగా స్వదేశీ పెట్టుబడిదారులు లబ్ధి పొందటానికి స్వదేశీ ఉద్యమం ఉపయోగపడింది. ఉదాహరణకు భారతీయ వస్త్రాల ధరలు ఎనిమిది శాతం పెరగ్గా, బ్రిటిష్ వారి వస్త్రాల ధరలు 25 శాతం తగ్గాయి. ఈ రకంగా స్వదేశీ మనస్తత్వం ప్రజల్లో పెరిగింది. ఇది ఇలా ఉండగా 1907 తరువాత ముఖ్యంగా 1905–1907 మధ్య రష్యాలో జరిగిన మొదటి బూర్జువా విప్లవ ప్రభావంతో జాతీయ ఉద్యమంలో వివిధశక్తులు ఉత్తేజాన్ని పొందాయి. చివరికి దాదాబాయి నౌరోజీ సహితం కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో అధ్యక్ష పీఠం నుండి ప్రసంగించుతూ భారతదేశానికి స్వపరిపాలనా హక్కును నిరాకరించడం పట్ల తన క్రోధాన్ని వెలిబుచ్చారు. ఆనాడు రష్యన్ విప్లవం జయప్రదం కానప్పటికీ ఆ దేశ ప్రజలు కొన్ని ప్రయోజనాలను సాధించుకున్న విషయాన్ని ఉదాహరణగా ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు."

"ఆ తరువాత దశాబ్దంలో ప్రజా ఉద్యమాలు తగ్గిపోవడంతో యువజనుల్లో ఒక భాగం వర్గ చైతన్యంతో నిమిత్తం లేకుండా తీవ్రమైన దేశభక్తి భావంతో టెర్రరిస్టు మార్గాలను అనుసరించింది. వారిని అత్యంత క్రూరమైన పద్ధతుల్లో బ్రిటిష్ పాలకులు అణచివేశారు. దేశ స్వాతంత్ర్యాన్ని సాధించే విషయంలో వారి భావాలు ఎంతగా ఊహాజనితమైనప్పటికీ, పెటీ బూర్జువా వర్గం నుండి వచ్చిన ఆ యువత నిస్వార్థమైన త్యాగం కొనియాడదగినది. విదేశీ ఆధిపత్యాన్నుండి మాతృభూమిని విముక్తి చేయాలనే వారి ఆకాంక్ష, త్యాగపూరితమైన చర్యలు పట్టణ, పల్లె ప్రాంతాల్లోని సామాన్య ప్రజానీకం అభిమానాన్ని, సంఘీభావాన్ని చూరగొన్నాయి. వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అత్యంత విలువైన భాగంగా వుంటాయి. ప్రపంచాన్ని తమ మధ్య విభజించుకోవాలనే ఉద్దేశంతో సామ్రాజ్యవాద దేశాల మధ్య ఏర్పడిన వైరుధ్యాల ఫలితమే 1914–18 మధ్యజరిగిన మొదటి ప్రపంచ యుద్ధం. ఈ యుద్ధం అవసరాల కోసం భారతదేశంలో త్వరితగతిన పరిణామాలు జరగడంతో నూతన పరిస్థితి ఏర్పడింది. దేశంలోని మొత్తం ఆర్థిక విధానమంతా యుద్ధ అవసరాల కోసం మార్చబడింది. తత్ఫలితంగా రైతాంగం, కార్మికవర్గం కష్టాలకు గురికావలసి వచ్చింది. సరిగ్గా ఇదే పరిస్థితిని భారత బూర్జువా వర్గం తన సౌభాగ్యాన్ని పెంపొందించుకునేందుకు సంపూర్ణంగా ఉపయోగించుకున్నది."

*(హరికిషన్ సింగ్ సూర్జిత్ రచించిన "భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానం" గ్రంథం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.4. Published on August 1, 2019